మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 252 | శనివారం | 3 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

ఫారెస్టు బీట్ ఆఫీసర్ల పరీక్ష ఫలితాలపై స్టే

టిఎస్‌పిఎస్‌సికి హైకోర్టు ఆదేశం

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలను రెండు నెలల పాటు నిలిపివేయాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి ఎమ్మెస్ రామచందర్‌రావు ఆదేశించారు. అటవీశాఖలో 1857 బీట్ ఆఫీసర్ తరువాయి 6లో

|ఛత్తీస్‌గఢ్‌లో భారీ| ఎన్‌కౌంటర్



10 మంది మావోయిస్టులు

ఒక సిఆర్‌పిఎఫ్ జవాన్ మృతి

- మరణించిన నక్సల్స్‌లో ఆరుగురు మహిళలు
- హరిభూషణ్ మృతిపై అనుమానాలు
- మృతుల్లో ఆయన భార్య సమ్మక్క
- ఘటనాస్థలి నుంచి ఆయుధాలు, నగదు స్వాధీనం



మన తెలంగాణ/ భద్రాచలం: తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో శుక్రవారం ఉదయం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఆరుగురు మహిళా మావోయిస్టులు ఉన్నారు. మృతుల వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించాల్సి ఉంది. కాల్పుల్లో గ్రేహౌండ్స్ జవాన్ సుశీల్ కుమార్ సైతం ప్రాణాలు కోల్పోయాడు. మృతి చెందిన కానిస్టేబుల్‌తో పాటు ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను ప్రత్యేక హెలీకాప్టర్‌లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మిగతా మృతదేహాల తరలింపులో జాప్యం ఏర్పడటంతో శనివారం చేర్చే అవకాశం ఉన్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతమైన పూజార కాంకేర్ జిల్లా సమీపంలోని ఊసూరు పోలీస్ స్టేషన్‌కు సుమారు 25 కి.మీ దూరంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ కాల్పుల్లో మావోయిస్టు పార్టీ పది మందిని కోల్పోయింది. వారిలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్, అతని భార్య సమ్మక్క, అలియాస్ శారద ఉన్నట్లు తెలుస్తోంది. మరో నేత దామోదర్ అలియాస్ బడే చొక్కారావు, సాగర్‌లు కూడా ఉన్నట్లు సమాచారం. ఇంకా ఎవరెవరు మృతి చెందారు అనే దానిపై పోలీసులు స్పష్టత ఇవ్వడం లేదు. మావోయిస్టులు సమావేశం తరువాయి 6లో

కేంద్రంపై దూకుడు

రాష్ట్రానికి రావలసిన నిధులపై బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు టిఆర్‌ఎస్ సిద్ధం

నేడు సిఎం కెసిఆర్‌తో ఎంపిల సమావేశం



మన తెలంగాణ/ హైదరాబాద్ : పార్లమెంటు మలివిడత బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వంపై దూకుడు ప్రదర్శించేందుకు టిఆర్‌ఎస్ సిద్ధమవుతోంది. విభజన హామీలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులపై పార్లమెంటులో నిలదీసేందుకు సమాయత్తమవుతోంది. ముఖ్యంగా వ్యవసాయం, రైతులు కేంద్రంగా టిఆర్‌ఎస్ తన వాణిని బలంగా వినిపించేందుకు కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా టిఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి తరువాయి 6లో

స్పైసెస్‌బోర్డు ఆఫీసులో తెలంగాణకు ప్రత్యేక సెల్

మంత్రి కెటిఆర్ విజ్ఞప్తికి స్పందించిన కేంద్రం



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలోని పసుపు రైతుల శ్రేయస్సు కోసం ప్రత్యేకంగా పసుపు బోర్డు ఏర్పాటు చేయాలన్న మంత్రి కెటిఆర్ విజ్ఞప్తిపై కేంద్రం స్పందించింది. ప్రస్తుతం పనిచేస్తున్న 'స్పైసెస్ బోర్డు' కార్యాలయంలో తెలంగాణ కోసం ప్రత్యేకంగా ఒక సెల్‌ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర మంత్రి కెటిఆర్‌కు కేంద్రమంత్రి సురేష్ ప్రభు శుక్రవారం రాసిన లేఖలో పేర్కొన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల తరువాయి 6లో

కృష్ణ నీటి వాటాలు

- శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులలోని 33.77 టిఎంసిలలో తెలంగాణకు 24.46, ఎపికి 9.3 కనీస నీటిమట్టం వరకు వినియోగించుకునేందుకు కృష్ణబోర్డు కేటాయింపు

మన తెలంగాణ / హైదరాబాద్ : కృష్ణా బేసిన్‌లోని నీటిని తెలంగాణ 24.46 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్ 9.3 టిఎంసిల చొప్పున వినియోగించుకునేలా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నిర్ణయం చేసింది. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జున తరువాయి 6లో

అతి వేగానికి ఐదుగురు బలి



- డివైడర్‌ను, బస్సును ఢీకొన్న కారు
- లోయలోకి జారిపోయిన బస్సు
- డ్రైవర్ చాకచక్యంతో తప్పిన పెను ముప్పు
- కారులోని ఐదుగురు మృతి
- కంది ఐఐటి వద్ద ఘోర ప్రమాదం

మన తెలంగాణ/ సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లాలోని కంది ఐఐటి వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందారు. అతివేగంగా వస్తున్న తరువాయి 6లో

4 వేల క్వింటాళ్ల పత్తి దగ్ధం

- సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని ఈశ్వరసాయి కాటన్ జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం
- రూ.2 కోట్ల మేరకు ఆస్తి నష్టం

7లో





'నీట్' పిజి అడ్మిషన్లపై జాగ్రత్త : మంత్రి లక్ష్మారెడ్డి

మన తెలంగాణ / హైదరాబాద్ : 'నీట్' విధానం అమలులోకి వచ్చినందువల్ల తెలంగాణ రాష్ట్రం మొదటిసారి జాతీయ పూల్‌లోకి చేరుతోందని, వైద్య రంగంలో పోస్టు గ్రాడ్యుయేట్ అడ్మిషన్ల ప్రక్రియను మరింత జాగ్రత్తగా చేపట్టాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. త్వరలో నిర్వహించనున్న 'నీట్' పీజీ అడ్మిషన్లపై వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో మంత్రి శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎండి, ఎంఎస్, పీజీ డిప్లొమో కోర్సుల్లో అడ్మిషన్లు ఈ ఏడాది 'నీట్' పద్ధతిలో జరుగుతాయన్నారు. మొదటిసారి రాష్ట్రం జాతీయ పూల్‌లో చేరినందున 50% సీట్లను పూల్‌కి వదలాల్సి వస్తుందని, రాష్ట్ర కోటా (కన్వీనర్) 35%, మిగిలిన 15% మేనేజ్‌మెంట్ కోటా అని పేర్కొన్నారు. అలాగే మన రాష్ట్ర విద్యార్థులు సైతం దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అడ్మిషన్లు పొందడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. రాష్ట్రం నుంచి 8 వేల మందికి ప్రవేశం లభించే అవకాశముందని తెలిపారు. తాజా పరిస్థితుల ఆధారంగా అడ్మిషన్ల ప్రక్రియను రూపొందించుకోవాలని, పొరపాట్లు లేకుండా సజావుగా జరిగేలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తెలంగాణ వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పన సంస్థ ఛైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎ.శాంతికుమారి పాల్గొన్నారు.



13 నాటి పరీక్షలు వాయిదా వేయండి



మన తెలంగాణ/హైదరాబాద్ : మార్చి 13న ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర బంద్ తలపెట్టినందున ఆ రోజు నిర్వహించే ఇంటర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ తెలంగాణ విద్యార్థి సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు శుక్రవారం ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఎ.అశోక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బంద్ ప్రభావంతో రవాణా సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది, కాబట్టి పరీక్షలను వాయిదా వేయాలని అన్నారు. ఇంటర్ బోర్డ్ కార్యదర్శిని కలిసిన వారిలో ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షులు రుద్రవరం లింగస్వామి మాదిగ, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురాంలతో పాటు పలు విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నారు.

రాష్ట్రంలో హై అలర్ట్

- సమాచారం లేకుండా గ్రామాలలో పర్యటించవద్దు
- ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు పోలీసుల సూచన



ఎన్‌కౌంటర్ మృతులను తరలించింది ఈ హెలికాప్టర్‌లోనే..

మన తెలంగాణ/హైదరాబాద్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తొండపాల్ వద్ద శుక్రవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్‌కౌంటర్ జరిగిన తీరుపై డిజిపి ఎం.మహేందర్‌రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం ఎస్‌పితో మాట్లాడి అన్ని వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఇదే భారీ ఎన్‌కౌంటర్ కావడంతో మావోయిస్టులు ప్రతీకార చర్యలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని నిఘావర్గాలు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఈ మేరకు అన్ని జిల్లాలు, కమిషరేట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని డిజిపి ఆదేశాలు జారీ చేశారు. మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో పర్యటించడం మంచిది కాదని, అత్యవసర పర్యటన చేయాలనుకుంటే, ముందుగా పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. తెలంగాణ–చత్తీస్‌గడ్ సరిహద్దులో గల ప్రభుత్వ కార్యాలయాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రాంతాలలో రాత్రిపూట గ్రామాలలో బస చేసే ఆర్‌టిసి బస్సులను తిరిగి డిపోలకు తరలించాలని పోలీసులు ఆర్‌టిసి అధికారులకు ఆదేశించారు.రాత్రిపూట పోలీసులు గస్తీని పెంచాలని డిజిపి స్పష్టం చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో హౌజ్ ఆఫీసర్లంతా స్టేషన్‌లలోనే ఉండాలని సూచించారు.

ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు : సిపిఐ

ఛత్తీస్‌ఘడ్ – భద్రాచలం సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌పై అనేక అనుమానాలు,సందేహాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలాన్ని గోప్యం గా ఉంచడం, చివరకు మీడియాను కూడా అనుమతించకపోవడం ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ ప్రభుత్వాల నిరంకుశ, నియం తృత్వ ధోరణులకు నిదర్శనమన్నారు.

విప్లవకారుల రక్తంతో హోలీ ఆడారు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల ఎన్‌కౌంటర్‌పై సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటి తీవ్రంగా స్పందించింది.విప్లవకారుల రక్తంతో కేంద్ర, రాష్ట్ర పాలకులు హోలీ ఆడుతున్నారని ఆ పార్టీ కేంద్ర కమిటి ప్రధాన కార్యదర్శి చంద్రన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయ మూర్తిచే విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పక్కా సమాచారంతోనే సజీ వంగా మావోయిస్టు నాయకులను బంధించి, ఆ తర్వాత హత్యచేసి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యం లో విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నక్సల్ సమ స్యను సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యగా కాకుండా కేవలం శాంతి భద్రతల సమస్య గా చూసే దృక్పథాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు విడనాడాలని పేర్కొన్నారు.గతంలో సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పు ప్రకారం ఎన్ కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై ఐపిసి 302 సెక్షన్ నమోదు చేసి విచారణ జరిపిం చాలని ఆయన డిమాండ్ చేశారు.

పోస్టుమార్టమ్‌ను వీడియోలో చిత్రీకరించండి : హైకోర్టు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలకు నిర్వహించే పోస్టుమార్టం ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తొండపాల్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున గ్రేహౌండ్స్ పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పది మంది మావోయిస్టులు మృతి చెందిన ఉదంతంపై పౌర హక్కుల సంఘం తరపున న్యాయవాది రఘునాథ్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. మృతదేహాలను భద్ర

భద్రాచలం ఆస్పత్రిలోనే శవపంచనామా

పరిచి న్యాయ నిపుణుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించాలని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. మావోయిస్టుల మృతదేహాలను వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలోగాని, హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలోగాని పోస్టుమార్టం నిర్వహించాలని కోరారు. ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరపించాలని కోరారు. పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలకు భద్రాచలం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఇద్దరు సీనియర్ డాక్టర్ల చేత పోస్టు మార్టం నిర్వహించాలని, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో జరగాలని హైకోర్టు స్పష్టం చేసింది. మృతదేహాలన్నింటిని గుర్తించి వారి బంధువులకు అప్పగించాలని, మృతదేహాలను అప్పగించేంత వరకు వాటిని భద్రపరచాలని కూడా ఆదేశించింది. తదుపరి విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.





ప్రభుత్వ హత్యలే : వరవరరావు

మన తెలంగాణ /ముషీరాబాద్ : తెలంగాణ, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల సరిహద్దుల్లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ వివిధ ప్రజా, విద్యార్థి, మహిళా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ సుందరయ్యవిజ్ఞానకేంద్రం ముందు నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఎఫ్ ప్రెసిడెంట్ వరవరరావు మాట్లాడుతూ ఎన్‌కౌంటర్లన్ని ప్రభుత్వ హత్యలేనన్నారు. పోలీసుల అదుపులో మరి కొందరున్నారని పోలీసులే ప్రకటిస్తున్నారని, వారికి ఎలాంటి ప్రాణహాని కల్పించకుండా విచిడిపెట్టాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ సమాధాన్ పేరిట ఈ మారణహోమానికి తెలంగాణ పోలీసులే నాయకత్వం వహిస్తుందన్నా రు. ఈ నిరసనలో టిడిఎఫ్ కన్వీనర్ చిక్కుడు ప్రభాకర్, కోట శ్రీనివాస్, టిపిఎఫ్ నాయకులు నలమాస కృష్ణ, విరసం నేతలు విక్రాంత్, అమరుల బంధు మిత్రుల సం ఘం నాయకురాలు జ్యోతి, అరుణ, సియంయస్, శిల్ప, డిఎస్‌యు అరుణాంక్, పికెఎమ్ నాయకులు జాన్,టివైఎఫ్ నాయకుడు పాండు,పిడిఎమ్ నాయకుడు రాజు, రవీందర్, భవాని తదితరుల పాల్గొనారు.



బ్యాంకుల భవిష్యత్తు నాశనం

- మోసకారులపై క్రిమినల్ చర్యలు
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

మన తెలంగాణ / హైదరాబాద్ : బ్యాంకులను మోసం చేస్తున్న వ్యాపారవేత్తలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, ఎఫ్ఆర్‌డిఐ బిల్లును ఉపసంహరించుకుని బ్యాంకు డిపాజిట్‌దారులకు, బ్యాంకులకు రక్షణ కల్పించాలని పలువురు బ్యాంకు ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్పొరేట్ బడా పెట్టుబడిదారులు వేల కోట్ల రూపాయలను బ్యాంకుల నుంచి రుణాలుగా తీసుకుని తిరిగి చెల్లించకుండా విదేశాలలో జల్సాలు చేస్తున్నా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం గర్హనీయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ బ్యాంకుల భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆరోపించారు. ఎఐటియుసి, ఎపిటిబిఇఎఫ్‌ల సంయుక్తంగా ఆధ్వర్యంలో 'బ్యాంకుల భవిష్యత్' అంశంపై శుక్రవారం పర్వానా హాల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎపిటిబిఇఎఫ్) ప్రధాన కార్యదర్శి బి.యస్.రాంబాబు, నాయకులు పి.వి.కృష్ణారావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహన్, ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబుతో పాటు వివిధ బ్యాంక్, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు వి.రత్నాకర్‌రావు, వి.ఎస్.బోస్, ఎస్.బాల్‌రాజ్ (ఎఐటియుసి), ఎం.సాయిబాబు (సిఐటియు), జి.టి. గోపాల్‌రావు (రక్షణ ఉద్యోగ సంఘం), పి.వెంకటరామయ్య(బిఇఎఫ్ఐ) రామకృష్ణ (ఓపిడిఆర్), ఎం.శివశంకర్ (జనరల్ ఇన్సూరెన్స్ అసోషియేషన్), వై.కరుణాకర్‌రెడ్డి (ఎస్‌టియు), లక్ష్మణరావు, జానకిరాము (బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్)తదితరులు ప్రసంగించారు. బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ బ్యాంకుల నుంచి వ్యాపారవేత్తలు తీసుకున్న రుణాలను చెల్లించలేక చేతులెత్తేస్తే బ్యాంకింగ్ రంగ చట్టంలోని సెక్షన్ 42, 52, 53 ప్రకారం రుణగ్రహితల ఆస్తులు జప్తులు చేయాలని నిబంధనలున్నప్పటికీ ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. ఎగవేతదారులకు చెందిన వేల కోట్ల రూపాయలను ప్రభుత్వాలు, బ్యాంకు యాజమాన్యాలు మాఫీ చేయడం అన్యాయమన్నారు. బ్యాంక్ డిపాజిట్‌దారులు, ఉద్యోగులు,సామాన్యుల హక్కులకు, జీవితాలకు ప్రమాదకరమైన ఎఫ్ఆర్‌డిఐ బిల్లును ఉపసంహరించుకునే విధంగా కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు రాజకీయపార్టీలతో కలిసి ఐక్యంగా ఉద్యమాలు చేపట్టాలని టి.నరసింహన్,పి.వి.కృష్ణారావు అన్నారు.

కెసిఆర్ వ్యాఖ్యలపై కేంద్రం సీరియస్

బిజెపి నిరసన కార్యక్రమాలపై ఆరా

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రధాని మోడీపై ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను బిజెపి కేంద్ర నాయకత్వం సీరియస్‌గా తీసుకుంది. సిఎం వ్యాఖ్యల అనంతరం రాష్ట్ర నాయకత్వం చేపట్టిన నిరసన కార్యక్రమాలపై బిజెపి అధిష్టానం ఆరా తీసినట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పార్టీపరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలతో పాటు కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులు ఇకపై తరచూ సమీక్ష, సమావేశాలను నిర్వహించాలనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కెసిఆర్ వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి కెటిఆర్‌తో మాట్లాడి తన అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దివంగత గవర్నర్ రామారావు నివాసంలో శుక్రవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మ ణ్, బిజెఎల్‌పి నేత జి.కిషన్‌రెడ్డి, ఎంఎల్‌సి ఎన్.రాంచంద్రారావు, ఎంఎల్‌ఎలు చింతల రాంచంద్రారెడ్డి, ఎన్‌విఎస్ ప్రభాకర్ సమావేశమై రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, బిజెపి స్థితిగతులు, పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహాలు,చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.మోడిపై సిఎం కెసిఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఈ సమావేశం ఖండించిది. రాష్ట్రానికి అందుతున్న కేంద్ర సహాయం, వివిధ పథకాలు, కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, వ్యవసాయానికి సంబంధించిన కార్యక్రమాలను కూడా రైతులకు చేరేలా రాష్ట్ర బిజెపి శ్రేణులు కృషి చే యాలని సమావేశంలో నిర్ణయించారు.కేంద్ర మంత్రులు తరచూ తెలంగాణలో పర్యటించి కేంద్రం రాష్ట్రానికి ఇస్తున్న నిధులు, వివిధ అభివృద్ధి పథకాల్లో తోడ్పాటు, తదితర అంశాలపై శాఖల వారిగా సమీక్షలు, సమావేశాలను నిర్వహించేలా చూస్తామని మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్ర నేతలకు హామీనిచ్చారు.



త్వరలో రేషన్ షాపుల్లో పౌరసేవలు

మనతెలంగాణ/హైదరాబాద్:రేషన్ దుకాణాల్లో రాయితీ సరుకుల పంపిణీతోపాటు బిల్లుల చెల్లింపులు, ఏటిఎం లాంటి కొన్ని రకాల పౌరసేవలను అందించే నూతన విధానాన్ని పౌరసరఫరాల విభాగం వినియోగంలోకి తేనుంది. ఆధార్ ద్వారా చేసే లావాదేవీలన్నింటినీ రేషన్ షాపుల ద్వారా నిర్వహించేకునే అవకాశం కల్పించనుంది. ఇందుకోసం 'ఇ–పాస్' యంత్రాలను రేషను దుకాణాలకు సమకూరుస్తోంది. బ్యాంకు సౌకర్యం లేని గ్రామాలలో ప్రజలు వారి ఖాతాలో నగదును జమచేయడం, విత్‌డ్రా చేయడం, కరెంట్ బిల్లులు, నీటి బిల్లుల చెల్లింపులు వంటి సేవలను కూడా నిర్వహించుకోవచ్చు. రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా మార్చాలన్న ప్రతిపాదనలపై కూడా ఆ శాఖ అధికారులు ఆలోచిస్తున్నారు. రేషన్ దుకాణాల్లో ఈ తరహా పౌరసేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా డీలర్ల ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ఉన్న 17,024 రేషన్ దుకాణాల్లో 16,812 దుకాణాల్లో 'ఇ–పాస్' యంత్రాల ద్వారా రేషన్ పంపిణీ జరుగుతోంది. షాపింగ్ మాల్స్, సూపర్‌మార్కెట్ల తరహాలో రేషన్ దుకాణాల్లోనూ నగదురహిత లావాదేవీల ద్వారా సరుకులు కొనుగోలు చేయడానికి 'ఇ–పాస్' యంత్రాలకు కార్డు స్వైపింగ్ ఆప్షన్‌ను కల్పించే ఆలోచన చేస్తోంది.లబ్దిదారులకుచెందిన ఏటిఎం/డెబిట్ కార్డులతో నగదు లేకుండానే రేషన్ తీసుకునే వీలు కలుగుతుంది.

ఉన్నత విద్యాశాఖాధికారికి జైలు

మన తెలంగాణ/హైదరాబాద్: జాతీయ పొదుపు పథకం (నేషనల్ సేవింగ్ స్కీం) స్కాంలో ప్రధాన నిందితుడైన ఉన్నత విద్యాశాఖ మాజీ డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ పుల్లారెడ్డికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 లక్షల జరీమానా విధిస్తూ నాంపల్లి ఏసిబి ప్రత్యేక న్యాయస్థానం తీర్పు చెప్పింది. ఉన్నత విద్యామండలిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో పుల్లారెడ్డి నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్‌ఎస్‌ఎస్) చెందిన రూ.91 లక్షల నిధులను దారి మళ్లించి తన ఖాతాలో వేసుకున్నట్లు ఏసిబి దర్యాప్తులో తేలింది. ఈ ఉదంతంలో ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న శంకరయ్య, మహ్మద్ కలీముల్లా, పుల్లారెడ్డిలపై 2004లో సిఐడి కేసు నమోదు చేసింది.ఈ కేసుపై 14 ఏళ్లపాటు సాగిన విచారణలో పుల్లారెడ్డి దోషిగా తేలారు. ఇతనికి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 లక్షల జరిమానా విధించింది కోర్టు. దీంతో పుల్లారెడ్డిని సిఐడి పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇక ఇదే కేసులో నిందితులుగా ఉన్న శంకరయ్య, మహ్మద్ కలీముల్లాలు నిర్దోషులుగా కోర్టు తేల్చింది.

రాజ్యసభ పోటీపై కాంగ్రెస్‌లో చర్చ!

మన తెలంగాణ/హైదరాబాద్ : త్వరలో జరుగనున్న రాజ్యసభ ఎన్నికల్లో తమ అభ్యర్థిని పోటీ పెట్టే అంశంపై కాంగ్రెస్‌పార్టీలో చర్చ జరుగుతోంది. అభ్యర్థిని పెడితే ఎలా? పెట్టకపోతే ఎలా? అనే అంశంపై కాంగ్రెస్ ముఖ్య నాయకులు సమాలోచనాలు జరుపుతున్నారు. గెలిచేందుకు సరిపడా ఎంఎల్‌ఎల సంఖ్య బలం లేనప్పటికీ అభ్యర్థిని పోటీ పెట్టడం ద్వారా ఫిరాయింపుదారులకు చెక్ పెట్టేందుకు అవకాశం ఉంటుందనే దిశగా ఆలోచన చేస్తున్నారు. అయితే ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఇది ఎంతవరకు ప్రయోజనకరంగా ఉంటుందోననే మీమాంసలో ఉన్నారు. దీనిపై ఢిల్లీ పెద్దలతో కూడా చర్చించాలని భావిస్తున్నారు. కాంగ్రెస్‌కు ప్రస్తుతం శాసనసభలో 19 మంది సభ్యులున్నారు. అందులో ఏడుగురు టిఆర్‌ఎస్‌లోకి ఫిరాయించారు. ఒక రాజ్యసభ స్థానాన్ని గెలుచుకోవాలంటే కనీసం 32 మంది ఎంఎల్‌ఎలు అవసరం. రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు ఈ నెల 23న ఎన్నిక జరుగనుంది. టిఆర్‌ఎస్ సొంతంగా రెండు, ఎంఐఎం సహకారంతో మూడవ స్థానాన్ని గెలుచుకునే అవకాశముంది. కాంగ్రెస్ అభ్యర్థి బరిలో ఉంటే ఎన్నిక అనివార్యమవుతోంది.

థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో ఐదో స్థానంలో సింగరేణి జైపూర్ ప్లాంట్

మన తెలంగాణ/ హైదరాబాద్ : థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం జాతీయ స్థాయిలో ఐదో స్థానంలో నిలిచినట్లు ఆ సంస్థ సిఎండి ఎన్. శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఫిబ్రవరి నెలలో 93.59 మెగా వాట్ల ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పిఎల్‌ఎఫ్)తో ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో వరుసగా రెండు నెలలుగా ఐదో స్థానంలో నిలిచిందన్నారు. ఎన్‌టిపిసి ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి వరకు 8725 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేయడమే కాకుండా గ్రిడ్‌కు 8,203 మిలియన్ యూనిట్లను అనుసంధానం చేసిందన్నారు. మొత్తంగా ఈ వేసవిలో పెరుగుతున్న విద్యుత్ అవసరాల మేరకు సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి సామర్థ్యంతో పని చేస్తూ రాష్ట్ర అవసరాలకు విద్యుత్‌ను అందిస్తోందన్నారు. రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలను సాధించాలని సింగరేణి సిఎండి ఆకాంక్షించారు.

తెలంగాణ భవన్‌కు బెదిరింపు కాల్



మన తెలంగాణ/హైదరాబాద్ : నగరంలోని 'తెలంగాణ భవన్'ని పేల్చేస్తామంటూ ఓ అగంతకుడు శుక్రవారం రాత్రి చేసిన బెదిరింపు ఫోన్ కాల్‌తో పోలీసులు అప్రమత్తమయ్యారు. తెలంగాణ భవన్‌లో పోలీసులు, బాంబు స్క్వాడ్ బృందాల నిపుణులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అధికార టిఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయంతో పాటు టి న్యూస్ తెలుగు టీవీ ఛానెల్ కార్యాలయం కూడా తెలంగాణ భవన్ నుంచే పని చేస్తున్నాయి. ఆ ఫోన్‌కాల్‌ను నకిలీదని పోలీసులు నిర్ధారించారు. ఫోన్ కాల్ లిస్టు ద్వారా ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అదిలాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 10మంది మావోయిస్టులు మృతి చెందిన రోజునే ఈ ఫోన్‌కాల్ రావడం గమనార్హం. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఫోన్‌కాల్‌ను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు.

పాస్‌బుక్‌ల టెండర్ గడువు పొడిగింపు

మన తెలంగాణ/ హైదరాబాద్ : పట్టాదారు పాస్‌బుక్‌ల ముద్రణకు టెండర్లను దాఖలు చేసే గడువు శుక్రవారం మధ్యాహ్నంతో ముగిసినప్పటికీ ప్రభుత్వం 5వ తేదీ వరకు పొడిగించింది. సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌తో కుదిరిన ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేసుకోవడంతో మరోమారు టెండర్లను పిలిచి ప్రైవేటు ముద్రణా సంస్థలను ఎంపిక చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో గత నెల 23వ తేదీన టెండర్లకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఆ ప్రకారం శుక్రవారం నాటికి గడువు ముగిసింది. టెండర్ల పరిశీలనను పూర్తిచేసి ఎంపిక చేయాల్సి ఉన్నప్పటికీ కొన్ని కారణాలతో గడువును సోమవారం మధ్యాహ్నం వరకు పొడిగించింది. ఏడెనిమిది ప్రైవేటు ముద్రణా సంస్థలు టెండర్లను దాఖలు చేయవచ్చని అంచనా వేస్తున్న ప్రభుత్వం తక్కువ ధరను పేర్కొన్న సంస్థకు 50% పాస్‌బుక్‌ల ముద్రణా బాధ్యతను ఇచ్చి రెండవ స్థానంలో ఉండే సంస్థకు 20%, ఆ తర్వాత మూడు సంస్థలకు తలా 10% చొప్పున ముద్రణా బాధ్యతలను అప్పజెప్పాలని డాక్యుమెంట్‌లో టిఎస్‌టిఎస్ పేర్కొనింది. సోమవారం సాయంత్రానికి ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

రైతు సమితి పేరుకు అనుమతి

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి పేరుతో కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ నుంచి అనుమతి లభించినట్లు తెలిసింది. కంపెనీల చట్టం సెక్షన్ 8 కింద రిజిస్టర్ చేసే ప్రక్రియ కూడా దాదాపు పూర్తైనట్లు తెలిసింది. రాష్ట్రంలో అనుమతి పత్రం తీసుకోవాల్సి ఉంటుందని, మరో నాలుగైదు రోజుల్లో 'బైలాస్'తో సహా పూర్తి స్థాయిలో రైతు కార్పొరేషన్ పని మొదలు కానున్నట్లు తెలిసింది. ఇందుకు మొత్తంగా రూ. 1.57 కోట్లు ఖర్చు అయినట్లు సమాచారం. అలాగే కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎంపి గుత్తా సుఖేందర్ రెడ్డి నామినేట్ అవుతారన్న విషయం తెలిసిందే. ఆయన పదవీ బాధ్యతల స్వీకరణకు సిఎం కె. చంద్రశేఖర్‌రావు హాజరవుతారని సమాచారం. బషీర్‌బాగ్‌లోనే రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలోనే రైతు కార్పొరేషన్ ఆఫీస్ ఉండనుంది. ఇప్పటికే శనివారం గుత్తా బంధువులు కమిషనర్ కార్యాలయ పరిసరాలను, 'వాస్తు' చూసుకుని వెళ్లారు.

అందుబాటులోకి ఎకో టూరిజం

- రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల సందర్శనకు చర్యలు
- మూడు ప్యాకేజీలుగా వసతుల ఏర్పాట్లు



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని అడవి, అందమైన ప్రకృతి, గలగల పారే సెలయేర్లతో కూడిన ప్రాంతాలను 'ఎకో టూరిజం' పేరుతో ప్రజలు సందర్శించేలా రాష్ట్ర అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. భూపాలపల్లి ఎకో టూరిజానికి సం బంధించిన ప్రత్యేక ప్యాకేజీలను ఆటవీశాఖ వినియోగంలోకి తీసుకువచ్చింది. పర్యాటకుల ఇష్టాలకు అనుగుణంగా అటవీ అందాలను చూసేందుకు వీలుగా మూడు ప్రత్యేక ప్యాకేజీలను రూపొందించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. రెండు రోజుల పాటు అడవిలోనే గడిపేందుకు వీలుగా తాడ్వా యి హట్స్ ను ఒక ప్యాకేజీగా సిద్ధం చేశా రు. సైక్లింగ్, ట్రెక్కింగ్, పర్యావరణంపై అవగాహన కల్పించే సెంటర్ సం దర్శనతో పాటు ఆదిమ మానవుల గుహలు, బ్లాక్ బెర్రీ ద్వీపం, కొండేటి వ్యూ పాయింట్ లాంటి ప్రాంతాల సందర్శనకు ఒక రోజు బస, భోజనం, సహాయకునితో కలిపి ఒక్కొక్కరికి రెండు వేల రూపాయల చొప్పున ధరను నిర్ణయించారు. దీంతో పాటు లక్నవరం ఫెస్టివల్‌లో భాగంగా రాత్రిపూట టెంట్లలో బస, క్యాంప్ ఫైర్, బోటింగ్, ద్వీపం సందర్శన, అడవిలో ట్రెక్కింగ్, ఎండ్ల బండిపై విహారం, లేక్ వ్యూ సఫారి రెండో ప్యాకేజీలో భాగంగా ఉంటాయి. దీనికి కూడా ఒక్కొక్కరికి రోజుకు రెండు వేల రూపాయల చొప్పున ఫీజును నిర్ణయించారు. ఇక మూడవ ప్యాకేజీ కింద పాండవుల గుట్ట సందర్శన, రాక్ క్లైంబింగ్, రాప్లింగ్, ట్రెక్కింగ్, బోల్డరింగ్ లాంటి సాహస క్రీడలను ఇష్టపడేవారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్యలో భోజనంతో సహా ఒక్కొక్కరికి ఐదు వందల రూ పాయల చొప్పున రుసుంను నిర్ణయించారు. పర్యాటకులు www. ecotourism.bhupalapally.com వెబ్‌సైట్ ద్వారా లేదా ఎకో టూరిజం సమన్వయకర్త సుమన్‌ను 73826 19363 ఫోన్ నెంబర్‌లో సంప్రదించి ప్యాకేజీలను ఎంచుకోవచ్చునని తెలిపారు. భూపాలపల్లి అటవీ ప్రాంతం అందాలను ప్రతి ఒక్కరూ అస్వాదించేందుకు వీలుగా పెద్దలకు, పిల్లలకు సాహస క్రీడలను ఇష్టపడే వారికి ప్రత్యేకంగా ప్యాకేజీలను రూపొందించామని ఆటవీశాఖాధికారులు వివరించారు. హైదరాబాద్ నుంచి వచ్చే విద్యార్థులు, ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. తెలంగాణవ్యాప్తంగా అడవుల్లో ఉన్న కొత్త వ్యూ పాయింట్లు, జలపాతాలు, ఇతర అటవీ అందాలను గుర్తిస్తున్నామని చెప్పారు. పర్యావరణరహిత పర్యాటకానికి అనువుగా ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని పిసిసిఎఫ్ పికె.ఝా వివరించారు.





కాంగ్రెస్ నేతల భాష సంస్కారంగా ఉందా?

- వయసు, ఆకారం ఎక్కువుంటే పెద్ద వాళ్లు కాదు
- మూడేళ్లలో రాష్ట్రాన్ని కెటిఆర్ ప్రపంచానికి పరిచయం చేశారు : మంత్రి జగదీశ్‌రెడ్డి

మనతెలంగాణ/హైదరాబాద్ : సంస్కారం గురించి కాంగ్రెస్ నేతలు మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందని, సిఎం కెసిఆర్, మంత్రుల గురించి కాంగ్రెస్ నేతలు రోజూ మాట్లాడుతున్న భాష సంస్కారంగా ఉందా? అని విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. మంత్రి కెటిఆర్‌పై కాంగ్రెస్ పెద్దలు చేసిన వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని, కొందరు నాయకులు తమ స్థాయి గురించి తమకు తాము సర్టిఫికెట్‌లు ఇచ్చుకుంటున్నారని ప్రతిపక్ష నేత జానారెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. టిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో ఎంఎల్‌ఏ గ్యాదరి కిషోర్, ఎంఎల్‌సిలు పూలరవీందర్, వి.గంగాధర్‌గౌడ్‌లతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.జానా రెడ్డికి కాంగ్రెస్ నేతలు కూడా ఇవ్వని గౌరవాన్ని కెసిఆర్ ఇచ్చారన్నారు. జానారెడ్డి ముందు తన పార్టీ నేతల నుంచి గౌరవం పొంది ఇతరులను అడగాలన్నారు. వయసు, ఆకారం ఎక్కువగాఉంటే పెద్దవాళ్ళు కాదని, ఎక్కువ ప్రజలు అభిమానిస్తే అవుతారని చెప్పారు. నల్లగొండలో శాంతి భద్రతల సమస్యను సృష్టించేందుకు ప్రయత్నించిన నేతలను, కాంగ్రెస్‌లో కొత్తగా చేరిన ఓ నాయకుడు ఇష్టమొచ్చినట్టు సిఎం కెసిఆర్ మీద మాట్లాడితే జానారెడ్డి ఎందుకు వారించలేదని ప్రశ్నించారు. కెటిఆర్ పార్లమెంటరీ పద్ధతిలోనే మాట్లాడారని, మూడేళ్ళలో ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణను పరిచయం చేసిన నేత కెటిఆర్ అని, కాంగ్రెస్ నేతలకు కనీసం పక్క నియోజకవర్గంలో కూడా గుర్తింపు ఉండదన్నారు. పిసిసి అధ్యక్షున్ని కూడా గౌరవించుకోని సంస్కారం కాంగ్రెస్ వారిదన్నారు. వచ్చే ఎన్నికల తరువాత శాసనసభకు ఒక్క కాంగ్రెస్ సభ్యుడు కూడా రారని అన్నారు. ప్రధాని మోడీపై కెసిఆర్ వ్యక్తిగతంగా ఎలాంటి పరుష వ్యాఖ్యలు చేయలేదని, ప్రసంగం ఒరవడిలో గారు బదులు ఒక అక్షరం పొరపాటుగా వచ్చిందని, అది ఎవరికైనా సహజమేన్నారు.బిజెపి నేతలు తెలివి తక్కువ తనంతోనే సిఎం వ్యాఖ్యల పై రాదాంతం చేస్తున్నాని అన్నారు. కాంగ్రెస్‌కు చేతనైతే రాజ్య సభ టికెట్ కాకుండా, మొత్తం 119 అసెంబ్లీ టికెట్‌లు కూడా అమరవీరుల కుటుంబాలకే ఇవ్వాలని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పక్క పార్టీ టిక్కెట్లను కూడా కాంగ్రెస్ నిర్ణయిస్తుందా? అని మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు.



మిలీనియం మార్చ్‌ను గుర్తుచేసుకుందాం

మన తెలంగాణ / హైదరాబాద్ : మలి విడత తెలంగాణ ఉద్యమంలో మహత్తరమైన 'మిలియన్ మార్చ్'ను స్మరించుకునేందుకు ఈ నెల10వ తేదీన హైదరాబాదులో ఒక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం గురించి చర్చించేందుకు శరనివారం సాయంత్రం 4 గంటలకు మఖ్దూం భవన్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు, టిజెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండ రామ్, జస్టిస్ చంద్రకుమార్, డాక్టర్ చెరుకు సుధాకర్, గద్దర్, విమలక్కలతో పాటు పలువురు ప్రముఖులు ఈ సమావేశంలో పాల్గొంటారని ఆయన వివరించారు.

పొరపాటు దొర్లింది తప్ప అవమానపరచాలని కాదు

- కెసిఆర్ వ్యాఖ్యలపై ఎంపి కవిత వివరణ

మన తెలంగాణ/ హైదరాబాద్ : రైతు సదస్సులో సిఎం కెసిఆర్ చేసిన సుదీర్ఘ ప్రసంగంలో ప్రధాని మోడీని ఉద్దేశించి చిన్న పొరపాటు దొర్లిందే తప్ప ప్రధానిని అవమానపరచాలనే సంకుచిత భావం సిఎం కెసిఆర్‌కు ఎప్పుడూ ఉండదని టిఆర్ఎస్ ఎంపి కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ఎన్నుకోబడిన భారత దేశ ప్రధానిని అవమానపరుచుకుంటే మనల్ని మనం అవమానాపరుచున్నట్లే అవుతుందని, సిఎంకు అలాంటి ఆలోచన లేదని స్పష్టం చేశారు. అది మామూలుగా జరిగిన అంశమైనా బిజెపి నాయులు వేరే అంశమే లేనట్లు దానిని సీరియస్‌గా పట్టుకొని ఇష్టమొచ్చినట్లు సిఎం కెసిఆర్‌ను ఉద్దేశించి మాట్లాడారని, ఈ విషయాన్ని తెలంగాణ ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. ఇటీవల దావోస్‌లో ప్రధాని మోడీ ప్రసంగిస్తున్నప్పుడు 600 కోట్ల భారత ప్రజలు తనకు ఓటేశారని అన్నారని, వాస్తవానికి దేశ జనాభానే 130 కోట్లు అని చెప్పారు.దాన్ని పట్టుకొని తాము మోడీకి భారత జనాభా తెలియదా అని తాము అనొచ్చని, కాని చిన్న చిన్న విషయాలను జనంలోకి తీసుకెళ్తే గౌరవంగా ఉండదన్నారు. బిజెపి నేతలు కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్లు అసలు విషయాలను వదిలి పెడార్థాలు తీయడం , పెద్దగా చేయడం వారి హుందాతనానికి మంచిది కాదని సూచించారు.

పొతంగల్ అభివృద్ధికి సన్ ఫౌండేషన్ : నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గం పొతంగల్ గ్రామం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సన్‌షైన్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఫౌండేషన్ చైర్‌పర్సన్ కావేరి శుక్రవారం నిజామాబాద్ ఎంపి కవితతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపి కవిత మాట్లాడుతూ బోధన్ నియోజకవర్గం పొతంగల్ నుండి సన్ ఫౌండేషన్ కార్యక్రమాలు ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పొతంగల్‌లో మహిళలు, యువత అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల నిర్వహణకు ఇప్పటికే నాలుగుకరాల స్థలం సిద్ధంగా ఉందని, అక్కడి నుండి ఫౌండేషన్ కార్యక్రమాలు చేపట్టనుందన్నారు. ఇందుకు యూనిసెఫ్, అంతర్జాతీయ సంస్థలతో కలిసి పని చేస్తోందని తెలిపారు.



తెలంగాణలో ఎంఐఎం పటిష్టం!



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాబోయే రోజుల్లో ఎంఐఎంను తెలంగాణలో పటిష్టం చేస్తామని, ఎంఎల్‌ఏల సంఖ్యను పెంచుకుంటామని ఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ప్రకటించారు. రాష్ట్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలను తుడిచి పెట్టడమే తమ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ మంచి పనులు చేస్తోందని, ప్రజా సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తోందని ప్రశంసించారు. ఎంఐఎం పార్టీ 60వ పునరుజ్జీవ వార్షికోత్సవాల సందర్భంగా ఎంఐఎం ప్రధాన కార్యాలయం దారుస్సలాంలో ఆ పార్టీ జెండాను అసదుద్దీన్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో హైదరాబాద్ స్థానం నుండి పోటీ చేసేందుకు కాంగ్రెస్ , బిజెపిలు జోకర్లను కాకుండా బలమైన అభ్యర్థులను పోటీ పెట్టాలన్నారు. ప్రధాని వచ్చి పది బహిరంగ సభల్లో మాట్లాడినా తాను రెండు లక్షల మెజారిటీతో గెలుస్తానని సవాలు విసిరారు. తనకు హిందూ, ముస్లిం, దళితులు, క్రిస్టియన్‌లు మద్దతుగా నిలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. అంతే కాకుండా బిజెపి సికిందరాబాద్ స్థానంతో పాటు ఐదు ఎంఎల్‌ఏ స్థానాలను కోల్పోతుందన్నారు. ఎంఐఎం రజాకర్ల పార్టీ అన్న ఆరోపణలు నిజం కాదని, ఎంఐఎం జాతీయవాదుల, దేశ భక్తుల పార్టీ అని, లౌకికవాదం, బహుళత్వ స్ఫూర్తి కలిగి ఉన్నదన్నారు. జిన్నా ముస్లింలను పాకిస్తాన్ రమ్మంటే రజాకార్లు అక్కడికి వెళ్ళిపోయారన్నారు.

రమణ నాయకత్వం సరిగా లేదు

- అందుకే అంతా పార్టీని వీడారు
- ఓటుకు నోటుతో రేవంత్ బజారుకీడ్చారు :మోత్కుపల్లి

మన తెలంగాణ/హైదరాబాద్ : టిడిపిని టిఆర్‌ఎస్‌లో విలీనం చేయాలని తాను చేసిన వ్యాఖ్యల వల్ల ఎవరైనా ఇబ్బంది పడితే క్షమించాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు కోరారు. పార్టీ భవిష్యత్ కోసమే అలా మాట్లాడినట్లు చెప్పారు. ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రమణ నాయకత్వం సరిగ్గా లేనందునే అందరూ పార్టీని వీడారన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు మాటలను స్వాగతిస్తున్నానని, విలీనం కాకపోతే పొత్తుకైనా సరేనన్నారు. ఎన్‌టిఆర్ ఆశీర్వాదం పొందిన నేతలంతా నేడు టిఆర్‌ఎస్‌లో ఉన్నారని.. ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంటే ఎన్‌టిఆర్‌కు సరైన గౌరవం దక్కుతుందన్నారు. హైదరాబాద్‌లోని బేగంపేటలో తన నివాసంలో శుక్రవారం మోత్కుపల్లి మీడియాతో మాట్లాడారు.రాష్ట్రంలో టిడిపి బలపడాలంటే చంద్రబాబు ఇక్కడ తిరగాలని,లేకపోతే అవకాశంలేదన్నారు. పార్టీ ఏం ఇచ్చినా ఇవ్వకపోయినా తా ను చంద్రబాబు తమ్ముడినేనన్నారు. అయితే మొన్నచంద్రబాబు తాను లేకుండా సమావేశం పెట్టారన్నారు. రేవంత్ ఓటుకు నోటు కేసుతో పార్టీని బజారున పడేసారని, ఆయన పది మందిని తీసుకుని కాంగ్రెస్‌కు పోతే అడిగిన మనిషి లేరన్నారు. రేవంత్‌ను ఆనాడే సస్పెండ్ చేసి ఉంటే ఇవాళ పార్టీకి ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు.

బజారు, నీతిమాలిన మనుషల ముందు కూర్చున్నా అంటే నాయకుడి మొఖం చూసి మాత్రమేనన్నారు.ఒంటేరు ప్రతాప్ రెడ్డిని నెల రోజు లు జైల్ లో పడితే ఎవరైనా రోడ్ల పైకి వచ్చా రా అని ప్రశ్నించారు. తాను ఒక పేదవాడినని, ప్రజలకు సేవ చెయ్యడం తప్ప వేరే ఆలోచన లేదన్నారు. రాజకీయ జీవితంలో ఏ ఒక్క రోజు కూడా తన కోసం, కుటుం బం కోసం ఆలోచన చేయలేదన్నారు. తెలంగాణ వాదంలో తనపై వ్యతిరేక ముంద్ర వచ్చినా టిడిపితోనే ఉన్నట్లు చెప్పారు. 20 11లో చంద్రబాబు ఇంటి నుంచి బయటకు రాలేదని, అప్పుడు ఆయనకు ఎవరు అండ గా ఉన్నారని ప్రశ్నించారు. చంద్రబాబు దగ్గర పదవులు అనుభవించి చివరకు ఆయ న్నే నిందించి పార్టీలు మారి ఇప్పుడు మంత్రి పదవులు అనుభవిస్తున్నారన్నారు. తాను మాత్రం జీవితం బలిచేసి చంద్రబాబుకి అం డగా ఉన్నట్లు తెలిపారు. సిద్ధాంత పరంగా కాంగ్రెస్‌తో కుదరదని అభిప్రాయపడ్డారు. ఎన్‌టిఆర్ వర్ధంతి, జయంతిని రాజకీయాలకు అతీతంగా సిఎం కెసిఆర్ జరపాలని కోరారు. ఎవరికైతే నమ్మి నాయకత్వం ఇచ్చారో వాళ్ళే పార్టీని మోసం చేసి వెళ్లి పోయారన్నారు. జూనియర్ ఎన్‌టిఆర్ తెలంగాణ టిడిపి బాధ్యతలపై స్పందిస్తూ మోత్కుపల్లి ఆ విషయం తనకు తెలియదన్నారు.



శ్రీనివాస్‌రెడ్డిని విచారించిన ఏసిబి

- పురుషోత్తమరెడ్డి కేసులో చర్యలు

మన తెలంగాణ/ హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ప్రధాన నిందితుడైన హెచ్‌ఎండిఏ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తమరెడ్డి బావమరిది శ్రీనివాస్‌రెడ్డిని శుక్రవారం ఏసిబి అధికారులు కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించారు. నాంపల్లి ఏసిబి ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న శ్రీనివాస్‌రెడ్డిని ఏసిబి అధికారులు ఐదు రోజులు పాటు విచారించనున్నారు.తొలిరోజు విచారణలో శుక్రవారం పురుషోత్తమరెడ్డి బినామీ ఆస్తులపై కీలకమైన వివరాలను రాబట్టినట్లు తెలుస్తుంది.

"ఆదర్శవంతమైన జీవితానికి ఉత్తమ గ్రంథాలు, ఉత్తమ మిత్రులూ ఎంతో అవసరం. – వాల్టన్"



మండువేసవి సంకేతాలు

సంపాదకీయం

ఈ ఏడాది వేసవి ప్రవేశమే ప్రచండంగా ఉన్నది. ముంబయి నగరానికి, దాని పరిసరాలలోని మహారాష్ట్ర జిల్లాలకు భారత వాతావరణ విభాగం వడగాడ్పుల హెచ్చరికను ఇప్పుడే విడుదల చేసిందంటే ముందుముందు వేసవి లావాను తలపించనుందనే అభిప్రాయం కలుగుతున్నది. ముంబయిలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38 డిగ్రీలకు చేరుకున్నది. పగటి ఉష్ణోగ్రత మామూలుకంటె 5 డిగ్రీలు అధికంగా ఉన్నదని వార్తలు వస్తున్నాయి. మన రాష్ట్రంలో, రాజధాని హైదరాబాద్‌లో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఇక్కడ కూడా వేసవి తొలి అడుగులు దుర్భరంగానే ఉన్నాయి. ఇప్పటికే ఉపరితల, భూగర్భ జలమట్టాలు అడుగంటి పోయాయి. గత తొలకరిలో ఒక మాదిరి మంచి వర్షాలు కురిశాయన్న సంతృప్తి ఆవిరైపోయింది. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పలు పట్టణాలలో మంచినీటి ఎద్దటి ప్రారంభమైందని తెలుస్తున్నది. రాష్ట్రంలోని పెక్కు జిల్లాల్లో పరిస్థితి అప్పుడే ఆందోళన కలిగిస్తున్నదని గత జనవరిలోనే వార్తలు వచ్చాయి. సాగునీరు, మంచినీటి సమస్య మన రాష్ట్రాన్నే కాదు, దేశమంతటినీ చిరకాలంగా పీడిస్తున్నదే.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అవతరించిన తరువాత ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వం నీటి సమస్య పరిష్కారానికి అగ్ర ప్రాధాన్యమిచ్చింది. ఒకవైపు భారీ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని, మరోవైపు మిషన్ కాకతీయ, భగీరథలను చేపట్టింది. పల్లెల్లో ఇంటింటికీ నదీజలాలను తీసుకువెళ్లి మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించడానికి నిజంగానే భగీరథ కృషి సాగుతున్నది. ప్రతి ఊరికీ ఇప్పటికే ఏకమొత్తం గా నీటి చేరవేతకు తగిన వ్యవస్థ భగీరథ ద్వారా సిద్ధమైందని, గ్రామాల లోపల గొట్టాల ద్వారా సూక్ష్మ సరఫరా లైన్ల నిర్మాణమే మిగిలి ఉన్నదని సమాచారం. అదికూడా పూర్తయితే రాష్ట్రంలో మంచినీటి సమస్యకు శాశ్వత దుర్భేద్య పరిష్కారం సిద్ధించినట్టే కాగలదు.

గ్రామాలలో మంచినీటి అవసరాలకు 1.13లక్షల పంపుసెట్లతో భూగర్భజలాలను తోడి ఇస్తున్నారు. ఈ నీటిలోని ఫ్లోరైడ్, క్షార లక్షణం వంటి ప్రతికూలతలవల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నందువల్లనే భగీరథ పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. అయితే ఇది పూర్తిగా సాకారం అయ్యేలోగా ప్రజలను ఈ వేసవి ఠారెత్తించకుండా చూసుకోవల్సి ఉన్నది.

రాష్ట్రంలో భూగర్భ జలమట్టం ఎప్పుడూ లేనంతగా ఉపరితలానికి 8 మీటర్ల లోతుకు పడిపోయిందని గణాంకాలు చెపుతున్నాయి. ఇది గత ఏడాది పతనంకంటె రెండు మీటర్లు ఎక్కువ. దాదాపు 2వేల గ్రామాలలో బోరులు ఎండిపోవడంతో ప్రజలు సమీపంలోని వ్యవసాయ పంపుసెట్లమీద ఆధారపడుతున్నారు. పంచాయతీలు ట్యాంకర్ల ద్వారా చేసే సరఫరా వారంలో రెండు లేదా మూడుసార్లకే పరిమితం కావడంతో ఇబ్బందులెదుర్కొంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో సాధించిన విశేష ప్రగతివల్ల వ్యవసాయ బోర్లకు నిరంతర కరెంటు సరఫరా అనే ఒక అద్భుతం సుసాధ్యమైంది. దీనికి తెరలేపడానికి ముందు ఆటోస్టార్టర్లకు స్వస్తి చెప్పాలని ముఖ్యమంత్రి పదేపదే విజ్ఞప్తిచేశారు. అది పాక్షికంగానే పనిచేసినట్టు కనిపిస్తున్నది. అందువల్ల భూగర్భ నీటిని నిరంతరాయంగా అవసరానికి మించి తోడివేయడం జరుగు తున్నది. దాని కారణంగా భూమిలోపల నీటిమట్టాలు అనూహ్యంగా పడిపోయి అనేక వ్యవసాయ బోర్లు ఒట్టిపోతున్నాయి. ఒక మంచికి పోతే మరొక చెడు ఎదురైనట్లు అయింది.

ఈ పరిస్థితులలో ప్రభుత్వం, దాని యంత్రాంగం సాగుబోర్ల వినియోగాన్ని మరింత క్రమబద్ధం చేయవలసి ఉంది. అవసరం ఉన్నా లేకపోయినా కరెంటు ఉంది కదా అని అదేపనిగా భూగర్భ జలాలను పొలాలకు వదిలిపెట్టి నిశ్చింతగా నిద్రపోవడం ఈ వేసవిలో మునుముందు ప్రజలకు మరింతగా కంటిమీద కునుకులేని పరిస్థితిని సృష్టిస్తుంది. 24గంటలూ వ్యవసాయ విద్యుత్ అవసరం లేదని సగకాలానికి దానిని కుదించి ఇచ్చినా చాలని రైతులు అభిప్రాయపడుతున్నట్లు బోధపడుతున్నది. అందుచేత అవసరమైన మార్పులు చేసైనా పటిష్టమైన వ్యూహంతో ఈ వేసవిని దాహరహితంగా గట్టెక్కించవలసి ఉన్నది.

పశువధపై కేంద్రం పల్టీలు


చూపు

పశువుల అమ్మకాలు, కొనుగోళ్ళపై ఆంక్షలు విధిస్తూ దేశవ్యాప్తంగా పశువధ నిషేధం అమలు చేయాలని వేసిన ఎత్తుగడ బెడిసికొట్టింది. పశువులను అమ్మడానికి, కొనడానికి అవకాశం లేనందువల్ల రైతులకు పశువులను అమ్ముకునే దారి కనిపించలేదు. మరోవైపు గోరక్షక దళాల ముసుగుల్లో గుండాదాడులు పెరిగిపోయాయి. పశువుల పట్ల క్రూరత్వ నిరోధక నియమాలు (ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ ఎగైనిస్ట్ యానిమల్స్ (రెగ్యులేషన్ ఆఫ్ లివ్ స్టాక్ మార్కెట్) రూల్స్ 2017) జారీ చేయడం ద్వారా పశువధను దేశవ్యాప్తంగా నిషేధించాలని భావించింది. ఇటీవల వచ్చిన వార్తా కథనాల ప్రకారం, పైన పేర్కొన్న నోటిఫికేషనులో 'పశువధ' అనే పదాన్ని తొలగించి సరికొత్తగా మళ్ళీ నోటిఫికేషను జారీ చేయడానికి ప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నోటిఫికేషను పర్యావరణ మంత్రిత్వశాఖ 2013 మే 23వ తేదీన ఒక నోటిఫికేషన్ ను జారీ చేసింది.

పశుఆధారిత పరిశ్రమల్లో ఉన్నవారిపై దీనివల్ల తీవ్రమైన ప్రభావం పడుతుందని, మరోవైపు రైతులు కూడా భారీగా నష్టపోతారని, చివరకు దేశ ఆర్థికవ్యవస్థపై కూడా దీని ప్రభావం పడుతుందని అప్పట్లోనే హెచ్చరించారు. ప్రభుత్వం ఈ హెచ్చరికలను, ఈ విమర్శలను ఖాతరు చేయలేదు. ప్రభుత్వం పశువధను పశువుల పట్ల క్రూరత్వంగా పేర్కొనడంతోనే సమస్య మొదలైంది. పశువధను పశువుల పట్ల క్రూరత్వంగా భావించిన తర్వాత ఇక పశుఆధారిత పరిశ్రమలు ఉండవు.

పశు ఆధారిత పరిశ్రమలు లేకపోతే రైతులకు తమ వద్ద ఉన్న పనికిరాని పశువులను అమ్మడానికి అవకాశాలు ఉండవు. వాటిని పోషించే బాధ్యత ప్రభుత్వమూ తీసుకోదు. ప్రభుత్వం ఈ నోటిఫికేషను ద్వారా పశువధ కోసం పశువులను మార్కెటుకు తరలించడం, పశువుల క్రయవిక్రయాలను నేరాలుగా మార్చేసింది. ఆ విధంగా దేశవ్యాప్తంగా పశువధ నిషేధాన్ని అమలు చేయాలని సంకల్పించింది. విచిత్రమేమంటే, భారీస్థాయిలో నడిచే యాంత్రిక వధశాలలకు పశువులు ఎక్కడి నుంచి ఎలా అందుతున్నాయి? పశువులను వధించడానికి ఎవరూ అమ్మకపోతే ఈ కబేళాలు ఎలా నడుస్తున్నాయి? ప్రపంచంలోనే అతిపెద్ద గొడ్డుమాంసం ఎగుమతిదారుగా భారతదేశం ఎలా మారింది? ఈ ప్రశ్నలకు జవాబులు లేవు. కాని ఈ నోటిఫికేషను ద్వారా ప్రభుత్వం పశువధను నిషేధించి, ఆ విధంగా దేశంలో ఎవరి కీ గొడ్డుమాంసం అందుబాటులో లేకుండా చేయాలనుకుంది. విదేశాలకు ఎగుమతయ్యే గొడ్డుమాంసం విషయంలో మాత్రం ఎందుకో నోరెత్తలేదు.

కేంద్రప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల డైరీ పరిశ్రమలో ఉన్నవారి ఉపాధిపై తీవ్రమైన ప్రభావం పడింది. అంతేకాదు, లెదర్ పరిశ్రమ, గొడ్డుమాంసం ఉత్పత్తులు, ఎగుమతులు దెబ్బతిన్నాయి. అంతే కాదు, పట్టించుకోకుండా రోడ్లపై వదిలేసిన పశువుల సంఖ్య పెరిగిపోయింది. ఇలాంటి పశువులన్నీ ఆహారం కోసం పంటచేలపై పడడం మొదలైంది. గత సంవత్సరం అగస్టులో వచ్చిన వార్తల ప్రకారం, ఉత్తరప్రదేశ్‌లోని ఒక్క గోండా జిల్లాలోనే కొన్ని గ్రామాల్లో దాదాపు మూడువందల పశువులు పట్టించుకోని వారెవ్వరూ లేకుండా తిరుగుతున్నాయి. ఈ పశువులు పంటలను పాడు చేయడమే కాదు,



కొన్ని సందర్భాల్లో వాటిని తోలడానికి ప్రయత్నించిన వారిపై దాడులు కూడా జరిగాయి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అక్రమ పశువధశాలలను మూయించే పేరుతో పశువధ నిషేధానికి తీసుకునే నిర్ణయాలు, దానికి తోడు కేంద్రం జారీ చేసిన నోటిఫికేషను వల్ల పశువుల క్రయవిక్రయాలు పూర్తిగా స్తంభించాయి. ఇలా వదిలేసిన పశువులు పొలాలకు నష్టం కలిగించడం మాత్రమే కాదు, అవి స్కూళ్ళు తదితర చోట్ల గుంపులు గుంపులుగా చేరడం వల్ల విద్యార్థులు ముందు వరాండాల్లో పేడను ఎత్తి శుభ్రం చేసి తర్వాత తరగతి గదుల్లోకి వెళ్ళిన సంఘటనలు కూడా అనేకం. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ గోరక్షణ చర్యల వల్ల పశువులు మనుషులకు శత్రువులుగా మారే పరిస్థితి వచ్చిందని కొందరు వాపోయారు.

పశువుల క్రయవిక్రయాలపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం నోటిఫికేషను జారీ చేసిన కొన్ని వారాలకే రైతులు ఆగ్రహంతో తమ పంటపొలాలను నాశనం చేస్తున్న ఆవులను కర్రలతో తరిమి కొడుతున్న వార్తలు వచ్చాయి. తమ పంటలను కాపాడుకోడానికి రైతులు యాసిడ్ స్ప్రేయర్లు కూడా వాడినట్లు తెలుస్తోంది. ఇలా రైతులు వదిలేసే పశువుల సమస్యను పరిష్కరించడం ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. పశువు చెవులకు ఆధార్ ట్యాగులు కట్టడం వంటి అనేక ప్రతిపాదనలు వచ్చాయి. ఈలోగా ఆవులపై యాసిడ్ దాడులు జరిగిన వార్తలు కూడా వచ్చాయి. ఆగ్రాలోని కర్మానా ప్రాంతంలో దాదాపు 15 ఆవులపై యాసిడ్ దాడి జరిగింది. గ్రామంలో ఆవులు తీవ్రమైన గాయాలతో కనిపిస్తున్నాయంటూ హిందూత్వ గ్రూపులు గగ్గోలు చేయడం మొదలు పెట్టాయి. శాంతిభద్రతల పరిస్థితి తలెత్తకుండా పాలనాయంత్రాంగం గట్టి చర్యలు తీసుకుంది.

ఆవులపై యాసిడ్ దాడులు జరుగుతున్నాయని, ఎవరు చేస్తున్నారో తెలియడం లేదంటూ భజరంగదళ్ ప్రకటనలు చేసింది. అయితే దాడులకు గురైన పశువులన్నీ ఇలా రైతులు వదిలేసిన పశువులే అని తేలింది. పంటపొలాలపై పడడం వల్ల స్థానిక రైతులే ఈ దాడిచేసి ఉంటారని చివరకు తీర్మానించారు. దీన్ని హిందూ ముస్లిమ్ సమస్యగా మార్చాలన్న ప్రయత్నాలు జరిగినప్పటికీ ఇలా వదిలేసిన పశువులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో అది సాధ్యం కాలేదు. పైగా ఆ పశువులపై యాసిడ్ దాడిచేసి తన పంటను కాపాడుకున్నది హిందూరైతే అని తేలడంతో ఈ శక్తులు మిన్నకుండిపోయాయి. చాలా ప్రాంతాల్లో ఇలా వదిలేసిన పశువులపై దాడులు జరిగిన వార్తలు వచ్చాయి.

రైతులు కర్రలు చేతబట్టి రాత్రింబవళ్లు పొలాలకు కాపలా ఉండవలసి వచ్చింది. అనేకమంది రైతులు వేలాది రూపాయల పంటను ఈ పశువుల కారణంగా కోల్పోయారు. ఉత్తరప్రదేశ్, బీహారు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి పంటపొలాలు ఇలాంటి పశువుల వల్ల సర్వనాశనమైన వార్తలు అనేకం వచ్చాయి.

* వి.ఎ

'హోదా' చదరంగంలో జనమే పావులు



టంకశాల అశోక్
9848191767

ఆంధ్రప్రదేశ్‌కు హోదా పేరిట రాజకీయ చదరంగం తిరిగి మొదలైంది. అదిపైకి చూసేం దుకు టిడిపి, వైఎస్‌ఆర్‌సిపి, బిజెపిల మధ్య సాగు తున్న క్రీడవలె తోస్తుంది. కాని లోతుగా ఆలోచిస్తే అన్ని పార్టీలు కూడా ఆ రాష్ట్ర ప్రజలను పావు లుగా ఉపయోగించుకునే ప్రయత్నాలుగా అర్థ మవుతాయి.

హోదా ప్రశ్న మొదటినుంచి విచిత్రంగానే సాగుతూ వస్తున్నది. కొన్నాళ్ళ తర్వాత అందరూ దానిని వదలివేసి ఇక కేంద్రం హామీ ఇచ్చిన ప్రత్యేక ప్యాకేజీకి రాజీ పడుతున్నట్లు కనిపించింది. ప్రజలకు కూడా అటువంటి రాజీ భావన ఏర్పడుతున్నట్లు తోచింది. అటువంటి స్థితిలో కొద్ది వారాలుగా విషయం మళ్లీ ముందుకు రావటమేగాక ఒక పేలుడు పదార్థం వలె తయారైంది. ఉన్నట్లుండి ఇట్లా వాతావరణం మారటం ఆశ్చర్యకరమే అయినా, ఎన్నికలు సమీపిస్తుండటం ఇందుకు కారణమని అర్థమవుతున్నదే. పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే వచ్చే సంవత్సరపు ఎన్నికలలో ప్రచారం యావత్తూ ఈ అంశం చుట్టే తిరగవచ్చు కూడా.

రాజకీయ పార్టీలను అట్లుంచి ప్రజల దృష్టితో ఆలోచించినపుడు, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి ఏమి జరిగింది, కేంద్రంలోని అధికార పక్షం చేసిన మంచి చెడులు ఏమిటి అనేది చర్చనీయాంశం కావాలి. కేంద్రంలోని బిజెపి పాత్ర రెండు విధాలుగా చర్చకు రావాలి. ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి ఏమి చేసారన్నది ఒకటైతే, సార్వత్రికంగా దేశంకోసం ఏమిటన్నది రెండవది. కాని ఈ హోదా వ్యవహారంతో రెండు ప్రభుత్వాల ఈ అయిదేళ్ల విధానాలు, చేసిన అభివృద్ధి అనేదంతా హైజాక్ అయిపోతున్నది. కనీసం అటువంటి ప్రమాదం ఏర్పడుతున్నది. 'హోదా' అనేది ఒక సెంటిమెంటుగా మారినందున, అధికార రాజకీయాలు దానిని ఇంకా సెంటిమెంటు చేస్తున్నందున, చివరకు ప్రజలు కూడా ఆ విషయమై తమతమ అవగాహనలను బట్టే ఓటు చేసినా చేయవచ్చు. అందుకు ప్రజలను నిందించలేముగాని, వారిని ఆ స్థితిలోకి నెట్టజూస్తున్న పార్టీలను మాత్రం మినహాయించలేము.

ప్రత్యేక హోదావల్ల కలిగే అదనపు ప్రయోజనాలు లేవని కాదు, అందుకు సంబంధించిన చట్టాన్ని చూసిన సామాన్యులకైనా అవేమిటో అర్థమవుతుంది. కాని అసలు ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రానికి చట్టం ప్రకారం ఆ హోదా ఇవ్వటం వీలవుతుందా అనేది మౌలికమైన ప్రశ్న. వీలుకాదని కూడా అదే చట్టాన్ని పరిశీలించినపుడు అర్థమవుతుంది. ఈ మాట ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలోనే అందరికీ తేటతెల్లంగా తెలుసు. అయినప్పటికీ అందరూ రాజకీయ ప్రయోజనాలకోసం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భ్రమలను కల్పించారు. ఇందుకు కుడి–ఎడమ–మధ్య పార్టీలలో ఏ ఒక్క టీ మినహాయింపుకాదు. చివరకు అక్కడి మేధావులు, మీడియా సైతం నిజాయితీగా వ్యవహరించకపోవటం, చేదు అయినప్పటికీ ప్రజలకు వాస్తవ పరిస్థితిని చెప్పకుండా అదే వెల్లువలో కొట్టుకుపోవటం ఒక పెద్ద విషాదం. ఈ రెండు వర్గాలు కూడా పార్టీల రాజకీయాలతో ప్రభావితం అయినందువల్లనో, లేక ఉద్యోగాలకు గురైనందువల్లనో గాని, మొత్తానికి సమాజ పరిణామాలలో మేధావులు, మీడియా అనే శక్తులు ఎటువంటి స్వతంత్ర పాత్రను నిర్వహించాలో, ప్రజలకు మేలు చేయాలో, వారి వెంట నిలవాలో ఆ పనిచేయలేదు. వారట్లా వ్యవహరించి ఉంటే రాజకీయ వాదులు ఇటువంటి చదరంగాలు సాగించటం ఇంత తేలిక అయేదికాదు.

చట్టప్రకారం ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ వంటి నైసర్గిక పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు గల ప్రాంతానికి ఎంతమాత్రం వీలయేది కాదు. ఆ మాట రాష్ట్ర విభజన సమయంలో ఈ ప్రతిపాదన వచ్చినపుడు కేంద్రస్థాయి అధికారులు స్పష్టంగా వివరించారు. అయినప్పటికీ ఇక్కడ ప్రజలను భ్రమపెట్టి తమ ప్రయోజనాలు నెరవేర్చుకునేందుకు అన్ని పార్టీలు వీరత్వాలను ప్రదర్శించాయి. అదంతా కేవలం నటన. వాస్తవాలు తెలియని ఆంధ్రప్రాంత ప్రజలు వారిని నమ్మారు. చివరకు విషయమంతా ఒక రాజకీయ క్రీడగా మారి నేటికీ కొనసాగటానికి మూలాలు ఇక్కడున్నాయి.

> వాస్తవానికి విభజన దరిమిలా వివిధ సంస్థలను కొత్త రాష్ట్రానికి ఇవ్వటం, నిధులు ఉదారంగా మంజూరు చేయటం, పథకాలు ప్రకటించటం వంటివి జరగటాన్ని కాదనలేము. కాని, హోదా ఇవ్వటం, అమరావతికి డబ్బు మొత్తం ఇవ్వటం (నిబంధనలు అంగీకరించకున్నా, లోగడ ఏ రాష్ట్రానికి అట్లా జరగకున్నా) వంటివి కొండ గుర్తు వాదనలుగా మారి, ఇతరత్రా ఇచ్చిన వాటినన్నింటిని మింగి వేసాయి. ఇట్లా జరగటానికి ఒక కారణం అధికార రాజకీయాలు కాగా, మరొక కారణం అధికారంలో గలవారు ధైర్యంగా, నిజాయితీగా ప్రజలకు వాస్తవాలను వివరించకపోవటం. ఈ వలయంలో అందరూ చిక్కుకున్నందువల్లనే మనం ఈ రోజున చూస్తున్నవన్నీ జరుగుతున్నాయి.

ఇందుకు దోహదం చేసిన పరిస్థితి మరొకటి ఉంది. అది ఆయా హామీలు, ప్యాకేజీల అమలు తీరు. విభజన జరుగుతున్నందున కొత్త ఆంధ్రప్రదేశ్‌కు ఏమేమి అవసరమో తెలియచేయవలసిందిగా అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అన్ని పార్టీలను కోరింది. ఆ ప్రకారం ఇతర పార్టీలు జాబితాలను ఇవ్వగా, తాము విభజననే ఆమోదించనప్పుడు జాబితా ఎట్లా ఇవ్వగలమంటూ పనికిరాని అవాస్తవిక రాజకీయం చేసింది తెలుగుదేశం పార్టీ. అంతకన్న ముఖ్యంగా, విభజన చట్టంలో ప్రకటించిన హామీల అమలుకు సంబంధించి కూడా ఎవరి రాజకీయం వారు చేసారు. ఆయా హామీల అమలు మొత్తం జరగవలసిందే. అట్లానే, హోదా ''ఇవ్వలేక''పోయినా అందుకు సమానం కాగల ''ప్యాకేజీ'' ఇవ్వగలమని చెప్పిన నరేంద్రమోడీ ప్రభుత్వం ఆ పని చేయవలసిందే. హోదా వీలుకావని తెలిసి కూడా హోదా ఇస్తామంటూ ఎన్నికల సమయంలో బిజెపి నాయకులు హడావిడి ఎందుకు చేసారనే ప్రశ్నను అట్లుంచితే, చట్టంలో చేర్చినవి, తర్వాత ప్యాకేజీ అన్నవి అయితే అమలు జరగవలసినవే. కాని ఇపుడు రెండవసారి కూడా తిరిగి ఎవరి రాజకీయం వారు చేసారు. గత సుమారు నాలుగేళ్ల కాలాన్ని అదే విధంగా గడిపారు. సరిగా ఈ రెండు దశల నాటకం వల్లనే ఈ రోజున, ఎన్నికలు సమీపిస్తుండగా ప్రజలను ఎన్నికల చదరంగంలో పావులుగా మార్చేందుకు అన్ని పార్టీలు పోటీ పడుతున్నాయి.

విభజనచట్టంలో, పాకేజీలో భాగంగా ఇవ్వజూపిన వాటి గురించి ఇక్కడ కొంత చెప్పుకోవాలి. ఇవ్వగలమన్న వాటి జాబితానంతా ఇపుడు రాయటం లేదు. కాని వాటి అమలుగురించిన వివరణ అవసరం. వేటి అమలు అయినా ఒకసారి ప్రకటించిన తర్వాత జరగవలసిందే గాని, అందుకు ఒక పద్ధతి అంటూ కూడా ఉంటుంది. గతంనుంచి గల నియమాలు, క్రమాలు అందుకు వర్తిస్తాయి. ఒకవేళ కోరుకున్నా అందుకు విరుద్ధంగా వ్యవహరించటం సాధ్యం కాదు. ఇది ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే కాదు, ఏ రాష్ట్రానికైనా వర్తిస్తుంది. ఇటువంటి ప్యాకేజీలే కాదు, సాధారణ పరిపాలనా క్రమంలో నైనా అదే జరుగుతుంది. ఇవీ వాస్తవ స్థితులు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి, ఇక్కడి టిడిపి ప్రభుత్వానికి, ప్రభుత్వంలో లేనిపార్టీలకు ఇదంతా తెలియనది కాదు. మేధావులకు, మీడియాకు కూడా తగినంత తెలుసుననే భావించాలి. అటువంటి స్థితిలో, అమలు పద్ధతులు ఏ విధంగా ఉంటాయో వీరంతా ప్రజలకు స్పష్టమైన విధంగా, దాపరికం లేకుండా వివరించాలి. అందువల్ల విషయాలు సజావుగా సాగుతాయి.

కాని అందరు కూడా ప్రజలను ఈ విషయాలలో చీకటిలో పెట్టారు. చెప్పినవి అన్నీ శరవేగంతో జరిగిపోతాయన్నట్లు, అందుకు మొదటి నుంచి గల నిబంధనలు అయినా వర్తించవన్నట్లు, వర్తించకూడదన్నట్లు మాట్లాడుతూ వచ్చారు. నిజాలు వివరిస్తే ప్రజలు అర్థం చేసుకోరని, తమకు ఓట్లు పోతాయన్నదే అందరి భయం. తమపై ఇతర పార్టీలు వ్యతిరేకంగా ప్రచారం చేసి ఓట్లు సంపాదించుకుంటాయన్న జంకు. ఈ విధమైన ఇరకాటపు వలయంలో పడి అందరుకూడా వాస్తవాలను మరుగుపరచి మాట్లాడుతూ వస్తున్నారు. వాస్తవానికి విభజన దరిమిలా వివిధ సంస్థలను కొత్త రాష్ట్రానికి ఇవ్వటం, నిధులు ఉదారంగా మంజూరు చేయటం, పథకాలు ప్రకటించటం వంటివి జరగటాన్ని కాదనలేము. కాని, హోదా ఇవ్వటం, అమరావతికి డబ్బు మొత్తం ఇవ్వటం (నిబంధనలు అంగీకరించకున్నా, లోగడ ఏ రాష్ట్రానికి అట్లా జరగకున్నా) వంటివి కొండ గుర్తు వాదనలుగా మారి, ఇతరత్రా ఇచ్చిన వాటినన్నింటిని మింగి వేసాయి. ఇట్లా జరగటానికి ఒక కారణం అధికార రాజకీయాలు కాగా, మరొక కారణం అధికారంలో గలవారు ధైర్యంగా, నిజాయితీగా ప్రజలకు వాస్తవాలను వివరించకపోవటం. ఈ వలయంలో అందరూ చిక్కుకున్నందువల్లనే మనం ఈ రోజున చూస్తున్నవన్నీ జరుగుతున్నాయి.

ఏం పాపము చేశామని? సిరియాలో జనం ఆక్రందన



ముహమ్మద్ ముజాహిద్



సిరియా ముస్లిములు ఇప్పుడు రోజూ ఆరుసార్లు నమాజులు చేయాల్సి వస్తోంది. ఐదు ఫర్జ్ నమాజులతోపాటు అదనంగా జనాజా నమాజులు కూడా చేస్తున్నారు. ఇది సిరియా దుస్థితికి నిదర్శనం. సిరియా గురించి రాయాలంటే మాటలు రావడం లేదు. గత ఒక్క వారంలోనే వందలాది ముక్కుపచ్చలారని పిల్లలు లోకం చూడకుండానే పరలోకానికి వెళ్లిపోయారు. సోషల్ మీడియాలో వచ్చే విడియోలనుంచి ''నేను ఏ పాపం వల్ల హతమార్చబడ్డాను'' అని ఆ పసిపిల్లల ఆత్మలు ప్రశ్నిస్తున్నాయి. సిరియా గురించి వైరల్ అవుతున్న విడియోల్లో ప్రాణాలు కోల్పోతున్న తమ బంధువుల రోదనలు చూసి కళ్లు చెమర్చుతున్నాయి. పిల్లల హాహాకారాలు, మహిళల ఆక్రందనలు చూస్తుంటే కన్నీళ్లు ఆగడం లేదు. బాంబుల వర్షానికి నేలమట్టమవుతున్న భవన శిధిలాలకింద ముస్లిముల ఐక్యత కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నట్లు తోస్తోంది. సిరియాలో ఇంత మారణహోమం జరుగుతున్నా అటు ముస్లిమ్ దేశాలు కానీ, ప్రపంచ శాంతి అవార్డు గ్రహీతలు కానీ, ఐక్యరాజ్య సమితి కాని ఏమైపోయాయో అర్థం కావడం లేదు. సిరియాపై జరుగుతున్న దాడులను ప్రశ్నించే వారే లేరు. సిరియాపై ఇంత నిర్దయగా, భయంకరంగా బాంబుల వర్షం కురుస్తుంటే ప్రపంచ సమాజం మిన్నకుండిపోవడం దేనికి సంకేతం. ప్రమాదకరమైన బాంబుల వర్షం సిరియాను శిథిలంగా మార్చేస్తున్నా ముస్లిమ్ దేశాలు చోద్యం చూస్తున్నాయి. అక్కడి బాల్యం ఛిద్రమవుతున్న విడియోలు చూస్తుంటే అమానుషం పరాకాష్టకు చేరిందనిపిస్తోంది. 2011లో ప్రారంభమై కొనసాగుతున్న అంతర్యుద్ధంతో సిరియా పౌరులు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. సిరియా పేదరికంలో మగ్గుతోంది. సిరియా అస్తిత్వాన్ని నామరూపాల్లేకుండా చేస్తున్న అమెరికా, రష్యా, స్వతహాగా ఆ దేశ అధ్యక్షుల వికృత క్రీడ ఇది. ఈ అంతర్యుద్ధం కారణంగా తలదాచుకునేందుకు కొందరు వలసబాట పడుతుంటే మరికొందరు ఎటూ వెళ్లలేక దిక్కులు చూస్తున్నా రు.


తిరుగుబాటు దారులకు సైనిక ప్రభుత్వ బలగాలతో జరిగే పోరుతో సహా అమెరికా, రష్యా జరుపుతున్న దాడులు సిరియాను స్మశానవాటికగా మార్చేస్తున్నాయి. ఒకప్పుడు పిల్లా పాపలతో హాయిగా గడిపిన కుటుంబాలు ఇప్పుడు మొండి గోడలుగా మారాయి. ఈ విధ్వంసానికి అడ్డుకట్ట పడేదెలా అని సిరియా ప్రజలు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. అంతర్యుద్ధం ఎప్పుడు ముగుస్తుందా అని సిరియా ప్రజలు దిక్కులు చూస్తున్నారు. గత వారం రోజుల కింద జరిగిన దాడిలో వెయ్యి మందికిపైగా నేలకొరిగారు. వీరిలో అత్యధికంగా పసిపిల్లలే ఉండటం అందరినీ కలచివేస్తోంది. కాల్పుల విరమణను, ఐరాస తీర్మానాన్ని ఉల్లంఘించి సిరియాలో దాడులకు తెగబడటాన్ని ఎవ్వరూ ప్రశ్నించడం లేదు. అమెరికారష్యా ఆధిపత్య పోరులో సిరియా ప్రజల రక్తం ఏరులై పారుతోంది. అక్కడి ప్రజల ఆకలి కేకలు ప్రపంచ ముస్లిమ్ దేశాల అనైక్యతను ప్రశ్నిస్తున్నాయి. ముస్లిముల ఈ దుస్థితికి కారకులెవరు? దీనికి ఆ అల్లాహ్‌ను ముద్దాయిగా నిలబెడదామా? ఒకవేళ మనపై జరుగుతున్న అమానుషాలను అల్లాహ్ ముందు ఏకరువు పెట్టినా అవి ఫలవంతం కావటం లేదంటే లోపం ఎక్కడుంది. మన దుఆలు స్వీకృతి పొందడం లేదని అల్లాహ్ ను నిందిద్దామా? అసలు మన దుఆలు స్వీకృతి పొందే అర్హత సాధించేలా ఉన్నాయా? ఎందుకంటే మన ఆచరణలకు, మన మాటలకు పొంతన ఉండటంలేదు.

వచ్చే విద్యాసం॥లో సిసిఇ ఉన్నట్లా? లేనట్లా?

ఎడిటర్‌కు లేఖ

రాబోయే 2018–19 విద్యాసంవత్సరం జూన్ 1వ తేదీనుండే ప్రారంభమవుతుందని విద్యామంత్రి ప్రకటించారు. ప్రస్తుత విద్యాసంవత్సరం ఏప్రిల్ 16వ తేదీన ముగుస్తుందన్నారు. ఇలా అయితే ఒకటినుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఏప్రిల్ మొదటివారంలో జరుపవలసి ఉంది. జూన్ ఒకటవ తేదీనుండి విద్యాసంవత్సరం ప్రారంభిస్తే సిసిఇ ప్రకారం మార్చి 21 వ తేదీనుండి ఏప్రిల్ 23వ తేదీవరకు బోధించవలసిన సిలబస్ పరిస్థితి ఏమిటి? ఆ సిలబస్ జూన్ 1వ తేదీనుండి ప్రారంభిస్తే రాబోయే 2018–19 సంవత్సర 10వ తరగతి వార్షిక పరీక్షలపై ప్రభావం పడుతుంది. చాలామంది ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు రాబోయే సంవత్సరంలో సిసిఇ పద్ధతిలో బోధన సాగుతుందో ? లేదో? అనే అనుమానం వ్యక్తమవుతున్నది. ఇటీవలి కాలంలో కేంద్ర మానవ వనరుల శాఖామంత్రి జవదేకర్ రాబోయే 2019–20 విద్యాసంవత్సరంలో సిలబస్ మొత్తాన్ని సగానికి తగ్గిస్తాం అని ప్రకటించారు. ఇలా అయితే సిబిఎస్ఇ లో కూడా సిసిఇ ఉంటుందా? లేదా? ఒకవేళ సిలబస్ తగ్గించి, సిసిఇ ని తీసేస్తే 2015 సంవత్సరం నుండి వివిధ వ్యయ ప్రయాసలకు ఓర్చి ఆటోపోటులను భరిస్తూ.. రెండు సంవత్సరాల బిఎడ్ కోర్సు చదివిన వారి పరిస్థితి ఏమిటి? మళ్ళీ బిఇడి కోర్సును ఒక ఏడాదికోర్సుగా మారుస్తారా? అనేది ప్రశ్నార్థకంగానే ఉన్నది. వచ్చే సంవత్సరంలో సిసిఇ ఉంటుందో? లేదో? తెలుపగలరు. జూన్ ఒకటో తేదీన పాఠశాలలు పునః ప్రారంభం, ఒకవేళ అధిక ఎండల ప్రభావం వల్ల అనుకున్నట్లు జరగకపోతే పరిస్థితి ఏమిటి? రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతమంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారో.. దాదాపు ఆ స్థాయిలో ప్రైవేటు బడులలో పనిచేస్తున్న వారు ఉన్నారు. ఒకవేళ విద్యాసంవత్సరం ఏప్రిల్ 16 తో ముగుస్తే అసలే 10నెలల జీతంతో బ్రతుకు నెట్టుకు వస్తున్న యాజమాన్యం క్రింద పనిచేస్తున్న 'కూలి టీచర్ల' పరిస్థితి ఏమిటి? ఆ 16 రోజులను కాస్త కుదించి మార్చి30తో ముగించేందుకురంగం సిద్ధమవుతుందేమో?

– సూరం అనిల్



గురుభక్తికి ఉత్తమ నిదర్శనం



దేశంలోనే విఖ్యాత ఆధ్యాత్మిక వేత్తల్లో ఒకరు.. కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు జయేంద్ర సరస్వతి స్వామి వారు. హిందూ ధర్మ ప్రచారంలో కొన్ని దశాబ్దాల నిష్టాగరిష్టమైన జీవితాన్ని గడిపారు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి . జయేంద్ర సరస్వతి 1935లో జనవరి 18వ తేదీన తంజావూరు జిల్లాలోని ఇరుల్ నీకి లో జన్మించారు. ఆయన అసలు పేరు సుబ్రహ్మణ్య మహదేవ. కంచి పీఠానికి 69వ శంకరాచార్యగా ఆయన పీఠాధిపతి అయ్యారు. నడిచే దేవుడిగా పేరున్న కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి తరువాత జయేంద్ర సరస్వతి పీఠాధిపతి అయ్యారు. ఆయన 1954 మార్చి 22 నుంచి కంచి పీఠాధిపతిగా వ్యవహరిస్తున్నారు. ఆది శంకరుల మార్గంలో ... 'వేదో నిత్యం అధీయతామ్!' వేదాలను ప్రతిరోజూ అధ్యయనం చేయాలని ఆదిశంకరులు చెప్పారు. వేదాల పైనా, వేద విద్యార్థుల పైనా గురువు గారి అనురాగం మాటలకు అందనిది. అధ్యయనం గురించీ, చదువుల్లో వారు నిమగ్నం కావడానికి ప్రోత్సాహకంగా సమకూర్చే సౌకర్యాలూ, ఇతర అవసరాల గురించీ విద్యార్థులను ఆయన వాకబు చేసేవారు. వేద పండితులను సత్కరించేవారు. వేద భాష్యం అధ్యయనం చేయాలని వారిని ప్రోత్సహించేవారు. ఆదిశంకరుల అడుగు జాడలను పూజ్య గురువులు మనసా వాచా కర్మణా అనుసరించారు. ఆది శంకరులు తన కాలంలోని అన్ని శక్తులనూ ఏకం చేశారు. గురు దేవులు వివిధ వర్గాల ఐక్యతకు కేంద్ర శక్తిగా నిలిచారు. దేశంలో భిన్నత్వంలోని ఏకత్వాన్ని స్థిరంగా నిలపడానికి కృషి చేశారు. ఆదిశంకరుల తరువాత కైలాస పర్వతం దగ్గరకు పీఠం నుంచి వెళ్ళింది గురువుగారే! ఆ పర్వత పాదాల దగ్గర ఆది శంకరుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 51 శక్తి పీఠాలు, ఏడు మోక్ష పురాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలు... ఇలా దేశంలోని పుణ్య స్థలాలన్నిటినీ దర్శించారు. ఏడు పవిత్ర నదులతో సహా పుణ్య నదులన్నిటిలో స్నానం చేశారు. కంచి మహా స్వామీజీ తన శిష్యులైన జయేంద్ర సరస్వతీ స్వామి శక్తిసామర్థ్యాలను వివిధ సందర్భాల్లో మెచ్చుకున్నారు. ఓ సందర్భంలో ఓ భక్తుడితో మాట్లాడుతూ, ''నేను నీతో మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా వస్తే, నీతో మాటలు ఆపేసి, వాళ్ళతో మాట్లాడడం మొదలుపెడతా. అలా చాలాసేపు మాట్లాడుతుండే సరికి, దర్శనం కోసం నిరీక్షించే భక్తుల క్యూ పెరిగిపోతుంది. కానీ, 'పుదు పెరియవాళ్' (కొత్త పెద్ద స్వామిజీ... అంటే జయేంద్ర సరస్వతి) మాత్రం ఏకకాలంలో పది వేర్వేరు పనులు చేయగల 'దశావధాని'. ఆయన ఒక పక్కన భక్తులకు ప్రసాదం ఇస్తూనే, మరోపక్క కొందరు భక్తులు వేసే ప్రశ్నలకు సమాధానం చెబుతారు. నేను అలా చేయలేకపోతున్నా'' అన్నారు. అలా మహా స్వామి తన శిష్యుడి సామర్థ్యాలను మెచ్చుకున్నారు.

కాంచీపురం దేవాలయం


కాంచీపురం దేవాలయం ప్రతి హిందువు వారి జీవిత కాలం లో ఒక్కసారైనా సందర్శించవలసిన ఏడు పవిత్రమైన ప్రదేశాలలో ఒకటిగా ఉంది. కాంచీపురం హిందువులు పూజించే నగరం. హిందూ మత పురాణాల ప్రకారం, ఏడు పవిత్ర ప్రదేశాలలో అన్నిటిని సందర్శించటం ద్వారా 'మోక్షం' లేదా ముక్తిని సాధించవచ్చు. అలాగే ఈ నగరం విష్ణు భక్తులు, శివ భక్తులకు పవిత్ర ప్రదేశం. కాంచీపురం నగరంలో శివుడు, విష్ణుకు అంకితం చేసిన అనేక ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాల్లో అత్యంత ప్రముఖమైన వాటిని 'పంచభూత స్థలములు' అంటారు. శివుడు ప్రాతినిధ్యం వహించే ఐదు ఆలయాల్లో ఒకటి. ఇంకా విష్ణువుకి అంకితం చేసిన వరదరాజ పెరుమాళ్ ఆలయం ఉంది. పవిత్రమైన నగరం ఎందు కంటే నగరంలోపల నిర్మించబడిన అనేక విష్ణు ఆలయాలకు పేరు పొందింది. 'కా' అంటే బ్రహ్మ సూచిస్తుంది, 'అంచి' అంటే విష్ణు పూజలు జరిగే ప్రదేశం కాబట్టి ఈ నగరానికి కాంచీపురం అని పేరు వచ్చింది. అయితే, నగరంలో అనేక శివ దేవాలయాలు ఉన్నాయి. శివాలయాలు అత్యధిక సంఖ్యలో ఉంటాయి. కాంచీపురం తూర్పు ప్రాంతాన్ని విష్ణు కంచి అని, పశ్చిమ ప్రాంతాన్ని శివ కంచి అని పిలుస్తారు. కాంచీపురంలో ఇతర ప్రముఖ దేవాలయాలుగా కైలసనతార్ఆలయం, కామాక్షీ అమ్మ వారి ఆలయం, కచాపెశ్వరార్ఆలయం, కుమార కొట్టం టెంపుల్ ఉన్నాయి. పవిత్రమైన చరిత్రల కలయిక ఈ నగరానికి ఘనమైన చరిత్ర కలిగి ఉన్న కారణంగా చరిత్ర అభిమానులు ఖచ్చితంగా కాంచీపురం ఇష్టపడతారు. కంచిని పల్లవ రాజులు 3 వ , 9 వ శతాబ్దాల మధ్య వారి రాజధానిగా చేసుకున్నారు. పల్లవులు తమ రాజధాని నగరాన్ని తయారు చేసేందుకు కృషి , చాలా ధనాన్ని వెచ్చించారు. వారు బలమైన రోడ్లు, భవన నిర్మాణాలు, ప్రాకారాల అలాగే నగరం చుట్టూ విస్తృత కందకము నిర్మించారు. చైనా వ్యాపారులు కాంచీపురం నగరంలో వ్యాపారం చేసేవారు. పల్లవులు ఏడవ శతాబ్దంలో కొన్నిసార్లు నగరానికి వచ్చిన జువాన్జాంగ్ అనే చైనీస్ యాత్రికుడు తన యాత్రా చరిత్రలో నగరాన్ని గురించి ధైర్యమైన, సామాజిక న్యాయం విశ్వసించిన ప్రజల గురించి నేర్చుకున్నానని రాశాడు. 11 వ శతాబ్దంలో చోళ రాజులు కాంచీపురం పాలన చేపట్టారు, , 14 వ శతాబ్దం వరకు నగరాన్ని పరిపాలించారు. నిజానికి, చోళ రాజులు నగరం నిర్మాణంలో తూర్పు భాగం వైపుగా విస్తరించడం ప్రారంభించారు. 14 వ శతాబ్దం నుండి 17 వ శతాబ్దం వరకు విజయనగర రాజవంశం కాంచీపురం రాజకీయ నియంత్రణ కలిగి ఉంది. చుట్టు అందమైన ప్రాంతాలు కలిగి ఉన్నాయి.





భోజనం ఏ వైపు తిరిగి చేయాలి...

మనం చేసే ప్రతి పనిలో కొన్ని నియమాలు ఉంటాయి. వాటిని పాటించడం ద్వారా ఏ పని చేసినా విజయం సాధించవచ్చని పెద్దల అభిప్రాయం. భోజనం చేయడానికీ ఓ క్రమం వుంటుంది. మనం చేసే భోజనంలో వివిధ రకాలైన ఆహార పదార్థాలుంటాయి. ఆహారాన్ని ఏ వైపు కూర్చుని తినాలన్న విషయాన్ని పెద్దలు ఎప్పుడో చెప్పారు. పూర్వకాలంలో పీటలు వేసుకుని కూర్చుని భుజించేవాళ్లు. ఈ ఆధునిక కాలంలో డైనింగ్ అంటూ ఏ దిశలో కూర్చుంటున్నామో కూడా తెలియడం లేదు. సరైన దిశలో అమర్చుకుని తింటే శుభాలు జరుగుతాయి. తూర్పు ముఖం పెట్టి భుజించడం వల్ల ఆయుష్షు పెరుగుతుందని. పడమర వైపు కూర్చుని భుజిస్తే ఇంట్లోని సామాను వృద్ధి చెందుతుందని. దక్షిణం వైపు కూర్చుని భుజిస్తే పేరు ప్రతిష్టలు వృద్ధి చెందుతాయట. ఏ కార్యము తలపెట్టినా విజయాలే కలుగుతాయట. ఉత్తరం దిక్కు చూస్తూ కూర్చుని భుజించరాదు. ఆ వైపు ముఖం పెట్టి భుజిస్తే సర్వ అరిష్టాలతో పాటు అనారోగ్యాలు వెన్నంటే ఉంటాయట.





అజ్ఞానం తెచ్చిన అనర్థం

సోలోమోను చక్రవర్తి మహాజ్ఞాని, బహుముఖ ప్రజ్ఞాశాలి, యుద్ధ వీరుడు, పాలనా దక్షుడు కూడా. ఆయన రాసిన, పలికిన జ్ఞానయుక్తమైన మాటల్ని సామెతల గ్రంథం పేరిట దేవుడు బైబిల్‌లో చేర్చాడు. జ్ఞానుల నాలుక నుండి మనోహరమైన జ్ఞానాంశాలు జాలువారుతాయని, మృదువైన మాట మహాక్రోధాన్ని కూడా చల్లార్చుతుందని, సాత్వికమైన నాలుక జీవ వృక్షం వంటిదని, బుద్ధి హీనుల నోటినిండా మూఢత్వమే ఉంటుందని, అది నాశనానికే దారి తీస్తుందని బైబిల్ చెబుతోంది (సామె 15:17).

అయితే పండిత పుత్రుడన తాగే అతని కూమారుడు, వారసుడు రెహబాము ఏలడం ఆరంభించగా అసమ్మ వాదులు యరోబాము అనే వ్యక్తి నాయకత్వంలో వచ్చి నీ తండ్రి మమ్మల్ని కఠినంగా పాలించాడు. అది కొంత సడలిస్తే మేలు నీకు సదా దాసులుగా ఉంటామని వేడుకున్నారు. వారికి మృదువుగా బదులివ్వాలని అతని తండ్రి కాలంనాటి పెద్దలు సూచించగా, రాజు కఠినంగా బదులిస్తేనే ప్రజలు భయపడి విధేయులవుతారని అనుభవం లేని అతని స్నేహితులు సూచించారు. రెహ బాముకు స్నేహితులమాటే నచ్చి, నా తండ్రికన్నా నేను కఠినంగా పాలిస్తానని వారికి జవాబిచ్చాడు. (రాజులు 12:1 20).

అంతే!! అతని తాత గారైన దావీదు చక్రవర్తి, తండ్రి గారైన సోలోమోను చక్రవర్తి హయంలో ప్రపంచంలోనే అత్యంత వైభవంతో కూడిన, శక్తివంతమైన దేశంగా పేరొందిన ఇశ్రాయేలు దేశం ఒక్క సారిగా రెండు ముక్కలైంది. రెహబాము రాజుగా యూదు దేశంగా యరోబాము రాజుగా ఇశ్రాయేలు దేశంగా చీలిపోయి, కాలక్రమంలో అత్యంత క్షీణ దశకు చేరి సామంత దేశాలయ్యాయి. అక్కడి ప్రజలు శత్రువులకు బందీలు, బానిసలయ్యారు. ఒక వ్యక్తి మాట్లాడిన ఒక అనాలోచితమైన మాట ఇంతటి పర్యవసానానికి దారి తీసింది. ఒక మృదువైన మాట జీవితాన్ని కడుతుంది. పరుషమైన మాట ఆ జీవితాన్నే నాశనం అంచులదాకా తీసుకెళ్తుంది. సమయోచితమైన, ఉద్రిక్తతలను చల్లార్చగలిగిన సంభాషణ కేవలం జ్ఞానంతోనే కాదు, దైవకృపతోనే సాధ్యమవుతుంది. యేసు క్రీస్తు బోధలు, మాటలు, జీవన శైలి నిండా ఆ సౌమ్యత, సాత్వికత్వం, మృదుత్వం, సరళత్వం కొట్ట వచ్చినట్టు కనిపిస్తాయి. మీ సంభాషణ సందర్భోచితంగా, ఉప్పు వేసినట్టుగా ఎల్లప్పుడూ రుచికరంగా, కృపాసహితంగా ఉండాలంటాడు పరిశుద్ధాత్మ దేవుడు (కొల 4:6).

జీవితాల్ని కట్టే శక్తి, కూల దోసే శక్తి కూడా మన మాటలకుంది. అది తెలిసే అనాలోచితంగా ప్రవర్తిస్తూంటారు. అందుకే అనర్థాలు, అపార్థాలు, అశాంతిని రేకెత్తించే పర్యవసనాలు !! ఒక నీటి బిందువుకున్న విలువ, శక్తి కోటి నీటి బుడగలకు కూడా ఉండదు కదా!! జ్ఞాన యుక్తమైన ఒక మాట ముందు, అజ్ఞానుల పేలాపనలు, ప్రగల్భాలు, డాంబమంతా దూదిలాగా తేలిపోతుంది. అందుకే కాలు జారకుండా ఉన్నంత జాగ్రత్తగా నోరు కూడా జారకుండా చూసుకోవాలి. చేంతాడంత వున్న చేతకాని అజ్ఞాని మాటలు, జ్ఞాని నోటరాలే ఒక ముత్యం లాంటి మాటతో సరిపోలవు. మన పెదవి దాటని మాట మనకు బానిసైతే, మన పెదవి దాటిన మాటకు మనం బానిసలవుతాం.



రెవ.టి.ఎ. ప్రభుకిరణ్
98488 21472

చూపుల చౌర్యంపై దృష్టిసారిద్దాం

చూపుల్లో సిగ్గు, బిడియాలు ఉట్టి పడాలి. లజ్జ అనే కాటుక కళ్లలో ప్రతిబింబించాలి. చూపుల బిడియం మనిషికి అత్యంత విలువైన ఆభరణం. చెడుచూపు కంటే అత్యంత హేయమైనది మరొకటి లేదు. పాపపంకిలంలో తోసేందుకు ఇదే తొలిమెట్టు. మన వ్యక్తిత్వాన్ని దిగజారుస్తుంది. హృదయాన్ని చీకటి కుహరంగా మార్చేస్తుంది. చూపులను కిందికి వాల్చి ఉంచడం వల్లనే మన హృదయాలు కాంతి రేఖలవుతాయి. ఎవరి చూపులైతే కిందికి వాలి ఉంటాయో అలాంటి వారిని ఏ శక్తీ అపమార్గం పట్టించలేదు. అలాంటి వారిని ఎలాంటి ప్రలోభాలు లొంగదీసుకోలేవనడానికి నిదర్శనమే ఈ సంఘటన. ఉమేర్ బిన్ హబీబీ రోమ్ లో ఒకసారి బానిసగా పట్టుబడ్డారు. ఈయన ఆరడుగుల అందగాడు. ఆయన అందచందాలకు ముగ్ధుడైన రోమ్ సర్దారు నువ్వు మా మతం స్వీకరిస్తే నా కుమార్తెనిచ్చి పెళ్లి చేస్తాను, నా రాజ్యంలో సగం వాటా రాసిస్తాను' అని ప్రలోభాలు పెట్టాడు. దానికి ఉమేర్ 'అరబ్ భూభాగమంతా నా పాదాక్రాంతం చేసినా నేను ఒక్క క్షణం కోసం కూడా నా ధర్మాన్ని విడిచిపెట్టలేను.' అని తెగేసి చెప్పాడు. దానికి రోమ్ సర్దారు ఆ యువకుణ్ని లొంగదీసుకునేందుకు ఒక వ్యూహం పన్నాడు. ఒక అందమైన మహలును సిద్ధం చేశాడు. ఆ యువకుణ్ని ఆ మహలులో బంధించి అందులో అత్యంత విలువైన మద్యం బాటిళ్లను, రుచికరమైన మాంసాహారాన్ని, అందమైన యువతిని ఉంచాడు. ఆ యువతి ఉమైర్ హబీబ్ ను తన కోరికను తీర్చుకోవాల్సిందిగా రెచ్చగొట్టేలా వ్యవహరించసాగింది. ఉమైర్ హబీబ్ దించిన తల ఎత్తలేదు. ఇలా మూడురోజులు, మూడు రాత్రులు గడిచాయి. తిండి తిప్పలు లేవు. మూడు రోజుల తర్వాత ఆ యువతి ''మూడు రోజులుగా ఏమీ తినకుండా ఎందుకింత మొండికేసి కూర్చున్నావు. కనీసం తల ఎత్తి కూడా చూడటం లేదు, అసలు నువ్వెవరవు. ఇంత మంచి అవకాశాన్ని ఎందుకు జారవిడుచుకుంటున్నావు' అని ఆ యువతి ప్రశ్నించింది. దానికి ఆ యువకుడు ''నా దేవుడు నన్ను ప్రతీక్షణం చూస్తున్నాడు. నేను ఈ పాడు పని చేసేందుకు సిగ్గుపడుతున్నాను. మూడు రోజులు కాదు ముప్పై రోజులు నువ్విలా నా ముందు కూర్చున్నా నేను ఈ పాడు పని చేయలేను. ఎందుకంటే నా యవ్వనం అల్లాహ్ అప్పగింత. నా యవ్వనంపై మచ్చరానివ్వలేను.'' అన్న ఆ యువకుడి మాటలకు ఆ యువతి విస్తుపోయింది. ''నీలాంటి ఆణిముత్యాన్ని నేను చూస్తూ చూస్తూ చంపుకోలేను. నేను ఎలాగైనా నిన్ను ఇక్కడి నుంచి బయటపడేస్తాను'' అని చెప్పి అక్కడి నుంచి బయటికి వచ్చింది. ఆ రోజు రాత్రి తన ఇంటి నుంచి సాధారణ భోజనం, మంచినీళ్ళు తీసుకుని వెళ్లి ఆ యువకుడికి ఇచ్చి అక్కడినుంచి తప్పించింది. ఇదీ వ్యక్తిత్వమంటే. పరిస్థితులు ఎంతలా ప్రలోభపెట్టినా మన వ్యక్తిత్వాన్ని, మన చూపులు పక్కదారి పట్టరాదు.

పెరిగిన టెక్నాలజీ పుణ్యమా అని యువతరం చూపుల మాయలో కొట్టుకుపోతోంది. ఈ కనుసైగల వలలో చిక్కుకుని బయటపడలేకపోతోంది. ఒక్క కను చూపుకే ఇంతలా కలవరపడితే మన యువత లక్ష్యాలు ఎలా సాధించగలుతుంది. బజారుకెళితే చాలు చూపుల చౌర్యాలే. కళ్లల్లో కళ్లుపెట్టి యువతీ యువకులు నిసిగ్గుగా చూసుకుంటున్నారు. కళ్లల్లో ఎలాంటి సిగ్గూఎగ్గూ లేకుండా చూపుల చౌర్యానికి పాల్పడుతున్నారు. అసలు సమాజంలో పెరుగుతున్న అత్యాచారాలు, వ్యభిచారాలు, ఎయిడ్స్ లాంటి రోగాలకు తొలిమెట్టు ఈ చూపులేనన్నది కాదనలేని సత్యం. మరి లాంటి చూపుల్ని ప్రోత్సహించే మార్గాలే కొత్తగా పుట్టుకొస్తున్నాయి. ఈ చెడు చూపుని వారించేలా ఎక్కడా అడ్డుకట్ట పడటం లేదు. సోషల్ మీడియా పుణ్యమా అని సిగ్గు బిడియాలు ఏనాడో చాపచుట్టేశాయా అనిపిస్తోంది. అరచేతిలో ఎలాంటి ఖర్చు లేకుండా హేయమైన అశ్లీల చిత్రాలు, వీడియోల ధాటికి యువతరం పక్కదారి పడుతోంది. ఇలాంటి హేయమైన చూపులూ క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. కోట్లాదిమంది ఫాలోవర్స్ ను తెచ్చిపెడుతున్నాయి. ఈ చూపుల మాయలో యువతరం తమ అమూల్యమైన యవ్వనాన్ని నిర్వీర్యం చేసుకుంటోంది. ''ప్రవక్తా! విశ్వసించిన పురుషులకు తమ చూపులను కాపాడుకోండి అనీ తమ మర్మాంగాలను రక్షించుకోండి అనీ చెప్పు. ఇది వారికి ఎంతో పరిశుద్ధ మైన పద్ధతి. వారు చేసే దానిని గురించి అల్లాహ్ కు బాగా తెలుసు.......ప్రవక్తా! విశ్వసించిన మహిళలకు ఇలా చెప్పు, తమ చూపులను కాపాడుకోండి అని, తమ మర్మాంగాలను రక్షించుకోండి అని, (దివ్యఖుర్ఆన్ 24:30,31) అంటోంది ఖుర్ఆన్. అల్లాహ్ మన చూపుల చౌర్యాన్ని కూడా పసిగట్టగలడు. అందుకే ప్రవక్త మహనీయులు పర స్త్రీపై తొలిచూపు పడగానే వెంటనే దృష్టి మరల్చుకోవాలని తాకీదు చేశారు. మొదటి చూపు నీదే కాని రెండో చూపు షైతాన్ చూపు అన్నారు. ఇలా పడ్డ చెడుచూపు ఎక్కడికో దిగజారుస్తుంది. ఇప్పుడు మనం చూస్తున్న దుర్మార్గాల్లో సగం ఈ చూపుల పుణ్యమే మరి. ''అతడు తన నెవ్వరూ అదుపు చేయలేరని అనుకుంటున్నాడా? మేము అతనికి రెండు కళ్ళూ, ఒక నాలుకా, రెండు పెదవులూ ప్రసాదించలేదా? ఇంకా స్పష్టమైన రెండు (మంచీ చెడుల) మార్గాలను అతనికి చూపాము.'' (ఖుర్ఆన్) ఆ రోజు మన రెండు కళ్ల విషయంలో అల్లాహ్ కు జవాబు చెప్పుకోవాలన్న విషయం బోధపడుతుంది. ఈ లోకంలో మన కళ్లను మంచి వైపే దృష్టి సారిద్దాం. మన చూపులను కిందికి వాల్చి ఉంచుదాం. మన తల్లిదండ్రుల వైపు ప్రేమవాత్సాలతో చూసుకుందాం. చెడుచూపు నుంచి మనల్ని మనం కాపాడుకుందాం. సృష్టి అందాలను వీక్షించి అల్లాహ్ ఔన్నత్యాన్ని చాటుదాం. మన చుట్టూ సమాజంలో జరుగుతున్న దుర్మార్గాలను అల్లాహ్ ముందు ఏకరువు పెట్టి కన్నీటిపర్యంతమవుదాం. అన్నింటికీ మించి మనకు రెండు కళ్లను ప్రసాదించి మనకు చూసే శక్తిని ప్రసాదించిన అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలుపుకుందాం. సమాజంలో కళ్లులేని కబోదులకు మార్గం చూపుదాం. కళ్లుండీ చూడలేని వాళ్ల మనో నేత్రాలు తెరిపించమని అల్లాహ్ ను వేడుకుందాం. ఇన్ని పనులు చేస్తేనే అల్లాహ్ మనకు ఆ అనంత స్వర్గలోకంలో మనకు సిగ్గులొలికే సుందరాంగులతో గడపవచ్చు. అదే విషయం ఖుర్ఆన్ ఇలా వర్ణించింది. ''ఈ మహాభాగ్యాల మధ్య సిగ్గులొలికే చూపులు గల సుకన్యలు ఉంటారు. ఈ స్వర్గవాసులకు పూర్వం వారిని ఏ మానవుడుగానీ, ఏ జిన్నాతుగానీ తాకి ఉండలేదు.'' అందుకే సిగ్గు, బిడియాలతో జీవితం గడుపుదాం. మన పిల్లలకు సిగ్గు, బిడియాలకు ప్రతీకలుగా తీర్చుదిద్దుదాం. నిస్సిగ్గు, నిర్లజ్జ కు దగ్గర చేసే దారులన్నింటినీ మూసివేద్దాం. యూట్యూబ్, సోషల్ మీడియా పరిమితంగా వాడుకుందాం. సిగ్గు, బిడియాలు ఒక ముస్లిమ్ కు ఆభరణాల వంటివి. సిగ్గూ ఎగ్గూలేని చూపుల నుంచి మన యువతరాన్ని, మన సంతానాన్ని కాపాడుకుందాం. చెడు ఎంత వేగంగా వైరల్ అవుతోందో అంతే వేగంగా మట్టిలో కొట్టుకుపోతుంది. మంచి చాలా నెమ్మదిగా వైరల్ అయినా అది నిలకడగా నిలిచిపోతుంది. వేగంగా వైరల్ అయ్యే చెడుచూపుల మాయలో కొట్టుకుపోకుండా మన చూపుల్ని కాపాడుకుందాం. మరీ ముఖ్యంగా చూపుల చౌర్యం విషయంలో ఓ కన్నేసి ఉంచుదాం. మన చూపుల్ని కాపాడుకుందాం.



విశ్వసించిన మహిళలకు ఇలా చెప్పు, తమ చూపులను కాపాడుకోండి అని, తమ మర్మాంగాలను రక్షించుకోండి.
(దివ్యఖుర్ఆన్ 24:30,31)

ముహమ్మద్ ముజాహిద్ 96406 22076

నేడు సర్పంచ్‌ల సమ్మేళనం



మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో సర్పంచ్‌ల సమ్మేళనాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లాలోని అప్పన్నపల్లిలో మొదటి సమ్మేళనం జరుగుతోంది. జోగులాంబ–గద్వాల, మహబూబ్‌నగర్, మేడ్చల్, నల్గొండ, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి జిల్లాలకు చెందిన సర్పంచ్‌లు హాజరవుతున్నారు. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సిరిసిల్ల రాజన్న, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల సర్పంచ్‌ల సమ్మేళనాన్ని ఈనెల 5న నిజామాబాద్‌లో నిర్వహించన్నునట్లు ప్రభుత్వంవిడుదల చేసిన ప్రకటనలో పేర్కొనింది. ఈ సమ్మేళనాలకు మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరవుతారు. గత నెల 27న భద్రాద్రికొత్తగూడెం, జనగాం, భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, యాదాద్రిభువనగిరి జిల్లాల సర్పంచ్‌ల నిర్వహించాల్సి ఉండగా వాయిదాపడింది. ప్రతి జిల్లా నుంచి 100 మంది సర్పంచ్‌లు హాజరుకానున్నారు. ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన వాటిలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం, పన్నుల వసూలు, ఎల్ఇడి లైట్ల వినియోగం, నీటి సంరక్షణ, ఉపాధిహామీ వంటి కార్యక్రమాల అమలుపై చర్చలు జరగనున్నాయి.

జడ్చర్లలో వంద పడకల ఆసుపత్రి

మన తెలంగాణ / హైదరాబాద్ : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్మించనున్న నూతన ఆసుప్రతి భవన నిర్మాణ నమూనాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ, సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి హైదరాబాద్‌లో తన ఛాంబర్‌లో శుక్రవారం పరిశీలించారు. రూ. 20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వంద పడకల ఆసుప్రతికి త్వరలో శంకుస్థాపన జరుగుతుందని, ఏడాది కాలంలోనే వినియోగంలోకి వస్తుందని పేర్కొన్నారు. జడ్చర్ల సమీపంలోని బాదేపల్లిలో కొన్నేళ్ల నుంచి 30 పడకల ఆసుప్రతి కొనసాగుతుందని, దాదాపుగా జడ్చర్లలో కలిసిపోవడంతో నగర పాలక సంస్థగా మారిందని, పెరిగిన జనాభాకనుగుణంగా కొత్త వైద్యశాలను ఏర్పాటు చేయాలని గత కొంతకాలంగా చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటికి ఫలిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉన్న ఆసుప్రతినే ఆధునికీకరించి అదనపు గదులతో విస్తరించాలని తొలుత ప్రతిపాదించినా స్థలాభావం కారణంగా సాధ్యపడలేదని, ఆ ప్రాంగణంలోనే కొత్త భవనాలతో వంద పడకల ఆసుప్రతిని నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

పరీక్ష ఫలితాలపై స్టే

(మొదటిపేజీ తరువాయి)

పోస్టుల భర్తీకి సర్వీస్ కమిషనర్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ సైనిక మాజీ ఉద్యోగి రఘుపతిరెడ్డి వేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు శుక్రవారం విచారించి మధ్యంతర ఆదేశాలిచ్చింది. మాజీ సైనికులకు రెండు శాతం పోస్టుల్ని రిజర్వు చేయాలని, తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉద్యోగ నోటిఫికేషన్ ఉందని ఆయన లాయర్ వాదించారు. అనంతరం హైకోర్టు.. గత ఏడాది అక్టోబర్‌లో జరిపిన పరీక్షల ఫలితాల్ని తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ రెండు మాసాలపాటు నిలిపివేయాలని సర్వీస్ కమిషన్‌ను ఆదేశించింది. ప్రతివాదులైన సర్వీస్ కమిషన్ సెక్రటరీ, హోం/అటవీ శాఖల కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది.

తెలంగాణకు ప్రత్యేక సెల్

(మొదటిపేజీ తరువాయి)

చేసిన ప్రకటనలో పేర్కొనింది. పసుపు పంట, మార్కెటింగ్, పరిశోధన వంటి అంశాల ద్వారా పంటలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్రాల వ్యవసాయ శాఖలపై ఉంటుందని, పసుపుతో పాటు ఇతర స్పైసెస్ ఎగుమతులు, నాణ్యత ప్రమాణాల పర్యవేక్షణ వంటి కార్యక్రమాలను కేంద్రం పర్యవేక్షిస్తుందని ఆ లేఖలో కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ కోరిక మేరకు ప్రత్యేక సెల్‌ను స్పైసెస్ బోర్డులో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపితే 'టిఐఇఎస్' (ట్రేడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్ స్కీమ్) పథకం కింద పసుపు కొరకు ప్రత్యేకంగా ఒక స్పైసెస్ పార్కునెలకొల్పుతామని సురేష్ ప్రభు హామీ ఇచ్చారు.

అతి వేగానికి ఐదుగురు బలి

(మొదటిపేజీ తరువాయి)

కారు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. కారు అతివేగం ధాటికి బస్సు రోడ్డుపక్కనే ఉన్న లోయలోకి జారిపోతుండటంతో బస్సు డ్రైవర్ అప్రమత్తత వల్ల పెను ప్రమాదం తప్పింది. ఎర్టిగా కారు నుజ్జునుజ్జై అందులో ఉన్నఐదుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా వారి అవయవాలు ఘటన స్థలంలో చెల్లచెదురుగా పడ్డాయి. మరో ఇద్దరిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. బస్సు ప్రయాణికుల్లో ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డికి చెందిన కేతకీ డిజిటల్ ఫ్లెక్సీ షాప్ యజమాని మహేష్(25)తో పాటు అందులో పనిచేస్తున్న వెంకట్‌రెడ్డి(21), నాగరాజు (22), మహేష్ స్నేహితులు, వీరితోపాటు నరేందరాచారి(30), వెంకట్‌రామిరెడ్డి(30)లు కలిసి శుక్రవారం ఉదయం పటాన్‌చెరు మండలంలోని రుద్రారంలో జరిగిన హోళీ సంబరాల్లో పాల్గొనేందుకు ఎర్టిగా కారులో వెళ్లారు. మధ్యాహ్నం వరకు వారు అక్కడే హోళీ సంబురాలు జరుపుకున్నారు. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో వారంతా కలిసి కారులో సంగారెడ్డికి తిరిగివస్తున్న క్రమంలో కంది మండలం ఐఐటీ వద్ద కారు అతివేగంగా వస్తు ఆదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఎదురుగా వస్తున్న జహీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొంది. కారు వేగానికి కారు నుజ్జునుజ్జై ప్రక్కనే ఉన్న ఓ లోయలో పడిపోయింది. కారులో ప్రయాణిస్తున్న మహేష్, నరేందర్‌చారీ, నాగరాజులు అక్కడిక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన వెంకట్‌రెడ్డి, వెంకట్‌రామిరెడ్డిలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. ప్రమాద వేగానికి ఆర్టీసీ బస్సు పక్కనున్న లోయలోకి పడిపోయే క్రమంలో డ్రైవర్ అప్రమత్తత వల్ల బస్సులోని ప్రయాణీకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌కుమార్‌లు సందర్శించి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ ప్రమాద విషయాన్ని తెలుసుకొని ఆసుపత్రికి చేరుకొని బంధువులను ఓదార్చారు. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఐదుగురు యువకులు మృతిచెందడంలో వారి బంధువుల రోదనలతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి శోకసంద్రంలా మారిపోయింది.


కృష్ణ నీటి వాటాలు

(మొదటిపేజీ తరువాయి)

సాగర్ ప్రాజెక్టుల్లో మొత్తం 33.77 టిఎంసిల నీటి లభ్యత ఉన్నదని, ఈ నెల 20వ తేదీ వరకు కనీస నీటి మట్టం చేరుకునే వరకు రెండు రాష్ట్రాలు కేటాయింపులకు లోబడి నీటిని వినియోగించుకోవాలని స్పష్టం చేసింది. రెండు రాష్ట్రాల ఇంజనీర్ ఇన్ ఛీఫ్‌లతో బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం జలసౌధలో శుక్రవారం సాయంత్రం సమావేశం ఏర్పాటుచేసి నీటి లభ్యత, గతంలో చేసిన కేటాయింపులకు మించి ఆంధ్రప్రదేశ్ వినియోగించుకోవడం, పంటల అవసరాల రీత్యా మరింత ఎక్కువ నీటిని కోరుతుండడం, వేసవి సమీపిస్తుండడంతో రెండు ప్రాజెక్టుల్లో కనీస నీటి మట్టంను కొనసాగిస్తూ లభ్యంగా ఉన్న నీటిని వినియోగించుకోవడం తదితర పలు అంశాలపై సుమారు మూడు గంటల పాటు చర్చించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 520 అడుగులు, శ్రీశైలంలో 834 అడుగుల చొప్పున కనీస నీటి మట్టం ఉండాలని, ఆ లెక్కల ప్రకారం చూస్తే ప్రస్తుతం ఉన్న 33.77 టిఎంసిల నీటిని రెండు రాష్ట్రాలూ కేటాయింపులకు లోబడి వినియోగించుకోవాలన్న నిర్ణయం జరిగింది. జనవరి నెలలో జరిగిన సమావేశంలో చేసిన కేటాయింపులు, ఆ ప్రకారం రెండు రాష్ట్రాలు వినియోగించుకున్న నీరు తదితర లెక్కలను ఆధారంగా తీసుకుని తాజా కేటాయింపులు జరిగాయి. ఈ నెల 20 తర్వాత మరోమారు సమావేశమై ఈ రెండు రిజర్వాయర్లలోని నీటి మట్టం, నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని తదనుగుణమైన నిర్ణయం తీసుకోవాలని ఈ సమావేశం స్పష్టతకు వచ్చింది. తాజాగా నీటి విడుదలపై నాగార్జునసాగర్ డ్యాం దగ్గర రెండు రాష్ట్రాల పోలీసుల మధ్య జరిగిన వాదనలు, అధికారుల మధ్య తలెత్తిన భేదాభిప్రాయాలపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను తాకట్టుపెట్టి ఆంధ్రప్రదేశ్ విజ్ఞప్తి మేరకు నీటిని విడుదల చేసే ప్రసక్తే లేదని ఈ సమావేశంలో తెలంగాణ ఇంజనీర్ ఇన్ ఛీఫ్ స్పష్టం చేసినట్లు తెలిసింది. శ్రీశైలం నుంచి విడుదలైన నీరు నాగార్జున్ సాగర్‌కు పూర్తిస్థాయిలో చేరకపోవడం, సుమారు 40 టిఎంసిల మేర వ్యత్యాసం వస్తున్న అంశంపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. సాధారణగా లీకేజీ, ఆవిరికావడం లాంటివాటికి కేవలం 8 టిఎంసిలు మాత్రమే ఖర్చవుతుందని, కానీ ఏకంగా 40 టిఎంసిల మేర వ్యత్యాసం జరగడంపై తెలంగాణ ఈ సమావేశంలో ప్రస్తావించినట్లు తెలిసింది. టెలిమెట్రీ విధానంపై చర్చ జరుగుతున్న సమయంలో ఎన్ని పాయింట్లలో ఈ పరికరాలను పెట్టాలి, ఎప్పటికల్లా అమర్చాలి, లెక్కలను ఏ విధంగా తేల్చాలి తదితరాలను కూడా చర్చించినట్లు సమాచారం. గతేడాది తెలంగాణ త్రాగునీటి అవసరాలకు సైతం కృష్ణా జలాలు అందకపోవడాన్ని కూడా ప్రస్తావించింది.

31లోపు పంటల బీమా టెండర్ !

● ఐఎండి నివేదిక ఇవ్వకముందే పూర్తి చేయాలి ● రాష్ట్రానికి కేంద్రం నుంచి ఆదేశాలు



మన తెలంగాణ/హైదరాబాద్ : భారత వాతావరణ కేంద్రం (ఐఎండి) రుతుపవనాల రాకపై ముందస్తు నివేదికను విడుదల చేయకముందే వానాకాలం పంటల బీమా టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్రం రాష్ట్రాన్ని ఆదేశించింది. పంటల బీమా టెండర్ ప్రక్రియ, నోటిఫికేషన్ జారీలో ఆలస్యం జరుగుతున్నందువల్ల 'నాన్ లోనీ' (పంట రుణం తీసుకోని) రైతులు బీమా పరిధిలోకి రావడం లేదని గుర్తుచేసింది. భారత వాతావరణ సంస్థ ప్రతి ఏటా ఏప్రిల్ మొదటి వారంలో రుతుపవన సమాచారాన్ని అంచనా వేసి ప్రకటిస్తుందని, ఆలోపే (అంటే మార్చి 31వ తేదీ వరకు) 'ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత పంటల బీమా వానాకాలం–2018' అమలునకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్రాలకు కేంద్రం తాజాగా జారీ చేసిన లేఖలో పేర్కొనింది. గడిచిన రెండు సంవత్సరాల అనుభవాలను పరివీలిస్తే, ముందస్తు రుతుపవన సమాచారం వచ్చిన తరువాత బీమా కంపెనీలు అధిక ప్రీమియం రేట్లను టెండర్లలో కోట్ చేశాయని, ఈసారి అలా జరగకుండా చూడాలని కోరింది. ముందస్తుగా బిడ్డింగ్, టెండర్ చేపట్టడం ద్వారా ప్రీమియం రేటు ఎక్కువగా లేకుండా చూసుకోవడంతో పాటు రైతుల్లో అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టవచ్చునని తెలిపింది. ఇలా ఒక్కొక్క సీజన్‌కు వేర్వేరు టెండర్లు కాకుండా, ఏడాది అంత కంటే ఎక్కువ కాలం కంపెనీలు పంటల బీమా చేసే విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. కేంద్రం ప్రభుత్వం 2016లో పిఎంఎఫ్‌బివై పథకాన్ని ప్రవేశపెట్టగా మొదటి సంవత్సరం అనుకున్న విధంగా మొత్తం సాగైన పంటలలో 30 శాతం బీమా పరిధిలోకి వచ్చింది. 2017–18లో మాత్రం అంతటి సంతృప్తికరంగా ఈ పథకం అమలు కాలేదని పేర్కొంది. మన రాష్ట్రంలో 2017 వానాకాలంలో 8.60 లక్షల మంది రైతులు, యాసంగిలో 1.60 లక్షల మంది రైతులు పంటల బీమాలో నమోదైనట్లు అధికారుల ద్వారా తెలిసింది. పూర్తి వివరాలు అందింతే ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

లెక్కలు సరిగ్గా ఉండాలి...

పంటల బీమాలో నమోదైన విస్తీర్ణం, ప్రీమియం చెల్లించిన మొత్తం సరిగ్గా ఉండాలని, తప్పులు దొర్లినట్లయితే ఇప్పుడే సరి చేసుకోవాలని కేంద్రం ప్రభుత్వం బీమా కంపెనీలు, బ్యాంకులతో పాటు రాష్ట్రాన్ని అప్రమత్తం చేసింది. నమోదు చేసిన వివరాల్లో ఏమైనా తేడాలు ఉంటే సరిచేయాలని లేదంటే పంట నష్టం వాటిల్లిన సమయంలో పరిహారం అందదని స్పష్టం చేసింది. వానాకాలం, యాసంగి సీజన్‌లలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా కింద ప్రీమియం కట్టిన విస్తీర్ణం, రైతుల వివరాలను పంటల బీమా వెబ్ పోర్టల్‌లో ఖచ్చితంగా నమోదు చేయాలని చెప్పింది. ఒకవేళ రైతుల దగ్గర నుంచి ఎక్కువ ప్రీమియం వసూలు చేసినట్లయితే తిరిగి రైతుల ఖాతాలకు మళ్లించాలని ఆదేశించింది.

జర్మనీకి విత్తనాల ఎగుమతి



మన తెలంగాణ/హైదరాబాద్ : యూరోపియన్ దేశాలకు రాష్ట్రం నుంచి విత్తనాలు ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారధి తెలిపారు. గత ఏడాది ఈజిప్టు, సుడాన్,పిలిఫ్ఫైన్స్ ఒఇసిడి భాగస్వామ్య దేశాలకు 1700 టన్నులు విత్తనాలను ఎగుమతి చేశామన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ కార్యాలయంలో శుక్రవారం జర్మనీ నుంచి వచ్చిన విత్తన శాస్త్రవేత్త ప్రొఫెసర్ మైకెల్ క్రూస్‌తో పార్థసారధి, ఇతర అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి కావాల్సిన 60 శాతం విత్తనాలు తెలంగాణ నుంచే వెళ్తున్నాయని చెప్పారు. విత్తన ధ్రువీకరణ సంస్థ సంచాలకులు డాక్టర్ కె.కేశవులు రాష్ట్రంలో విత్తన పరిస్థితుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

హజ్ ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

మన తెలంగాణ / హైదరాబాద్ : హజ్ యాత్ర–2015 సందర్భంగా మక్కా క్రేన్ ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన మొహమ్మద్ ముజీబ్‌కు రాష్ట్ర హజ్ కమిటి చైర్మన్ మొహమ్మద్ మసిఉల్లా ఖాన్ రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని చేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ అందజేశారు. 2015లో తన తల్లితో కలిసి హజ్ యాత్రకు వెళ్లిన మొహమ్మద్ ముజీబ్ క్రేన్ ప్రమాధ ఘటనలో త్రీవంగా గాయపడగా అతడికి సౌది అరేబియా వైద్యులు సర్జరీలు నిర్వహించి ప్లీహాన్ని పూర్తిగా తొలగించారు. తోపుడుబండిపై ప్లాస్టిక్ వస్తువులు అమ్మి జీవనం సాగించే ముజీబ్‌కు తల్లి, భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. దయనీయ పరిస్థితుల్లో జీవితం నెట్టుకొస్తున్న అతడికి హజ్ కమిటి చైర్మన్ మసిఉల్లా ఖాన్ తన మొదటి నెల జీతం నుండి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

బిసి నివేదికను అమలు చేయాలి

బిసి సంఘాల డిమాండ్

మన తెలంగాణ / హైదరాబాద్ : బిసి మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యుల సమావేశంలో రూపొందించిన బిసి నివేదికను వెంటనే అమలు చేయాలని బిసి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. తెలంగాణ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు–బిసిల వాటా' అనే అంశంపై బిసి సంఘాలు, కుల సంఘాల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బిసిలకు సంబంధించిన సమస్యలపై సుదీర్ఘ చర్చ జరిగింది. అనంతరం ఈ సమావేశం పలు తీర్మానాలను ఆమోదించింది. రాష్ట్రంలో ఇతర కుల సంఘాలకు ఇచ్చినట్లుగానే బిసి జాబితాలో ఉన్న అన్ని కులాలకూ 10 ఎకరాల భూమి, రూ.10 కోట్లు చొప్పున కేటాయించాలని, మహాత్మా జ్యోతిబా పూలే పేరుతో హైదరాబాద్‌లో 50 ఎకరాల్లో బీసీ భవన్ ఏర్పాటు, సచివాలయం పక్కన జోతిబా పూలే కాంస్య విగ్రహ ఏర్పాటు చేయాలని సభ ఒక తీర్మానంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వం భర్తీ చేయనున్న అన్ని నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలని, మూడు రాజ్యసభ స్థానాల్లో ఒక స్థానాన్ని ఎంబిసి, సంచార జాతులకు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు, కేటాయించాలని, రూ. 10 వేల కోట్లతో బిసి సబ్ ప్లాన్ తెచ్చి చట్టబద్దత కల్పించాలని, బిసి కులాల ఫెడరేషన్లకు పాలకమండళ్లను నియమించాలని, ప్రతి ఫెడరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయించి బ్యాంకులతో నిమిత్తం లేకుండా 100 శాతం సబ్సిడీ రుణాలు ఇవ్వాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎంబిసి కార్పొరేషన్‌కు కేటాయించిన వెయ్యి కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని, బిసి రిజర్వేషన్లను 29% నుంచి 50%కి పెంచాలని, స్థానిక సంస్థల్లో అమలు అవుతున్న బిసి రిజర్వేషన్లను విద్య, ఉద్యోగాల మాదిరిగానే రాజకీయ రంగంలో వర్గీకరించాలని, చట్టసభల్లో బిసి రిజర్వేషన్ల కోసం ముఖ్యమంత్రి నేతృత్వంలో అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని, అన్ని రాజకీయ పార్టీలు బీసీల రాజకీయ పాలసీలను ప్రకటించాలని సమావేశం తీర్మానించింది. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగం బద్దత కల్పించే బిల్లును ఆమోదించాలని, కేంద్ర బడ్జెట్‌లో బిసిల కేటాయింపులను 50 వేల కోట్లకు పెంచాలని, జాతీయ స్థాయిలో ఓబీసీలను వర్గీకరించి రిజర్వేషన్లు పెంచాలని, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ప్రైవేటు రంగంలోనూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటిలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సభలు ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించింది.

కేంద్రంపై దూకుడు

(మొదటిపేజీ తరువాయి)

కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన టిఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ శనివారం సమావేశం కానుంది. ప్రగతిభవన్‌లో సాయంత్రం 4 గంటలకు జరగనున్నఈ భేటీలో పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహాలు, కేంద్రం పట్ల వ్యవహరించాల్సిన తీరుపై టిఆర్‌ఎస్ ఎంపిలకు కెసిఆర్ దిశా నిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా ఇప్పటికే టిఆర్‌ఎస్ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు సమాచారాన్ని అందించారు. తొలి విడత బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ పట్ల ఆంధ్రప్రదేశ్ ఎంపిలు తీవ్ర స్థాయి అసంతృప్తి వ్యక్తం చేశారు. విభజన హామీల అమలు, ప్రత్యేక హోదాపై వెల్‌లోకి వెళ్ళి నిరసన కూడా తెలియజేశారు. ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూనే టిడిపి ఎంపిలు సైతం ఉభయ సభలో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్న సుజనా చౌదరి సైతం సభలో అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రసంగించారు. అదే సమయంలో బడ్జెట్‌లో సరైన నిధులు రాకపోవడం, విభజన హామీలు, ఎయిమ్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండి చేయి చూపిన టిఆర్‌ఎస్ ఎంపిలు వేచి చూసే ధోరణిని అవలంభించారు. ఆంధ్రా ఎంపిల మాదిరిగా సభలో కేంద్రంతో ఘర్షణ వైఖరిని ప్రదర్శించకుండా సమయం వచ్చినప్పుడు అసంతృప్తిని వ్యక్తం చేశారు. మరోవైపు జిఎస్‌టి కారణంగా కలిగిన నష్టాన్ని హామీ మేరకు భర్తీ చేయకపోవడంపై అసంతృప్తి, కేంద్రం ప్రకటించిన ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన కుటుంబ బీమా పథకంపై అనుమానాలను వ్యక్తం చేశారు.

ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వంతో సహృద్భావ వాతావరణాన్ని కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్ ఇటీవల ఢిల్లీకి వెళ్ళి వచ్చిన తరువాత తన వైఖరిని మార్చారు. రైతు సదస్సుల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీపై ఈమధ్య కాలంలో తొలిసారిగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు అటు కాంగ్రెస్, ఇటు బిజెపి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని, ఇకపై దేశవ్యాప్తంగా రైతుల కోసం తానే పోరాడుతానని, అవసరమైతే నాయకత్వం కూడా వహిస్తానని ప్రకటించారు. అంతే కాకుండా తన మాటలకు కట్టుబడి ఉంటానని వరుసగా రెండు రోజులు కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. నోట్ల రద్దు, జిఎస్‌టి బిల్లు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి, బిజెపికి మద్దతునిస్తూ రాష్ట్ర ప్రయోజనాల కోసం సహకార ధోరణిని అవలంభించినప్పటికీ ఆశించిన ప్రయోజనం నెరవేరకపోవడమే వల్లనే సిఎం తన వైఖరిని మార్చుకున్నారని టిఆర్‌ఎస్ నాయకులు చెబుతున్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళవుతున్నప్పటికీ రాష్ట్రానికి సంబంధించి కేంద్రం చేతిలో ఉన్న ఎస్‌సి వర్గీకరణ బిల్లు, మైనారిటీ, ఎస్‌టి రిజర్వేషన్‌ల పెంపు బిల్లులపై సానుకూలత రాకపోవడం కూడా టిఆర్‌ఎస్ అసంతృప్తికి కారణమైంది. అంతే కాకుండా నియోజకవర్గాల పెంపు విషయంలో కూడా ఊరించి ఊరించి ఎటూ కాకుండా చేయడం కూడా మార్పునకు దారి తీసినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. తమ ప్రభుత్వానికి కూడా ఇదే చివరి సంవత్సరమని, ఓపికకు కూడా హద్దు ఉంటుందని టిఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. బిజెపి మిత్రపక్షాల కంటే కూడా కేంద్ర ప్రభుత్వంపై తాము ఎంతో సంయమనంగా వ్యవహరించామని, అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని టిఆర్‌ఎస్ నాయకులు అంటున్నారు. దీని వల్ల తాము విపక్షాల నుండి విమర్శలు కూడా ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము కూడా ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సిన సమయం వచ్చినందున కేంద్రం విషయంలో ఇక ఉపేక్షించే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇంతటి కీలక తరుణంలో జరిగే టిఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రంపై దూకుడుగా ఎలా వెళ్ళాలనే అంశంపై సిఎం కెసిఆర్ ఎంపిలకు స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.

నాలుగేళ్ళలో ఏమీ చేయలేదు : ఎంపి కవిత

మొదటిసారిగా కేంద్రంలో కాంగ్రెసేతర పార్టీకి అప్రతిహతమైన మెజారిటీని ప్రజలు కట్టుబెట్టడంతో రైతులు, ప్రజల జీవితాల్లో మంచి మార్పు తీసుకువస్తారని భావించినా కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా పని చేయలేదని నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ నాలుగేళ్ళలో కేంద్ర ప్రభుత్వం వ్యాపారాన్ని సులభతరం చేసేందుకు పార్లమెంటులో 31 చట్టాలను తీసుకువస్తే, వ్యవసాయం కోసం కేవలం మూడు చట్టాలు తీసుకువచ్చిందని, అవి కూడా ప్రత్యక్షంగా వ్యవసాయానికి సంబంధం లేనివన్నారు.ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్న తమ డిమాండ్‌పై మౌనంగా ఉంటుందోన్నారు. పంట బీమా పథకాన్ని రైతు యూనిట్‌గా చేయాలన్నా స్పందన లేదని, అలాగే ప్రస్తుత బడ్జెట్లో వ్యవసాయానికి బాగా నిధులు ఇచ్చామని చెప్పుకుంటునప్పటికీ మొత్తం బడ్జెట్ చదివినా గత ఏడాది కంటే ఎక్కువ నిధుల ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. తెలంగాణకు, చాలా రాష్ట్రాలకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా కేటాయింపులేమి లేవని, వీటన్నిటితో పాటు విభజన హామీలపై బడ్జెట్ పద్దుల సమయంలో మాట్లాడుతామని ఎంపి కవిత వివరించారు.

భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు అటవీ ప్రాంతానికి చేరుకున్న కూంబింగ్ బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ముందస్తుగా మావోయిస్టులే కాల్పులకు దిగినట్లు, ఆత్మ రక్షణ కోసం పోలీసులు సైతం సుమారు గంటకుపైగా ఎదురుకాల్పులు జరిపారని పోలీసులు వర్గాలు వెల్లడిస్తున్నాయి. పోలీసులు తెలిపిన మరిన్ని వివరాల ప్రకారం ఎదురుకాల్పులను తట్టుకోలేని మావోయిస్టులు వెనక్కు తగ్గి అటవీప్రాంతంలోనికి జారుకోవడంతో మరి కొంత సేపు కూంబింగ్ నిర్వహించగా పది మంది మావోయిస్టుల మృతదేహాలను లభ్యమయ్యాయి. ఈ కాల్పుల్లో జవాన్ సైతం ప్రాణాలు కోల్పోయాడు. కాగా ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఉండగా జవాన్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామానికి తరలించారు. కాగా మరో ఎనిమిదిమంది మావోయిస్టుల మృతదేహాల తరలింపుపై పోలీసులు స్పష్టత ఇవ్వలేదు. మిగతా మృతదేహాలు ఇక్కడికి చేరుకుంటే తప్ప మృతుల్లో అగ్రనేతలు ఉన్నారా లేదా అనేది తెలుతుంది. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో జిల్లా ఎస్‌పి అంబర్ కిషోర్ ఝా, భూపాలపల్లి ఎస్పి భాస్కరన్, ఏటూనాగారం ఏఎస్పి రాహుల్ భద్రాచలంలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన కానిస్టేబుల్ సుశీల్

ఏజెన్సీలో భయం

ఎన్‌కౌంటర్ తో సరిహద్దు గిరిజన గ్రామాలు భయంతో వణికిపోతున్నాయి. పోలీసులు మావోయిస్టులను మట్టుబెట్టడంతో ప్రతీకారంతో రగిలిపోతున్న మావోయిస్టులు ఏ సమయంలో ఎలాంటి ఘాతుకాలకు పాల్పడతారో అర్థం కాని పరిస్థితి అటవీ గ్రామాల్లో నెలకొంది. దీంతో దండకారణ్యంతో ఏజెన్సీలో రెడ్ అలెర్ట్ ప్రకటించారు. జిల్లాలోకి మావోయిస్టులు చొరబడవచ్చనే అనుమానంతో బందోబస్తును పటిష్టం చేశారు. దీంతోపాటు అటవీ గ్రామాల్లో ఉన్న పోలీస్ స్టేషన్లను సైతం అలెర్ట్ చేశారు. ఈ ఎన్‌కౌంటర్ పై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరుతు పౌరహక్కుల సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. మృతదేహాల తరలింపు విషయంలో డ్రామా చోటు చేసుకుంటోంది. పోలీసులు ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో అంతా అయోమయానికి గురవుతున్నారు. వాస్తవాలను ప్రక్క దారి పట్టించేందుకే పోలీసులు మృతదేహాల తరలింపుపై జాప్యం చేస్తున్నారనే పుకార్లు వినవస్తున్నాయి. మృతదేహాలను అటవీ ప్రాంతంలో నుండి తరలించే అవకాశం లేకపోవడం వల్లే ఆలస్యం జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆపరేషన్స్ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలుపుతుండటంతో అది ఎప్పుడు పూర్తవుతుందో, మృతదేహా లు ఎప్పటికి వస్తాయో కూడా అంతుపట్టని ప్రశ్న గా మారిందని పలువురు అంటున్నారు. రేపటికి ఎన్‌కౌంటర్ జరిగి 24 గంటలు దాటనుండటంతో శరీరాలు పాడయ్యే పరిస్థితి ఉంటుందని పలువురు అంటున్నారు. హరిభూషణ్ కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియా ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్ స్థలం నుండి మావోయిస్టు అగ్రనేత హరిభూషణ్ తృటిలో తప్పించుకున్నట్లు పెద్ద ఎత్తున వదంతులు వినవస్తున్నాయి.







హరిభూషణ్ మృతిపై అనుమానాలు!



మన తెలంగాణ/హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల ప్రాతంలో శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన 10 మంది మృతుల్లో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్‌తో పాటు మరో కీలక నేత బండి ప్రకాశ్ కూడా మరణించారనే వార్తలు వచ్చాయి. ఈ ఇద్దరు నేతల సెక్యూరిటీ గార్డులు మృతి చెందారని పోలీసుల నిర్ధారించడంతో వారు కూడా చనిపోయి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. చనిపోయినవారిలో హరిభూషణ్ సహచరి సమ్మక్క ఉన్నట్లు పోలీసులుపేర్కొన్నారు.

సరిగ్గా రెండేళ్ల క్రితం...

సరిగ్గా రెండేళ్ల కిందట (మార్చి 2, 2016) భద్రాద్రి జిల్లా ఛత్తీస్‌గడ్ సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సౌత్ సెంట్రల్ జోన్ కార్యదర్శి లచ్చన్న సహా ఏడుగురు దళ సభ్యులు చనిపోయారు. ఆ ఎన్‌కౌంటర్‌లో హరిభూషణ్ కూడా మృతి చెందారని అప్పట్లో ఛత్తీస్‌గడ్ పోలీసులు ప్రకటించాయి. కానీ తెలంగాణ పోలీసులు మాత్రం ఆ ప్రకటనను కొట్టిపారేశారు. ఆ తర్వాత హరి భూషణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, కీలకనేత కావడంతో ఆయనను రహస్య ప్రాంతంలో ఉంచి విచారిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఏళ్ల తరబడి ప్రయత్నించిన పోలీసులు ఎట్టకేలకు చర్ల ఎన్‌కౌంటర్‌లో హరిభూషణ్‌ను మట్టుబెట్టామని రాష్ట్రానికి చెందిన ఓ పోలీసు అధికారి అభిప్రాయపడ్డారు. అయితే ఈ విషయం పూర్తిగా నిర్ధారించేందుకు మరికొంత సమయం పడుతుందని అన్నారు.

రూ.30 లక్షల క్యాష్ రివార్డు

రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు పార్టీ కార్యదర్శిగా హరిభూషణ్ నియమితులయ్యారు. అప్పటి నుంచి ఆయన ఉత్తర తెలంగాణలో కెకెడబ్ల్యూ (ఖమ్మం, కరీంనగర్, వరంగల్) డివిజన్‌లో కార్యకలాపాలను విస్తరింపజేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు నిఘావర్గాలకు స్పష్టమైన సమాచారం ఉంది. హిట్‌లిస్టులో ఉన్న హరిభూషణ్ కోసం పోలీసులు పలుమార్లు ప్రత్యేక ఆపరేషన్లు కూడా నిర్వహించారు. హరిభూషణ్‌పై దాదాపు 50 కేసులున్నాయని, ప్రభుత్వం రూ.30 లక్షల క్యాష్ రివార్డు కూడా ప్రకటించిందని గుర్తుచేశారు.



త్వరితగతిన అన్ని ప్యాకేజీల పనులు : మంత్రి హరీశ్‌రావు

మన తెలంగాణ/సిద్దిపేట టౌన్ : సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా 9.10.11.12 ప్యాకేజీల పనులు భూ సేకరణ ఆయకట్టు సిద్దిపేట అలాగే సిరిసిల్ల జిల్లాలలో జరుగుతున్నాయని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో వ్యవహరించి ఈ ప్రాజెక్ట్‌లోని అన్ని ప్యాకేజీల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రెండు జిల్లాలో అనుసంధానమైన అనంతగిరి రిజర్వాయర్, కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని ప్యాకేజీల పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ 9 ప్రాజెక్ట్ పనులు తొందరగా పూర్తి చేసి టన్నెల్ లైనింగ్, పంప్‌హౌజ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈఈ బుచ్చిరెడ్డిని ఆదేశించారు. అంతగిరి రిజర్వాయర్ మూడు పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రంగనాయక సాగర్ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై మంత్రి మాట్లాడుతూ పనులను వేగవంతం చేసినందుకు ప్రాజెక్ట్ అధికారులకు ప్రజాప్రతినిధులను అభినందించారు. రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో 2170 ఎకరాల భూ సేకరణలో కేవలం 6 ఎకరాల సేకరణ మాత్రమే మిగిలిందని తెలిపారు. మిగిలిన సేకరణను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. కలెక్టర్లు వెంకట్రామిరెడ్డి, కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

ఫలక్‌నుమాలో రౌడీషీటర్ హత్య



మన తెలంగాణ/ హైదరాబాద్/ చాంద్రాయణగుట్ట : అక్రమ సంబంధం ఒక రౌడీషీటర్ హత్యకు దారి తీసింది. ఫలక్‌నుమా పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగిన సంఘటన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం.. ఫలక్‌నుమా అచ్చిరెడ్డినగర్‌కు చెందిన సయ్యద్ ఈసా (30) ఫలక్‌నుమా పోలీసుస్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా నమోదై ఉన్నాడు. జహ నుమా, మదీనా కాలనీకి చెందిన వాహెద్ ఖాన్ గత ఏడాదిన్నర క్రిందట దుబాయ్‌కి వెళ్ళాడు. అప్పదప్పుడు హైదరాబాద్‌కు వచ్చి వెళుతుం టాడు. అయితే ఇతని భార్య సహా బేగంతో రౌడీషీటర్ ఈసాకు పరిచయం ఏర్పడి అది అక్రమ సంబంధానికి దారి తీసింది. ఈవిషయాన్ని ఈసా దుబాయ్‌లో ఉంటున్న సహా బేగం భర్త సెల్‌ఫోన్‌కు మెసేజ్ పెడుతున్నాడు. తరచూ మెసేజ్‌లు వస్తుండటంతో అతడు మదీనా కాలనీలో ఉండే తన సోదరులు జావేద్ ఖాన్ (30), నవీద్ ఖాన్ (25)లకు ఆ సమాచారాన్ని పంపించాడు. దీంతో వారు విషయం వాస్తవమా, కాదా అని నిఘా పెట్టారు. వదిన, రౌడీ షీటర్ మధ్య అక్రమ సంబంధం నిజమని తేలటంతో గురువారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో వట్టేపల్లి బీబీకా చష్మా, మామూకీ పాన్‌షాప్ వద్ద ఈసా ఉన్నాడని తెలుసుకొని ఇరువురు సోదరులు అక్కడికి వెళ్ళారు. వీరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అందుకు ఈసా ససేమిరా అనటంతో పాటు ఏం చేసుకుంటారో చేసుకో మ్మని ఖరాఖండిగా చెప్పేశాడు. అందుకు ఆగ్రహించిన నవీద్ ఖాన్ తన వద్ద ఉన్న జంబియాతో రౌడీషీటర్ ఈసా ఛాతిలో బలంగా పొడిచాడు. దీంతో అతడు అక్కడి కక్కడే ప్రాణాలు వదిలాడు. విషయం తెలుసుకున్న ఫలక్‌నుమా ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ యాదగిరి అక్కడికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

డివైడర్‌ను ఢీకొన్న బైక్ : ఒకరు మృతి


మన తెలంగాణ/భానుపురి : జిల్లాలో హోలీ వేడుకల్లో పలు చోట్ల విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ హోలీ వేడుకల్లో పాల్గొని వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా...పలువురికి గాయాలైన సంఘటన సూర్యాపేట జిల్లాలో చోటు చేసుకుంది. సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బీషా శ్యామ్ సూర్యాపేట నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళ్తుండగా చివ్వెంల మండలం గుంజలూరు వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢి కొన్నాడు. తలకు బలమైన గాయాలు కావడంతో సూర్యాపేట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే విధంగా పట్టణంలో హోలీ వేడుకల్లో పాల్గొని కొందరు బైక్‌లపై నుంచి పడి గాయాలై పాలై చికిత్స పొందుతున్నారు.

నగల షాపులో పేలిన గ్యాస్ సిలిండర్లు



మన తెలంగాణ/మిర్యాలగూడ : బంగారు ఆభరణాల తయారీ షాపులో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలడంతో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పట్టణంలోని మెయిన్‌బజార్‌లోని సంధ్య జ్యూయలరీ షాపులో శుక్రవారం జరిగిన ఈ సంఘటన కాలనీ వాసులను భయభ్రాంతులకు గురి చేసింది. దాసానియా నారాయణసింగ్ అనే జ్యూయలరీ వ్యాపారి దుకాణంలో గ్యాస్ సిలిండర్ స్టవ్‌ను వెలిగించే క్రమంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో షాపులో పని చేస్తున్న వర్కర్లు ప్రాణభయంతో బంగారు ఆభరణాలు, ఆర్డర్ల కోసం ఇచ్చిన బంగారం, వెండి షాపులో వదిలేసి బయటకు పరుగులు తీశారు. కొద్ది సమయం వ్యవధిలోపే షాపులో నిల్వ ఉన్న నాలుగు గ్యాస్ సిలిండర్లు పేలడంతో భారీ శబ్దాలు వెలువడి ఐదు నిమిషాల వ్యవధిలోనే మంటలు ఎగిసి పడ్డాయి. చెక్క దూలాలతో నిర్మించిన ఇల్లు కావడంతో మంటలు ఫర్నీచర్‌కు అంటుకొని భారీగా వ్యాపించాయి. దీంతో దుకాణంతో పాటు, వ్యాపారి నివాసముంటున్న ఇల్లు సైతం పూర్తిగా మంటల్లో చిక్కి దగ్ధమైంది. అగ్నిమాపక వాహనం ఇక్కడకు చేరుకునేందుకు సుమారు రెండు గంటల సమయం పట్టింది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఆభరణాల తయారీ కోసం సుమారు 50 తులాల బంగారాన్ని ఆర్డర్ నిమిత్తం ఇవ్వగా షాపులో భద్రపర్చినట్లు నిర్వాహకుడు నారాయణసింగ్ తెలిపారు. ఈ ఘటనతో సుమారు రూ.20 లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనాస్థలాన్ని తహసీల్దార్ మాలి కృష్ణారెడ్డి పరిశీలించి పంచనామా నిర్వహించి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. కాగా, అగ్నిప్రమాదంతో పూర్తిగా నష్టపోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి కోరారు.

హూంసాలో పిడిగుద్దులాట



మన తెలంగాణ/బోధన్ (నిజామాబాద్ జిల్లా) : మండలంలోని హూంసా గ్రామంలో శుక్రవారం పిడిగుద్దులాట భారీ బందోబస్తు మధ్య నిర్వహించారు. ఏళ్ళ తరబడి వస్తున్న ఆచారాన్ని పాటిస్తూ గ్రామం సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో నాటి ఆచారాన్ని గ్రామస్థులు కొనసాగించారు. వేల సంఖ్యలో తరలివచ్చిన జనాలు పిడిగుద్దులాటలో పాల్గొన్నారు. గ్రామం నడిబొడ్డున ఏర్పాటు చేసిన రెండు స్తంభాలకు పొడవాటి తాడును కట్టి వివిధ కుల సంఘాలు చిన్నా పెద్ద తేడా లేకుండా రెండు వర్గాలుగా విడిపోయి పిడికిలి బిగించుకొని ఒకరినొకరు కొట్టుకున్నారు. ఈ గుద్దులాటలో రక్తాలు కారినా లెక్కచేయకుండా కొట్టుకోవడంతో కొద్ది నిమిషాలపాటు ఉత్కంఠత నెలకొంది. ఒళ్లు గగుర్పొడిచే విధంగా గాయాలైనా ఒకరినొకరు గుద్దుకొని అనంతరం స్నేహపూర్వకంగా కలిసిపోయారు. గాయాలపాలైన వారికి మహిళలు సున్నం పెట్టి ప్రథమ చికిత్స చేశారు భాజా భజంత్రీలతో కేరింతల మధ్య నిర్వహించిన పిడిగుద్దులాట ఉత్కంఠభరితంగా సాగింది. పోలీసుల నుండి ఎలాంటి అనుమతులు లేకపోయిననా గ్రామంలో సనాతనంగా ఏళ్ళగా వస్తున్న ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎసిపి రఘు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

మరో పదేళ్లు రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వమే

- కాంగ్రెస్ పార్టీకి 70 కాదు కేవలం 7 స్థానాలే వస్తాయి
- హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి



మన తెలంగాణ/వికారాబాద్ జిల్లా : రాష్ట్రంలో ఇంకా పదేళ్లు కెసిఆర్ ప్రభుత్వమే ఉంటుందని హోంశాఖ మంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం నవాబుపేట మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ విద్యార్థి అమరుడు డి.మహేందర్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌కి 70 స్థానాలు వస్తాయని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెబుతున్నాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి 70లో సున్నాను తీసి పక్కన బెడితే కేవలం 7మిగులుతుందని, కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఏడే స్థానాలు వస్తాయని ఎద్దేవా చేశారు. తమకు స్పష్టంగా సర్వేలలో 90 నుంచి 100 స్థానాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీలో హైకమాండ్ ఉంటుందని, తమకు మాత్రం ప్రజలే హైకమాండ్ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న బస్సు ప్రజా చైతన్య యాత్ర కాదని వారి అంతిమ యాత్రని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం జల యజ్ఞం కార్యక్రమం ధన యజ్ఞంగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని చెబుతున్న కాంగ్రెస్ పార్టీలో ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల పాలన కుటుంబ పాలన కాదా అని ప్రశ్నించారు. టిఆర్‌ఎస్ గ్రామాల నుంచి మండల కేంద్రాలకు, మండల కేంద్రంలోనుంచి జిల్లా కేంద్రాలకు రోడ్ల నిర్మాణం చేపడుతుందని చెప్పారు. హైవేల నిర్మాణం కొనసాగుతున్నాయని తెలిపారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా ఎకరానికి 4 వేల రూపాయల చొప్పున పెట్టుబడిని ఇస్తున్నది టిఆర్‌ఎస్ ప్రభుత్వమని పేర్కొన్నారు. ఐదుమంది ఎమ్మెల్యేలు ఉన్న బిజెపి టిఆర్‌ఎస్‌కు తామే ప్రత్యామ్నాయమని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి.మహేందర్‌రెడ్డి, టిఎస్ ఇడబ్ల్యుడిసి చైర్మన్ జి.నాగేందర్‌గౌడ్, చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, చేవెళ్ల, వికారాబాద్ ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, బి.సంజీవరావు పాల్గొన్నారు.

పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం : 4 వేల క్వింటాళ్ల పత్తి దగ్ధం



మన తెలంగాణ/గజ్వేల్ : సిద్దిపేట జిల్లా, గజ్వేల్ మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామ శివారులోగల ఈశ్వరసాయి కాటన్ జిన్నింగ్ మిల్లులో ప్రమాదవశాత్తు ఆటో స్పార్క్‌తో మంటలు చెలరేగి పత్తి పూర్తిగా దగ్ధమైంది. వెంటనే జిన్నింగ్ మిల్ యాజమాన్యం గజ్వేల్ పట్టణంలోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దాంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సిద్దిపేట ఫైర్ సిఐ శ్రావణ్ వర్మ గజ్వేల్ ఫైర్ ఇంజన్‌తోపాటు అదనంగా శామీర్‌పేట్ నుంచి ఫైర్ ఇంజన్‌ను రప్పించి ఫైర్ సిబ్బందితో మంటలను అదుపులోకి తెచ్చారు. ఫైర్ ఇంజన్లు సంఘటనా స్థలానికి చేరుకొనే సరికి సగం పత్తి పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ సిఐలు శ్రావణ్ వర్మ, మిల్ యాజమాన్యం ప్రొద్దుటూరి చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ రెండు గంటల వరకు ఫైర్ సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినట్లు తెలిపారు.ప్రమాదంలో సుమారు 4000 క్వింటాళ్ళ పత్తి దగ్ధమైయినట్లు, దీంతో సుమారు రూ.2కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు.

ఖర్చులు తగ్గించేందుకే వ్యవసాయ యాంత్రీకరణ

- ప్రతి నియోజకవర్గంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమ ఏర్పాటు
- ట్రాక్టర్ల పంపిణీలో మంత్రి పోచారం



మన తెలంగాణ/ ఖమ్మం అర్బన్ : వ్యవసాయరంగంలో ఖర్చులు తగ్గించడానికి భారీ సబ్సిడీలతో యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ మైదానంలో యంత్రలక్ష్మి పథకంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సబ్సిడీపై మంజూరైన 718 ట్రాక్టర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి నియోజక వర్గంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో వరినాట్లు వేయడానికి వరినాట్లు యంత్రాలను రాయితీపై రాష్ట్ర వ్యాప్తంగా 5,500 యంత్రాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రూ.300 కోట్లతో 2600 రైతు వేదికలను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఎకరానికి రూ.4వేల చొప్పున రెండు పంటలకు రూ.8వేలు పెట్టుబడి అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీతారామ ప్రాజెక్టు పథకం ద్వారా 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేసి వైరా, బయ్యారం, రోళ్లపాడు, పాలేరు ప్రాజెక్టులకు నీరందిస్తామన్నారు. యాంత్రీకరణ పథకం కింద మంజూరైన ట్రాక్టర్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంఎల్‌ఏలు అజయ్‌కుమార్, మదన్‌లాల్, తాటి వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, జిల్లా కలెక్టర్ డిఎస్ లోకేష్‌కుమార్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్మోహన్‌రావు, జెడ్పి చైర్మన్ గడిపల్లి కవిత పాల్గొన్నారు.

నేడు తెలంగాణ జెఎసి స్టీరింగ్ కమిటీ సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ జెఎసి స్టీరింగ్ కమిటీ సమావేశం శనివారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ నివాసంలో జరగనుంది. ఈ సమావేశంలో రైతాంగ, నిరుద్యోగుల సమస్యపై ఉద్యమ కార్యాచరణ, మిలియన్‌మార్చ్ యాదిలో కార్యకర్తలు, వర్తమాన పరిణామాలపై చర్చ జరగనుంది. కాగా ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ఆవిర్భావ సభ సన్నాహక కమిటీ నియామకం, రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రక్రియ తదితర అంశాలపై సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

రామారావుపల్లిలో దారుణ హత్య

మన తెలంగాణ/ చందుర్తి: సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలో లింగంపల్లి లింగయ్య(50)పై పాత కక్ష్యలతో ఇదే గ్రామానికి చెందిన లింగంపల్లి రాజయ్య అతని కుమారుడు వెంకటేశ్ అలియాస్ కిట్టుతో పాటు మరికొంతమంది శుక్రవారం దాడి చేయడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. లింగంపల్లి లింగయ్య కుమారుడు అనిల్ ఇదే గ్రామానికి చెందిన లింగంపల్లి రాజయ్య కూతురు ప్రియాంకను సంవత్సరం క్రితం ప్రేమ పెళ్లి చేసుకోవడంతో రెండు కుటుంబాల మధ్య కక్షలు తీవ్రమయ్యాయి. అనిల్ భార్యతో కరీం నగర్‌లో నివాసం ఉంటున్నాడు. దీంతో హోలీ పండుగ రోజు లింగయ్య కుటుంబంపై రాజయ్య కుటుంబం దాడి చేయగా లింగయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆపస్మారక స్థితిలో లింగయ్యను వేములవాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సిఐ విజయ్ కుమార్, ఎస్‌ఐ మ ల్లేశంగౌడ్ వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆ సుపత్రికి తరలించారు.

రెండో రోజూ అడ్వకేట్ల విధుల బహిష్కరణ

మన తెలంగాణ/హైదరాబాద్: న్యాయమూర్తుల పోస్టుల ఖాళీల్ని భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ /ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘాల పిలుపుమేరకు రెండో రోజు శుక్రవారం కూడా న్యాయవాదులు హైకోర్టు విధుల్ని బహిష్కరించారు. అత్యవసర కేసులు మాత్రమే విచారణ జరిగాయి. ఇరు సంఘాల అధ్యక్షులు కనకయ్య/ధనుంజయల ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టుల వద్ద ఉన్న న్యాయవాదులంతా ఆందోళనకు మద్దతు ఇవ్వాలని కోరారు. అందుకు పలువురు న్యాయవాదులు అంగీకారం తెలిపారు. హైకోర్టు గేటు వద్ద న్యాయవాదులు సమావేశమై తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

డిమాండ్లు : హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ పెట్టాలి. ఉమ్మడి హైకోర్టులోని 61 జడ్జీల పోస్టుల్లో ఖాళీగా ఉన్న సగం పోస్టుల్ని వెంటనే భర్తీ చేయాలి. 2015 నుంచి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఉన్నారు.. పూర్తి స్థాయిలో సీజేను నియమించాలి. సీఆర్‌పీసీలోని సెక్షన్ 41ఎను రద్దు చేయాలి. 2012 నాటి వరకూ ఉన్న పెండింగ్ కేసుల్ని హైకోర్టులు సత్వరమే పరిష్కరించాలనే ఉత్తర్వుల్ని రద్దు చేయాలి.

సామాజిక తెలంగాణ సాధనే బిఎల్‌ఎఫ్ లక్ష్యం

మన తెలంగాణ / ముషీరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధనే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్‌ఎఫ్) ప్రధాన లక్ష్యమని ఆ ఫ్రంట్ ఛైర్మన్ నల్లా సూర్యప్రకాష్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఎల్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ ఛైర్మన్ నల్లా సూర్యప్రకాష్ మాట్లాడుతూ మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలు పాలకులు, గుత్తేదారులకు కమీషన్లుగా పథకాలు మారాయన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం అటకెక్కిందన్నారు. దళిత సిఎం పదవి ఇస్తానని దళితులను మోసం చేశారని విమర్శించారు. సిఎం కేసిఆర్ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా రోజుకో కొత్త వాగ్దానంతో మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి మూడున్నర ఏళ్లు గడిచినా ఇప్పటికి ప్రజలకు ఇచ్చిన వాగ్దానంలో ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. టీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒకే నాణం బొమ్మా, బొరుసులని, ఆ రెండు పార్టీలకు సామాజిక న్యాయం అమలు చేయకుండా కుట్రలు చేస్తున్నాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిఎల్‌ఎఫ్ 119 స్థానాల్లో విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు మన్నారం నాగరాజు, నాగయ్య, రాములు తదితరులున్నారు.

భూ ప్రక్షాళన పేరుతో అవకతవకలు

తహసీల్దార్ కార్యాలయంలో విఆర్‌వోల చేతివాటం – తమభూమి రికార్డుల్లో లేకపోతే ఆత్మహత్యే మార్గం : రైతులు



భూ రికార్డులను చూపుతున్న బాధితులు

మన తెలంగాణ / ఘట్‌కేసర్ (మేడ్చల్ జిల్లా) : భూ ప్రక్షాళన ఘట్‌కేసర్ మండలంలో కంచె చేనుమేసిన చందంగా మారింది. వివరాల్లోకి వెళితే, భూ ప్రక్షాళన కార్యక్రమంలో తమ భూములు పక్కాగా ఉంటాయని భావిస్తే రెవెన్యూ అధికారుల చేతి వాటంతో ఉన్న భూములు రికార్డులలో లేకుండా చేశారని అవుషాపూర్ గ్రామానికి చెందిన రైతులు కొట్టి మోహన్‌రెడ్డి, కంచర్ల అరుణ, వెంకట్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తమ భూములు రికార్డులలో లేకుండా పోయినట్లు మండల తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించిన స్పందించక పోగా కోర్టుకు వెళ్లాలని సూచించారు.ఈసందర్భంగా రైతులు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద తమ గోడు విలేకర్లకు వెళ్లబోసుకున్నారు. అవుషాపూర్ గ్రామానికి చెందిన కొట్టీ మోహన్ రెడ్డికి సర్వే నెంబర్ 26లో 2.05 ఎకరాల పట్టా భూమి ఉందని, అదే సర్వేనెంబర్‌లో అవుషాపూర్ గ్రామానికి చెందిన కొట్టీ రవిందర్‌రెడ్డి, సురెందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డిలకు మరికొంత భూమి ఉన్నట్లు చెప్పారు. వారి భూమిని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి అమ్ముకుని, తమ భూమి సైతం అమ్మాలని తెలుపుతూ ఆరు నెలల నుండి వత్తిడి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. తమ భూమిని అమ్మేది లేదని నేను తెగేసి చెప్పటంతో, దీంతో వారు అవుషాపూర్ విఆర్‌ఓ గంగాధర్‌కు ముడుపులు చెల్లించి తమ భూమిని రికార్డులలో లేకుండా చేశారని ఆరోపించారు. విఆర్‌ఓను ప్రశ్నించగా రికార్డులలో లేకున్నా, పట్టాదారు పాసుపుస్తకంలో వస్తుందని, రాకపోతే కోర్టును ఆశ్రయించాలని ఉచిత సలహా ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదే గ్రామానికి చెందిన కంచర్ల అరుణ వెంకట్‌రెడ్డికి చెందిన మూడు కోట్ల విలువగల ఎకరం భూమిని ఫోర్జరీ సంతకాలు సృష్టించి రికార్డులను తారుమారు చేసిగతంలో ఫోర్జరీ కేసుపై జైలు శిక్ష పడి, జరిమాన చెల్లించిన పై నలుగురు కాజేసినట్లు ఆరోపించారు. గ్రామంలోని సర్వే నెంబర్లు 26, 29 నుండి 32 లలోని ఎకరం భూమిని కంచర్ల అరుణ పేరుతో సంతకాలు ఫోర్జరీ చేసి వారికిరాసి ఇచ్చినట్లు, డాక్యుమెంట్లు సృష్టించి విఆర్‌ఓ గంగాధర్‌తో రికార్డులు మార్పించి స్వాధీ నం చేసుకున్నారని ఆరోపించారు. భూములకు రికార్డులలో లేకుండా చేసి, ఇతరుల పేరున రికార్డులు సృష్టించిన విఆర్‌ఓపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, కలెక్టర్, ఆర్డీవో, డీపీవోలకు ఫిర్యాదు చేస్తామన్నారు. తమ భూములు తమకు దక్కుండా పోతే ఆత్మహత్యే శరణ్యమని రైతులు అంటున్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్ : వ్యక్తి మృతి

నిందితుడు నవీన్‌కుమార్ అరెస్టు

మన తెలంగాణ/సిటీబ్యూరో : మద్యం మత్తులో చేసిన డ్రైవింగ్ ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొన్నది. అతిగా మద్యం సేవించి అత్యంత వేగంగా వాహనాన్ని తోలుతూ ఆటోను ఢీ కొట్టగా ఆటో డ్రైవర్ తీవ్రగాయాలకు గురై అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన బేగంపేట్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజాములో చోటుచేసుకుంది. పోలీసు ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉప్పల్ మల్లాపూర్‌కు చెందిన నవీన్ కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. గచ్చిబౌలిలోని ఎన్‌టిటి డాటా ఐటి సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 3.45 గంటలకు పంజాగుట్ట మీదుగా ఉప్పల్‌కు తన వాహనం టిఎస్ 08 ఇఇ 5868 టయోటా ఐటాస్ కారులో బయలుదేరాడు. తీవ్రస్థాయిలో మద్యం సేవించిన అతడు కారును వేగంగా తోలుకుంటు వెళ్తున్నాడు. కాగా బేగంపేట్ పబ్లిక్ స్కూల్ ఎదరుగా యూటర్న్ తీసుకుంటున్న ఆటోను ఢీకొట్టాడు. ఆ వేగానికి ఆటో కొంత దూరం వరకు ఈడ్చుకెళ్ళింది. దీంతో చింతల్ షాపూర్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ రఫీక్(34)కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారులో బెలూన్‌లు వెలువడటంతో నవీన్‌కుమార్ క్షేమంగా ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రఫీక్ శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి నిందితుడు నవీన్‌ను అరెస్టుచేశారు.

ఆరు నెలల తర్వాత అంత్యక్రియలు



మన తెలంగాణ/సదాశివనగర్ (కామారెడ్డి జిల్లా): మరణించిన ఆరు నెలల తర్వాత అంత్యక్రియలు జరిగిన సంఘటన శుక్రవారం సదాశివనగర్ మండలంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన దూసుగామ మోహన్ (42) గత కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. అక్కడ అనారోగ్యంతో 6 నెలల క్రితం మృతి చెందగా శవపరీక్షలు, అక్కడి ప్రక్రియ పూర్తి చేసి శుక్రవారం స్వగ్రామానికి మృతదేహాన్ని తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడు మోహన్‌కు కొడుకులు లేకపోవడంతో పెద్ద కూతురు తండ్రి అంత్యక్రియలు నిర్వహించింది. మృతుడి కుటుంబానికి ఎంపిపి విజయశివకుమార్, రాజేశ్వర్‌రావు, బీరయ్య, శ్యాంరావు పరామర్శించి రూ. 5 వేలు అందజేశారు.

మహేష్ చిత్రానికి బాలీవుడ్ సినిమాటోగ్రాఫర్







సూపర్‌స్టార్ మహేష్‌బాబు కథానాయకుడిగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో సి.అశ్వనీదత్, దిల్‌రాజు ఓ భారీ చిత్రాన్ని నిర్మించనున్న విషయం తెలిసిందే. శ్రీమతి అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రానికి ప్రముఖ బాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ కె.యు.మోహనన్ పనిచేయనున్నారు. హిందీలో డాన్, తలాష్, రయీస్ వంటి భారీ చిత్రాలకు అద్భుతమైన విజువల్స్‌ను అందించిన కె.యు.మోహనన్ ఇప్పుడు మహేష్‌బాబు నటించనున్న 25వ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేయనున్నారు. పూజాహెగ్డే హీరోయిన్‌గా నటించనున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కథ: వంశీ పైడిపల్లి, హరి, సాల్మన్.



• హోలీ సంబరాల్లో మునిగితేలారు

హోలీ పండుగను పురస్కరించుకొని తారాలోకం రంగుల్లో తడిసి ముద్దయిపోయింది. పలువురు సినీ స్టార్లు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులతో కలిసి ఈ రంగుల పండుగను హుషారుగా జరుపుకున్నారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాల్లో మునిగితేలారు. స్టార్ హీరో రామ్‌చరణ్ హోలీ పండుగను హుషారుగా జరుపుకున్నాడు. తన కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో సరదాగా ఈ పండుగను సెలబ్రేట్ చేశాడు. ఇక అందాల తారలు కాజల్ అగర్వాల్, క్యాథరిన్, మెహరీన్‌లు ఈ రంగుల పండుగను ఎంతో సంతోషంగా జరుపుకున్నారు. సౌతిండియా స్టార్ రజనీకాంత్, యంగ్ హీరో నిఖిల్, కన్నడ స్టార్ ఉపేంద్ర రంగులు చల్లుకొని హోలీ సంబరాల్లో మునిగితేలారు. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్‌బచ్చన్ తన నివాసగృహంలో కుటుంబసభ్యులు జయాబచ్చన్, అభిషేక్‌బచ్చన్, ఐశ్వర్యారాయ్, ఆరాధ్యలతో కలిసి హోలీ వేడుకలను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నాడు. బాలీవుడ్ హీరో వివేక్ ఒబెరాయ్ తన భార్యతో కలిసి ఈ వేడుకలను సెలబ్రేట్ చేశాడు.










దసరా పండుగ కానుకగా..

పండుగ వాతావరణంలో సినిమాలు రిలీజ్ అయితే ఆ మజానే వేరుగా ఉంటుందని హీరోల అభిమానులు అంటారు. అందరూ మంచి మూడ్‌లో ఉంటారు కాబట్టి ఎలాంటి సినిమా అయినా కొంచెం నచ్చితే చాలు సినిమా హిట్ కావడం ఖాయం. స్టార్ హీరోల సినిమాలు అయితే ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దీంతో స్టార్ హీరో ఎన్టీఆర్ తన కొత్త సినిమాను దసరాకు విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాడు. అభిమానులకు పండుగ కానుకగా ఈ సినిమాను విడుదల చేస్తే బాగుంటుందని అతను భావిస్తున్నాడు. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎన్టీఆర్ తన కొత్త చిత్రాన్ని చేయబోతున్న విషయం తెలిసిందే. విభిన్నమైన కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈనెల 26 నుంచి ప్రారంభంకానుంది. ప్రస్తుతం సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులతో దర్శకుడు త్రివిక్రమ్ బిజీగా ఉన్నాడు. ఇక దసరాకు ఈ చిత్రం విడుదల కోసం షూటింగ్ షెడ్యూళ్లను ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం గురించి త్రివిక్రమ్, ఎన్టీఆర్ తరచుగా చర్చించుకుంటున్నారు. కథకు తగ్గట్టు ప్రతి పాత్ర ఎలా ఉండాలి అనే విషయాలను వారు మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తయిన ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్‌కు అవసరమైన సన్నాహాలు చేస్తున్నారు ఫిల్మ్‌మేకర్స్.

కాలేజ్ క్యాంపస్ డ్రామా

నిఖిల్ హీరోగా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన 'కిర్రాక్ పార్టీ' చిత్రాన్ని ఈనెల 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల విడుదలైన టీజర్, పాటలకు విశేష స్పందన వస్తోంది. నిఖిల్ స్టైలిష్ మ్యాచో లుక్స్ చిత్రంపై అంచనాలను మరింత పెంచేశాయి. కాలేజ్ క్యాంపస్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రం నిఖిల్‌కు 'హ్యాపీడేస్' తరహాలో మరో భారీ విజయాన్ని అందిస్తుందని ఫిల్మ్‌మేకర్స్ ఆశిస్తున్నారు. శరణ్ కొప్పిశెట్టి దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రానికి దర్శకులు సుధీర్‌వర్మ, చందూ మొండేటి స్క్రీన్‌ప్లే, మాటలు రాయడం విశేషం. ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీన్జ హీరోయిన్లుగా నటించారు. రామబ్రహ్మం సుంకర, కిషోర్ గరికిపాటి, అజయ్ సుంకర, అభిషేక్ అగర్వాల్ నిర్మాతలుగా ఎ.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్, ఏటివి బ్యానర్‌లపై ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రానికి కెమెరా: అద్వైత గురుమూర్తి, సంగీతం: అజనీష్ లోకనాథ్, ఎడిటర్: యం.ఆర్.వర్మ, ఆర్ట్: అవినాష్.



నిఖిల్, సిమ్రాన్ పరీన్జ తదితరులు

రచయితగా సత్తాచాటుతా..



ఆన్‌స్క్రీన్‌పైనే కాకుండా ఆఫ్‌స్క్రీన్‌లోనూ టాలెంట్ చూపించే అందాల భామల సంఖ్య పెరుగుతోంది. అనుష్క శర్మ వంటి స్టార్లు ప్రొడక్షన్‌పై దృష్టి పెడితే... కొందరు గొంతు సవరించుకొని పాడుతున్నారు. ఇటీవల సోనమ్ కపూర్ పుస్తకాలను చదివి రివ్యూలు రాస్తానని చెప్పిన విషయం తెలిసిందే. కొందరు సీనియర్ సుందరాంగులు డైరెక్షన్‌ను హ్యాండిల్ చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక సినిమాలకు సంబంధం లేకుండా టాలెంట్ చూపించే వాళ్ల సంఖ్య చాలానే ఉంటోంది. కానీ సినిమా రంగంలో అత్యంత అరుదుగా ఎంచుకునే ప్రొఫెషన్ రైటింగ్. కథ, మాటలు రాసే విషయంలో చాలామంది సాహసం చేయరు. సినిమాకు అత్యంత కీలకమైన ఈ విభాగంలో తలదూర్చే సాహసం హీరోయిన్లు చేసిన సందర్భాలు బహుశా ఉండవు. కానీ ఢిల్లీ బ్యూటీ తాప్సీ మాత్రం పెన్నుతోనూ సత్తాచాటుతానంటోంది. రచయితగా తనలోని కొత్త టాలెంట్‌ను ప్రదర్శిస్తానంటోంది. ఖాళీగా ఉన్న సమయాల్లో మంచి కథలు, కవితలు రాస్తానంటోంది. చిన్నప్పటి నుంచి తనకు పుస్తకాలంటే ఎంతో ఇష్టమని... ఇప్పుడు తానే స్వయంగా కథలు, కవితలు రాసి ఓ పుస్తకాన్ని ప్రచురించాలని కోరుకుంటున్నట్టు తాప్సీ పేర్కొంది.


అభిమానుల గుండె బరువెక్కింది






శ్రీదేవి అంత్యక్రియలు జరిగి రెండు రోజులు గడిచినా తన జ్ఞాపకాలు అభిమానులను వెంటాడుతూనే ఉన్నాయి. ఏదో ఒక రూపంలో తనకు సంబంధించిన విషయాలు వెలుగులోకి వస్తూ ఉండటంతో అవి చూసిన ప్రతిసారి వారి గుండె బరువెక్కుతోంది. హోలీ పండుగ వేడుకలను దేశమంతా జరుపుకుంటున్న సమయంలో గత ఏడాది హోలీ వేడుకల్లో శ్రీదేవి పాల్గొన్న ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను కంటతడి పెట్టిస్తున్నాయి. తాను నివసించిన గ్రీన్ ఎకర్స్ ప్రాంతంలో గత సంవత్సరం శ్రీదేవి తన కుటు ంబ సభ్యులతో కలిసి హోలీ సంబరాలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ వేడుకలకు సంబంధించిన ఫొటోలు ఆ జ్ఞాపకాలను గుర్తుకుతెస్తున్నాయి. ఇందులో అందరినీ ఆకర్షిస్తున్న ఫొటో ఒకటి ఉంది. తనకు ఎంతో ఇష్టమైన వైట్ కలర్ స్లీవ్‌లెస్ బ్లౌస్‌లో నవ్వుతున్న శ్రీదేవి వీపుపై ఎర్రని రంగులో బోనీ అని రాయించుకోవడం ఆకట్టుకుంటోంది. భర్త మీద తనకు ఎంత ప్రేమ ఉందో ఈ ఫొటో రుజువు చేస్తోందని అభిమానులు అంటున్నారు. ఇక ఈఏడాది శ్రీదేవి మృతికి సంతాపంగా ఆమె నివసించే గ్రీన్ ఎకర్స్ ప్రాంతవాసులు హోలీ వేడుకలను జరుపుకోలేదు.

విజయవంతంగా థియేటర్ల బంద్









డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు వసూలు చేస్తున్న వర్చువల్ ప్రింట్ ఫీజును (విపిఎఫ్) తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో థియేటర్ల బంద్ విజయవంతంగా ప్రారంభమైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలలోని ప్రధాన నగరాలు, ఇతర ప్రాంతాల్లో థియేటర్ల బంద్‌ను వివిధ రాష్ట్రాల నిర్మాతల మండలిలు నిర్వహించాయి. ఐదు రాష్ట్రాల నిర్మాతలు, పంపిణీదారుల సహకారంతో ఈ బంద్ కొనసాగుతోంది. ఈ బంద్‌తో హైదరాబాద్‌లోని థియేటర్లన్నీ మూతపడ్డాయి. ఇక డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు దక్షిణాది రాష్ట్రాల్లో అత్యధికంగా విపిఎఫ్ ఛార్జీలు వసూలు చేస్తుండగా ఉత్తరాదిన మాత్రం అక్కడి చిత్ర పరిశ్రమలు చెప్పినట్లుగా ఛార్జీలు వసూలు చేస్తుండడం గమనార్హం. ఇక విపిఎఫ్ ఛార్జీలు తగ్గే వరకు ఈ బంద్ కొనసాగుతుందని సౌతిండియా సినీ ఇండస్ట్రీ జాయింట్ యాక్షన్ కమిటీ స్పష్టంచేసింది.



అమెరికా నిర్ణయం ప్రభావం భారత్‌పై వెంటనే ఉండదు

న్యూఢిల్లీ: స్టీలు, అల్యూమినియంపై దిగుమతి సుంకం పెంచుతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ చేసిన ప్రకటన ప్రభావం భారత్‌పై తక్షణమే ఉండకపోవచ్చని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ అధికారి తెలిపారు. అమెరికాలోకి దిగుమతులను తగ్గించాలనే ఉద్దేశంతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని, దీనివల్ల అమెరికాతో ఇతర దేశాల సంబంధాలు దెబ్బతింటాయని అన్నారు. భారత్ అమెరికాకు ఎగుమతులు 2 శాతమే ఉంటాయని, దిగుమతి సుంకం ప్రభావం వెంటనే ఉండే అవకాశం లేదని, సెక్షన్ 232 తమకు ఉపయోగపడుతుందని స్టీల్ కార్యదర్శి అరుణ శర్మ మీడియాతో అన్నారు. అమెరికా నిర్ణయంతో చైనా, యూరప్, కెనడా వంటి దేశాలతో వాణిజ్య సంబంధాలు క్షీణిస్తాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. యుఎస్‌లోకి దిగుమతి అయ్యే స్టీల్‌పై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకాలను విధించనున్నట్టు ట్రంప్ ప్రకటించారు. వచ్చే వారమే కొత్త పన్నులు అమల్లోకి వస్తాయని చెప్పారు. దీంతో అమెరికా, ఆసియా స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. ఈ నిర్ణయంపై పలు దేశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి రక్షణాత్మక నిర్ణయాలు ఇతర దేశాలతో సంబంధాలను క్షీణించేలా చేస్తాయని వారుంటున్నారు.

బ్యాంకింగ్ పతనం ఆగేదెప్పుడు?

17శాతం వరకు నష్టపోయిన పిఎస్‌యు బ్యాంక్ సూచీ



న్యూఢిల్లీ: మొండి బకాయిలతో సతమతమవుతున్న ప్రభుత్వ రంగ బ్యాంక్‌లకు మూలధన నిధిని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి బ్యాంకింగ్ షేర్లలో ఉత్సాహం కనిపించింది. అయితే ఫిబ్రవరి 14న పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో నీరవ్ మోడీ రూ.12,700 కోట్ల రుణాలకు ఎప్పుడైతే కుచ్చుటోపీ పెట్టాడో.. అప్పటి నుంచి పిఎస్‌యు బ్యాంక్ షేర్ల పతనం ప్రారంభమైంది. ఇంకా ఎంత వరకు ఈ పతనం కొనసాగుతుందో చెప్పడం కష్టమే.. పడిపోతోన్న షేర్లను విక్రయించేందుకే ఇన్వెస్టర్లు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొత్త కొనుగోళ్లకి మాత్రం మొగ్గు చూపడం లేదు. మొత్తం పిఎస్‌యు బ్యాంక్ సూచీనే చూస్తే 17శాతం వరకూ నష్టపోయింది. 2016 జనవరిలో 20 శాతం నష్టం తర్వాత ఆ స్థాయిలో పతనం కావడం ఇదే కావడం గమనార్హం. షేర్లు కూడా ఏడాది కనిష్టాలకు పతనం అయ్యాయ్. మోసం వెలుగు చూడకముందు పిఎన్‌బి షేరు 172...ఇప్పుడు చూస్తే రూ.98కి చేరింది.. అంటే 42 శాతం పతనమైంది. బ్యాంక్ ఆఫ్ ఇండియా 30 శాతం క్షీణించి రూ.157 నుంచి రూ.113కు చేరింది. మరో ప్రభుత్వరంగ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 25 శాతం నష్టపోయి రూ.136.25 నుంచి రూ.103.55కు చేరింది. అలహాబాద్ బ్యాంక్ 23 శాతం పతనమై రూ.66.80 నుంచి రూ.51.50కి నష్టపోయింది. దేనా బ్యాంక్ రూ. 25.10 నుంచి దాదాపు 19శాతం నష్టపోయి రూ.20.60కి చేరింది. యూకో బ్యాంక్ 18శాతం నష్టంతో రూ.31.50 నుంచి రూ.25.70కి క్షీణించింది. సిండికేట్ బ్యాంక్ 17 శాతం నష్టంతో రూ.72.25 నుంచి రూ.60.70కి చేరింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రూ. 19.85 నుంచి రూ.16.65కి తగ్గింది. యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేరు ధర రూ.16.55 నుంచి రూ.13.85కి పతనమైంది. దేశీయ అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) 17 శాతం నష్టపోయి రూ.313.25 నుంచి రూ.262.55కు చేరుకుంది.

కొనుగోలు ఇప్పుడే వద్దంటున్న నిపుణులు

ఈ బ్యాంకుల షేర్లు బారీగా తగ్గాయి కదా.. కొనుగోలు చేయాలని భావిస్తున్న వారిని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఒరవడి తగ్గేవరకూ కొన్నాళ్లు ఈ షేర్ల జోలికి పోకపోవడమే ఉత్తమం అని ఆర్థిక విశ్లేషకులు అంటున్నారు. ఇప్పుడు కొంటే తర్వాత లాభపడొచ్చు అనుకుంటే మాత్రం పొరపాటని అంటున్నారు. దీనికి కారణం పిఎన్‌బిలో చోటుచేసుకున్న మోసమే.. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో ఈ రంగానికి గడ్డుకాలంగా మారింది. సమస్య తీవ్రతని గుర్తించే గతవారం చివరిరోజున కేంద్రం విదేశాల్లో ఉన్న పిఎస్‌యు బ్యాంకుల 35శాఖలు మూసేయాలని నిర్ణయించింది. మొండిబకాయిల సమస్య ఎప్పటినుంచో ఉన్నా, ఈ రెండింటికీ బైటికి కన్పించని సంబంధం ఉంది. సామాన్య పౌరులకు అప్పు ఇవ్వాలంటే అనుసరించే కఠినమైన విధానాలు కార్పోరేట్లకి వర్తించకపోవడమే అసలు కారణం. బడా బాబులు తమ పలుకుబడితో సిబ్బందిలోని చేతివాటాన్ని ఆసరాగా చేసుకుని కోట్లాది రూపాయలు రుణాల రూపంలో నొక్కేస్తున్నారు. పిఎన్‌బిలోనే రూ.12,700కోట్ల గోల్‌మాల్ తర్వాత ఒక్కొక్కటిగా ఇతర బ్యాంకుల్లోనూ మోసాలు వెలుగుచూస్తున్నాయి.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29040	31058.82	0.38%
ముంబై	29770	31839.57	–0.13%
ఢిల్లీ	29650	31711.23	0%
కోల్‌కతా	29930	32010.70	0%
కేరళ	28150	30106.95	0%
బెంగళూరు	28550	30534.76	0.18%
హైదరాబాద్	29040	31058.82	0.21%
గల్ఫ్	1402.5	1500.00	0.64%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	శుక్రవారం	గురువారం	మార్పు (%)
చెన్నై	41700.00	41600.00	0.24
ముంబై	41700.00	41600.00	0.24
ఢిల్లీ	41700.00	41600.00	0.24
కోల్‌కతా	41700.00	41600.00	0.24
హైదరాబాద్	41700.00	41600.00	0.24



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	345	విశాఖపట్నం	350
వరంగల్	347	చిత్తూరు	378
విజయవాడ	340	చెన్నై	385
గోదావరి	340	బెంగళూరు	375

రియల్‌ఎస్టేట్‌తో ఎక్కువ ఉపాధి

- క్రెడాయ్ 6వ ఎడిషన్ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవంలో మంత్రి ఈటల
- జిఎస్‌టి తగ్గింపుపై కేంద్రాన్ని కోరుతానని హామీ



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్నది రియల్ ఎస్టేట్ రంగమేనని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 10 లక్షలకు పైగా చదువుకున్నవారికీ, శ్రామికవర్గానికీ రియల్ ఎస్టేట్ రంగం తోడ్పాటునందిస్తోందన్నారు. ఉద్యోగ అవకాశాల కల్పనలో తెలంగాణ వారికే ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని రియల్టర్లకు ఈటల విజ్ఞప్తి చేశారు. 'క్రెడాయ్' 6వ ఎడిషన్ ప్రాపర్టీ షోను మంత్రి ఈటల రాజేందర్ శుక్రవారం హైటెక్స్‌లో ప్రారంభించారు. ఇందులో హైదరాబాద్‌కు చెందిన 120 మంది డెవలపర్లు సుమారు 15 వేల ప్రాజెక్టులను స్టాళ్లలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రం కంటే తెలంగాణ అత్యంత నివాసయోగ్యమైన ప్రదేశమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్మెంట్ తర్వాత హైదరాబాద్‌లోనే శేష జీవితాన్ని గడపాలని నిర్ణయించుకుంటున్నారని, కేంద్ర మాజీ ఎన్నికల ప్రధాన కమిషనర్ జెఎం లింగ్డో, రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (ఆర్‌ఏడబ్ల్యూ) చీఫ్ రాజేందర్ ఖన్నా .. ఇలా ఎంతో మంది ఇక్కడే నివాసం ఉంటున్నారని గుర్తుచేశారు. జిఎస్టిలో భవన నిర్మాణ రంగానికి తొలుత ఉన్న 18 శాతం పన్నును 12%కి తగ్గించే అవకాశముందన్నారు. ఈ నెలాఖరుకు జిఎస్‌టి సంస్కరణలపై కేంద్రం ఆలోచించే అవకాశం ఉందని అన్నారు. జిఎస్‌టి తర్వాత చిరువ్యాపారులు, వర్తక వాణిజ్య సంస్థలు, భారీ షాపింగ్ మాల్స్ పన్ను ఎగవేతకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నాయన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లా కేంద్రాల్లో ఇంకా కొన్ని షాపులు టాక్స్ లేకుండానే లావాదేవీలను జరుపుతున్నాయని, వినియోగదారులు బిల్లులు అడిగితే రాయితీలను ఎత్తేస్తున్నారని వ్యాఖ్యానించారు. జిఎస్‌టిలో ఎక్కువ పన్ను విధింపు ఉంటే వాణిజ్య సంస్థలు దానిని కట్టకపోగా ఎగ్గొట్టే అవకాశాలే ఎక్కువగా ఉంటాయన్నారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు మెరుగ్గా ఉన్నాయని, సిఎం కెసిఆర్ ఆదేశాలతో కమాండ్ కంట్రోల్ రూమ్ పర్యవేక్షణలో నిఘా ఉంటోందని, అభివృద్ధి చెందిన సింగపూర్ తర్వాత ఆ స్థాయి నిఘావ్యవస్థ ఇక్కడే ఉందని అన్నారు. అందుకే ఎన్నో అంతర్జాతీయ స్థాయి సదస్సులు హైదరాబాద్‌లో జరుగుతున్నాయని, హైదరాబాద్ 'లవెబుల్' సిటీ మాత్రమే కాక 'లివబుల్' కూడా అని మంత్రి కెటిఆర్ తరుచూ చేసే వ్యాఖ్యను ఈటెల గుర్తు చేశారు. సభకు అధ్యక్షత వహించిన క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు ఎస్. రామ్‌రెడ్డి మాట్లాడుతూ నగర వ్యాప్తంగా 120 మంది డెవలపర్లను ఈ ప్రాపర్టీ షో ద్వారా ఏకతాటిపైకి తీసుకువచ్చామన్నారు. మూడు రోజులు ఈ ప్రాపర్టీ షోలో టౌన్ షిప్‌లు, అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌పై ప్రత్యేక శ్రద్ధ కల్గిన గ్రీన్ బిల్డింగ్స్‌ను ప్రదర్శనకు ఉంచామన్నారు. భవన నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ రంగం నిపుణులు, కేంద్ర , రాష్ట్ర పన్నులశాఖ అధికారులు, బ్యాంకర్లు స్వంత ఇంటి కలపై సందేహాలను నివృత్తిచేస్తారని తెలిపారు. భవన నిర్మాణ రంగంపై విధించిన జిఎస్‌టి పన్నును తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. క్రెడాయ్ ప్రధాన కార్యదర్శి పి. రామకృష్ణారావు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగం, గృహ నిర్మాణ రంగంపై జిఎస్‌టి పన్నును 5 శాతానికే పరిమితం చేస్తే బావుంటుందన్నారు. సొంతింటి కలను సాకారం చేసుకోవాలనుకునే పౌరులకు జిఎస్టి దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐసిజిఎం స్వామినాథన్, క్రెడాయ్ ప్రతినిధులు ఆదిత్య గౌర, ఆనంద్ రెడ్డి, డా. ఎంఎస్ ఆనంద్ రావు, డి. మురళీకృష్ణారెడ్డి, కె. రాజేశ్వర్, సిజి. మురళీ మోహన్, వి. రాజేశ్వర్ రెడ్డి, బిల్డర్లు, డెవలపర్లు, స్టేక్ హోల్డర్లు పాల్గొన్నారు.





కుప్పకూలిన అమెరికా మార్కెట్లు

- స్టీలు, అల్యూమినియంపై దిగుమతి సుకం పెంపు ప్రభావం
- ట్రంప్ ప్రకటనతో ప్రపంచ మార్కెట్లలో భయాందోళనలు




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివాదాస్పద నిర్ణయాలతో ఇతర దేశాలకు సమస్యలు సృష్టిస్తూ.. సంబంధాలు తెంచుకుంటున్నారు. ఆయన చేసిన తాజా ప్రకటన ప్రపంచ మార్కెట్లను భయాందోళనలకు గురిచేస్తోంది. అమెరికాలోకి దిగుమతి అయ్యే స్టీల్‌పై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకాలను విధించనున్నట్టు ప్రకటించారు. వచ్చే వారమే కొత్త పన్నులు అమల్లోకి వస్తాయని చెప్పారు. దీంతో అమెరికా, ఆసియా స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. గురువారం రాత్రి యూఎస్ డౌజోన్స్, ఎస్ అండ్ పి ఒకటిన్నర శాతం మేర పడిపోయాయి. ఆసియాకు చెందిన స్టీల్ ఉత్పత్తి కంపెనీలు పోస్కో, నిప్పన్‌లు 4 శాతం వరకు క్షీణించాయి. ప్రపంచీకరణ, స్వేచ్ఛా విపణి సిద్ధాంతాలను ప్రచారం చేస్తూ వచ్చిన అమెరికా ఉన్నట్లుండి రక్షణాత్మక ధోరణుల వైపు మొగ్గు చూపడంపై ఇతర దేశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

చైనా, యూరప్‌తో సంబంధాలకు విఘాతం

అమెరికా సంస్థలను రక్షించేందుకు స్టీలు, అల్యూమినియంపై దిగుమతి పన్ను పెంచాలని డోనాల్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో ఇతర దేశాలతో సంబంధాలు దెబ్బతినే అవకాశాలు కనిపిస్తున్నాయి. చైనా, యూరప్, పొరుగుదేశం కెనడా వంటి ప్రధాన వాణిజ్య భాగస్వాములతో సంబంధాలు ప్రమాదంలో పడ్డాయి. వచ్చే వారం కొత్త పన్నులు అమల్లోకి వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఇంకా కొన్ని వివరాలను వెల్లడించనున్నట్టు వైట్‌హౌస్ అధికారులు తెలిపారు. ఈ దిగుమతి సుంకంతో అమెరికాలో ఉద్యోగాలు సురక్షితంగా ఉంటాయని ట్రంప్ భావిస్తున్నారని.. అయితే దీనికి విరుద్ధంగా ఫలితాలు ఉండనున్నాయని ఆర్థికవేత్త చెబుతున్నారు. ట్రంప్ నిర్ణయంతో ధరల ప్రభావం స్టీలు, అల్యూమినియం వినియోగదారులకు పడనుందని.. వాహన, చమురు పరిశ్రమల్లో ఉపాధి తగ్గిపోనుందని అంటున్నారు. స్టీల్, అల్యూమినియం సుంకం పెంపుతో దిగుమతులు ప్రియమవుతాయని, ఇది ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని చెబుతున్నారు. ఇది అధిక వడ్డీ రేట్లకు ఊతమిస్తుందని వివరిస్తున్నారు. ట్రంప్ ప్రకటన నేపథ్యంలో అమెరికా స్టాక్ మార్కెట్లు మరోసారి భారీగా పతనమయ్యాయి. ఈ ప్రభావం దేశీయంగా సోమవారం కనిపించే అవకాశమున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

దేశీయ మార్కెట్లపై ప్రభావం

ట్రంప్ తాజా నిర్ణయంతో అమెరికా, ఆసియా స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. గురువారం రాత్రి యూఎస్ డౌజోన్స్, ఎస్ అండ్ పి ఒకటిన్నర శాతం మేర పడిపోయాయి. ఈ ప్రభావం దేశీయంగా సోమవారం కనిపించే అవకాశమున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. గత వారం దేశీ స్టాక్‌మార్కెట్లు స్వల్ప నష్టాలతో ముగిశాయి. గురువారం విడుదల చేసిన జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) 7.2 శాతం వృద్ధిని సాధించి గణాంకాలు ఆశావహంగా ఉన్నా.. మార్కెట్లలో ఉత్సాహం కనిపించలేదు. అయితే ద్రవ్యలోటు ఈ ఏడాది తొలి 9 నెలల్లో 114 శాతానికి చేరి ఆందోళన పరిచింది. అమెరికాలో వడ్డీ రేట్ల పెంపు ఆందోళనలు, బ్యాంకింగ్ షేర్ల అమ్మకాలు ఒత్తిడి నెలకొంది. మార్కెట్లు బలహీనపడినప్పటికీ చిన్న షేర్లలో డిమాండ్ కనిపించింది. దీంతో బిఎస్‌ఇలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.6 శాతం స్థాయిలో పుంజుకున్నాయి. శుక్రవారం హోలీ సందర్భంగా స్టాక్‌మార్కెట్లకు సెలవుకావడంతో ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితమైంది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు సెన్సెక్స్ మొత్తంగా 95 పాయింట్లు(0.3 శాతం) నష్టపోయి 34,047 వద్ద ముగిసింది.



మరోసారి పతనం అవుతాయా?

ఈ ఏడాదిలో నాలుగు సార్లు వడ్డీ రేట్ల పెంపు సంకేతాలిచ్చిన ఫెడ్



న్యూఢిల్లీ: మరోసారి అంతర్జాతీయంగా మార్కెట్లు భారీగా పతనం కానున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీని కారణం ఈఏడాదిలో అమెరికా వడ్డీ రేట్లు 4 సార్లు పెంచే అవకాశం ఉందని ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలివ్వడమే అని అంటున్నారు. పావెల్ చెప్పినట్టుగానే వడ్డీ రేట్లు పెంచినట్లయితే ఆసియా స్టాక్ సూచీలు మరోసారి పతనం అవుతాయని గోల్డ్‌న్ సాచ్స్ అభిప్రాయపడింది. ఫెడ్ నూతన చైర్మన్ మంగళవారం చేసిన వ్యాఖ్యలు.. వడ్డీ రేట్ల విషయంలో స్పష్టమైన ప్రణాళికను కల్గి ఉన్నారని సూచిస్తోంది. పావెల్ సంకేతాలిచ్చినప్పటి నుంచి మార్కెట్లు వారాంతం వరకు నష్టాలను నమోదు చేశాయి. పావెల్ సూచనప్రాయ నిర్ణయం వెల్లడైన తరువాత ఆసియా మార్కెట్ సూచీ అయిన ఎంఎస్‌సిఐ ఆసియా పసిఫిక్ సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఈ సూచీ 1.7 శాతం నష్టపోయింది. మరోవైపు జపాన్ టాపిక్స్ ఇండెక్స్ 2.8 శాతం నష్టపోయిందని గోల్డ్‌న్ సాచ్స్ తెలియజేసింది. అమెరికా వడ్డీ రేట్లు పెంచితే వర్ధమాన దేశాల్లో మార్కెట్లలో అలజడి మొదలవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రప్ వివాదాస్పద నిర్ణయం స్టీలు, అల్యూమినియంపై దిగుమతి సుంకం పెంపు.. దీంతో అటు యుఎస్ మార్కెట్లనే కాకుండా ప్రపంచ మార్కెట్ల పతనానికి దారితీసే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు.

స్మాల్ క్యాప్స్‌లో కనీసం పదేళ్ల పెట్టుబడి

మలబార్ ఇన్వెస్ట్‌మెంట్ నిపుణుడు సుమీత్ నగర్

న్యూఢిల్లీ: మార్కెట్లో ఒడిదుడుకులు ఎలా ఉన్నప్పటికీ.. స్మాల్ క్యాప్‌లో దీర్ఘకాలం ఇన్వెస్ట్‌మెంట్ కొనసాగిస్తే మంచి రాబడి ఉంటుందని నిపుణులు అంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే 2018లో స్టాక్‌మార్కెట్ నుంచి రాబడి మోస్తరుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. మలబార్ ఇన్వెస్ట్‌మెంట్స్ నుంచి సుమీత్ నగర్ మాట్లాడుతూ.. గతేడాదిలో 15 బిలియన్ డాలర్ల విలువ చేసే ఆస్తుల నిర్వహణ చేపట్టామన్నారు. చిన్న వ్యాపారాలపై పెట్టుబడులు విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. పెరుగుతున్న అలలతో అన్ని పడవలు, లీక్ అవుతున్న పడవలు కూడా ఎగసి పడతాయని బ్లూమ్‌బర్గ్ క్వింట్ ప్రత్యేక సిరీస్ ఆల్ఫా మొఘల్స్ కార్యక్రమంలో ఆయన అన్నారు. అంతర్జాతీయంగా అమ్మకాల ఒత్తిడి, ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ దీర్ఘకాలిక ఈక్విటీ లాభాలపై పన్ను విధింపు వంటి అంశాలతో ఈ ఏడాది ప్రారంభం నుంచి భారత్ మార్కెట్లు భారీగా పతనమవుతూ వస్తున్నాయి. బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 0.5 శాతం మేరకు పుంజుకున్నప్పటికీ ఎస్ అండ్ పి, బిఎస్ఇ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 5 శాతానికి పైగా పతనమయ్యాయి. ఆసియా మార్కెట్లతో పోలిస్తే దేశీయ సూచీలు ఏడాది గరిష్ఠ స్థాయిలో పిఇ ఉందని నిపుణులు అంటున్నారు. స్టాక్ ధర ప్రదర్శనను అధిగమించి లాభాలను ఇచ్చే అవకాశం ఉంద, ఇది విలువ స్థాయికి తీసుకువస్తుందని నగర్ అన్నారు. ప్రధాన సెంట్రల్ బ్యాంక్‌ల నుంచి లాభాల పెరుగుదల, లిక్విడిటీ రివర్సల్ ఇన్వెస్టర్లను పరీక్షిస్తాయి. స్మాల్ అండ్ మిడ్ క్యాప్‌లో పెట్టుబడులు బెంచ్‌మార్క్ సూచీలకు దోహదం చేస్తాయని ఆయన అన్నారు. అయితే మదుపర్లు దీర్ఘకాలిక పెట్టుబడి దృక్పథంతో అడుగువేయాలని, ఎందుకంటే అలాంటి కంపెనీలు మెరుగయ్యేందుకు కొంత కాలం తీసుకుంటుందని పేర్కొన్నారు.

మలబార్ ఇన్వెస్ట్‌మెంట్స్ రెండింటిలో.. సఫారీ ఇండస్ట్రీస్ లిమిటెడ్, హట్సన్ అగ్రో లిమిటెడ్‌లో పెట్టుబడులు పెట్టిందని నగర్ తెలిపారు. వీటిని 10 నుంచి 20 ఏళ్ల వరకు హోల్డ్ చేసి ఉంచాలని అంటున్నారు. స్టాక్‌ల ఎంపికలో నగదు లభ్యత, వ్యాపార నాణ్యత, ప్రమోటర్ల నాణ్యత ఎంతో కీలకమని అన్నారు. ప్రమోటర్లు వ్యాపార నడిపేతీరు, వారి జ్ఞానం, సామర్థ్యాలు, అనేక అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



ప్రకృతి వైపరీత్యాల హెచ్చరిక కేంద్రం ఏర్పాటు

మన తెలంగాణ/ హైదరాబాద్ : భూకంపాలు, పిడుగులు, మెరుపులు లాంటి ప్రకృతి వైపరీత్యాలవల్ల జరుగుతున్న నష్టాన్ని నివారించే ఉద్దేశంతో ముందుగానే కనిపెట్టే విధంగా హెచ్చరికా కేంద్రాలను నెలకొల్పడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రెవిన్యూ శాఖలోని విపత్తుల విభాగం అధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో శుక్రవారం సమావేశమై దీని గురించి లోతుగా చర్చించారు. అనంతరం ఏడుగురితో కూడిన ఒక కమిటీని నియమిస్తూ నిర్ణయం జరిగింది. 'ఎర్త్‌క్వేక్ ఆన్‌సైట్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్' పేరుతో ఏర్పాటయ్యే ఈ కేంద్రం కేవలం భూకంపాలను మాత్రమే కాకుండా మెరుపులు, పిడుగులు లాంటి ప్రకృతి వైపరీత్యాలను సైతం ముందుగానే పసిగట్టి ప్రజలను అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడానికి ఆస్కారం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో కీలకమైన ప్రాంతాలతో పాటు ఎత్తయిన కట్టడాలు, భవనాలు ఉన్న ప్రాంతాల్లో ఈ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి లోతైన అధ్యయనం చేసి వివరాలు సమర్పించాలని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేయడంతో పాటు శనివారం ఈ కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి అధ్యక్షుడిగా వ్యవహరించే ఈ కమిటీలో విపత్తు నిర్వహణ విభాగం ముఖ్య కమిషనర్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ సహా పలు విభాగాల అధికారులున్నారు.



ఈశాన్య ఓట్ల లెక్కింపు నేడే!

- త్రిపుర ఫలితంపై అన్ని పార్టీల్లో టెన్షన్

అగర్తల/కోహిమా/షిల్లాంగ్: ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మేఘాలయా, త్రిపురల్లో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కట్టుదిట్టమైన భద్రత మధ్య శనివారం ఓట్ల లెక్కింపు జరుగుతుంది. త్రిపురలో ఫిబ్రవరి 18న, మేఘాలయా, నాగాలాండ్‌లలో ఫిబ్రవరి 27న పోలింగ్ జరిగింది. ఈ మూడు రాష్ట్రాల్లోనూ 60 చొప్పున అసెంబ్లీ స్థానాలున్నాయి. అయితే వేర్వేరు కారణాల వల్ల మూడింటిలోనూ 59 స్థానాలకే పోలింగ్ జరిగింది. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఫలితాల నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ మూడు రాష్ట్రాల్లో బిజెపి సమర్థమైన పోటీదారుగా నిలిచింది. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష ప్రభుత్వానికి చరమగీతం పలికి బిజెపి అధికారాన్ని సాధిస్తుందని రెండు




ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయగా, మిగతా రెండు రాష్ట్రాల్లో కూడా అధికారాన్ని చేజిక్కించుకునేలా పరిస్థితులున్నాయని వెల్లడించాయి. అదే విధంగా మేఘాలయలో కాంగ్రెస్ పార్టీ గత పదేళ్లుగా అధికారంలో ఉంది. 2008లో మూడు నెలల రాష్ట్రపతి పాలనను మినహాయిస్తే నాగాలాండ్‌లో పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌ఎఫ్‌పి) 2003 నుంచి పాలిస్తోంది. అయితే, అసోం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌లలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన బిజెపి కొత్తగా ఈ రాష్ట్రాల్లోనూ అధికారాన్ని చేజిక్కించుకునేందుకు యత్నిస్తోంది. కాగా, ఎగ్జిట్ పోల్స్ మాత్రం బిజెపివైపే మొగ్గుచూపుతున్నాయి. త్రిపురలో వామపక్షాలను గద్దె దించి బిజెపి అధికారంలోకి వస్తుందని చెబుతున్నాయి. ఇక నాగాలాండ్‌లో బిజెపి–ఎన్‌డిపిపి కూటమి గెలిచే అవకాశాలున్నాయని చెప్పాయి. మేఘాలయలో హంగ్ ఏర్పడుతుందని.. అయితే అక్కడ కూడా బిజెపి తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోబోతోందని వెల్లడించాయి. ఇప్పటికే అసోం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో అడుగుపెట్టి చరిత్ర సృష్టించిన బిజెపి.. ఈ మూడు రాష్ట్రాలతో ఈశాన్యంలోనూ విస్తరించాలని చూస్తోంది. అందుకు తగ్గట్లుగా వ్యూహాలతో ముందుకు సాగుతోంది.

చైనా అధ్యక్షుడి పదవీ ఆంక్షల ఎత్తివేత

- కీలక అజెండాతో పార్లమెంట్ భేటీ

బీజింగ్: చైనా అధ్యక్షులు జి జిన్‌పింగ్ పదవీకాలపరిమితిని పెంచే ప్రక్రియ వేగవంతం అయింది. దేశాధ్యక్ష పదవిలో రెండు కన్నా ఎక్కువ సార్లు ఉండరాదనే ఆంక్షలను తొలిగించేందుకు రంగం సిద్ధం అయింది. చైనా పార్లమెంట్ వార్షిక పార్లమెంట్ సమావేశాలు శుక్రవారం నుంచి మొదలు అయ్యాయి. ఈ సందర్భంగా జిన్‌పింగ్ పదవీకాల పరిమితిని పెంచే చర్యకు ఆమోదం దక్కుతుందని భావిస్తున్నారు. ఈ ప్రక్రియ దశలో చైనా అధ్యక్షులు వినూత్న రీతిలో నలుగురు ఉప ప్రధానులను నియమించేందుకు సన్నాహాలు చేపట్టారు. దేశంలో బయటా తన ప్రతిష్టను పెంచుకునేందుకు భారీస్థాయిలో తలపెట్టిన పలు కార్యక్రమాల అమలు బాధ్యతలను ఈ ఉప ప్రధానులకు అప్పగించనున్నారు. పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక వ్యవస్థ పటిష్టత వంటి కార్యక్రమాల పర్యవేక్షణకు వేర్వేరుగా ఈ ఉప ప్రధానులను నియమించనున్నట్లు వెల్లడైంది. దేశంలో చేపట్టిన అవినీతి నిరోధక చర్యలతో పాటు వీటిని కూడా ఉద్యమరీతిలో అమలు చేయడం వల్ల చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) ప్రతిష్ట పెరుగుతుందని, జనబాహుళ్యంలో తన అధికార వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని జిన్‌పింగ్ విశ్లేషిస్తున్నారు. కేవలం తన పదవీకాల పరిమితిని పెంచుకోవడం ఇందుకు ఏకంగా రాజ్యాంగంలోని అధ్యక్ష పదవీకాల పరిమితిని ఎత్తివేసే చర్యతో విమర్శలు తలెత్తుతాయని భావిస్తున్నారు. పార్లమెంట్ భేటీ నేపథ్యంలోనే నలుగురు ఉప ప్రధానుల నియామకంపై ఊహాగానాలు తీవ్రం అయ్యాయి. చైనాలో ఇప్పుడు ఇద్దరు ఉప ప్రధానుల వ్యవస్థ ఉంది. దేశాధ్యక్షుడికి విస్తృతాధికారాలు కట్టబెట్టడం, పదవీకాల ఆంక్షలను ఎత్తివేస్తూ సిపిసి తీర్మానించడంతో జిన్‌పింగ్ ఆధునిక చైనాలో తిరుగులేని నేతగా ఎదిగే పరిస్థితి ఏర్పడింది. పార్టీ వ్యవస్థాపకులు మావో జెడాంగ్ చైనా విప్లవం సమయంలో చేపట్టిన అధికారాలకు సమానంగా అంతకు మించిన స్థాయిలో ఇప్పుడు జిన్‌పింగ్‌కు సంక్రమించాయని విశ్లేషణలు వెలువడుతున్నాయి. వచ్చే రెండు వారాలలో కీలకమైన చైనా పీపుల్స్ రాజకీయ సలహాసంప్రదింపుల సమాఖ్య (సిపిపిసిసి), జాతీయ ప్రజా మహాసభ (ఎన్‌పిసి) సమావేశం కానున్నాయి. ఇందులో చైనా కమ్యూనిస్టు పార్టీకి కీలక సలహా మండలిగా సిపిపిసిసి వ్యవహరిస్తూ ఉండటంతో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. చైనా అధ్యక్షులు చేపట్టిన పలు జన బాహుళ్య కార్యక్రమాలకు ఈ సమావేశాలలో ఆమోదం దక్కుతుందని భావిస్తున్నారు. పదవీకాలాన్ని పెంచుకోవడమే కాకుండా ప్రజలలో ప్రతిష్టను ఇనుమడిపచేసుకోవడానికి జిన్‌పింగ్ ద్విముఖ రీతిలో సాగుతున్నారు. సిపిపిసిసి ప్రతినిధి వాంగ్ గ్యావోఫింగ్ శుక్రవారం జాతీయ స్థాయిలో టీవీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనేక ప్రాంతాల నుంచి వచ్చిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. పేదరిక నిర్మూలన, అవినీతి నిరోధక చర్యలు తాజాగా స్టీల్, అల్యూమినియంపై అమెరికా విధించిన దిగుమతి సుంకాల వంటి అంశాలపై చైనా అధికారిక మీడియా నుంచి ప్రశ్నలు వెలువడ్డాయి. వీటికి సలహా మండలి ప్రతినిధి తగు జవాబులిచ్చారు. అయితే దేశ అధ్యక్షుడి పదవీకాల ఆంక్షల తొలిగింపు వంటి అంశాలు ఈ సందర్భంగా



ప్రస్తావనకు రాలేదు. సిపిసి ప్రతిపాదనలకు అనుగుణంగానే చైనా పార్లమెంట్ ఆమోదం దక్కుతుందని భావిస్తున్నారు. వచ్చే కొద్ది వారాలలో పలువురు మంత్రులు వివిధ అంశాలపై మీడియాతో మాట్లాడుతారని , తీసుకోబోయే పలు చర్యలను ప్రజలకు వివరిస్తారని వెల్లడైంది. ఇది ఇలా ఉండగా సిపిసికి చెందిన ప్రాబల్య స్థాయీ సంఘంలోని ఏడుగురు సభ్యులను కూడా మార్చే అవకాశం ఉంది. దేశాధ్యక్షులు జి , ప్రధాని లీ కెక్వియాంగ్ మినహా ఇతర సభ్యుల పదవీకాలం ముగిసింది. దీనితో వారి స్థానంలో కొత్త వారిని నియమించేందుకు జిన్‌పింగ్ ఏర్పాట్లు చేస్తున్నారని తన అనుకూలురులను గుర్తించారని హాంగ్‌కాంగ్ పత్రిక సౌత్ చైనా మార్నింగ్ పోస్టు తెలిపింది.

రోడ్డు ప్రమాదాల్లో 11 మంది మృతి

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్‌లో గురువారం రాత్రి రెండు వేర్వేరు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనల్లో 11 మంది దుర్మరణం పాలయ్యారు. మరో ఏడుగురు క్షతగాత్రులైనట్లు పోలీసులు వెల్లడించారు. యాత్రికులు కారులో ప్రయాణిస్తుండగా, ఛండీగఢ్–మనాలీ జాతీయ రహదారిపై ఉన్న స్వర్‌ఘాట్‌కు 8 కిలోమీటర్ల దూరంలో కారు అదుపు తప్పి లోయలో పడిపోయిందని, ఈ ప్రమాదంలో 8 మంది యాత్రికులు మృత్యువాత పడగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారన్నారు. వారంతా మణికరన్ నుంచి అమృత్‌సర్‌కు తిరిగి కారులో వస్తుండగా డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో అదుపుతప్పి లోయలో పడిందని డిఎస్‌పి అనిల్ శర్మ చెప్పారు. ఏడుగురు యాత్రికులు అక్కడికక్కడే మరణించగా, మరో వ్యక్తి నాలాగఢ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బిలాస్‌పూర్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. మరో సంఘటనలో రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన బస్సు, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో దంపతులు సహా ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఆరుగురు గాయపడ్డారు. బస్సు బిర్ బిల్లింగ్ నుంచి ఢిల్లీకి వెళ్తుండగా, 10 మంది కారులో హరిద్వార్‌కు వెళ్లి కంగ్రాలోని ఫతేపూర్‌కు తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను ఉనాలోని ఆసుపత్రికి తరలించగా, నలుగురు పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని ఛండీగఢ్‌లోని పిజిఐకి రిఫర్ చేసినట్లు వారు పేర్కొన్నారు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

భారత వజ్రాల వ్యాపారులపై దాడి



పారిస్: భారతీయ వజ్రాల వ్యాపారులను పారిస్‌లో దొంగలు దోచుకున్నారు. ఇద్దరు వ్యాపారుల నుంచి 3,70,000 డాలర్ల విలువైన వజ్రాలను దోచుకున్నారు. పారిస్ మెట్రో స్టేషన్ ద్వారం వద్ద ఈ ఘటన జరిగింది. భారత్ నుంచి వచ్చిన వ్యాపారులు స్థానికంగా వ్యాపార లావాదేవీలు ముగించుకుని , మెట్రోస్టేషన్ లోపలికి వెళ్లుతుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వారిపై దాడి చేసి , చేతుల్లోని బ్యాగుతో ఉడాయించారని విచారణలో వెల్లడైంది. రెండు మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనపై ఇప్పుడు వివరాలు వెల్లడయ్యాయి. వ్యాపారుల బ్యాగులో అత్యంత విలువైన ఖనిజాలను ఉన్నాయని , అయితే ఇవి వజ్రాలు కావని దర్యాప్తు క్రమంలో శుక్రవారం వెల్లడించారు. డైమండ్ వ్యాపారం భారీగా సాగే నైన్త్ అరోన్‌డిసెమెంట్ ప్రాంతంలో జరిగిన ఈ దోపిడి ముందస్తు వ్యూహంతో సాగిన చర్యగా అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కొద్ది సంవత్సరాలుగా పారిస్‌లో భారీ స్థాయిలో వజ్రాలు నగల దోపిడి జరుగుతోంది. జనవరిలోనే స్థానిక రిట్జ్ హోటల్ దిగువ అంతస్తులో ఉండే నగల షాపును దోచుకునేందుకు దుండగులు విఫల యత్నం చేశారు. చోరీసొత్తుతో పరారు అవుతున్న దశలో డోర్లు లాక్ కావడంతో పట్టుబడ్డారు. దుండగులు ముగ్గురిపై కేసులు దాఖలు అయ్యాయి. రెండేళ్ల క్రితం అక్టోబర్‌లో యుఎస్ రియాల్టీ టీవీ స్టార్ నటి కిమ్ కర్దాషియాన్‌ను దుండగులు కట్టిపడేసి, రివాల్వర్‌తో బెదిరించి దోచుకున్నారు. పారిస్ ఫ్యాషన్ వీక్‌కు వచ్చిన దశలో ఈ ఘటన జరిగింది. కనీసం తొంభయి లక్షల యూరోల విలువైన నగలు, 40 లక్షల డాలర్ల విలువైన వాచీని లాక్కుని ముగ్గురు దుండగులు ఫరారయ్యారు.

బుర్కినాఫాసోలో ఉగ్రదాడి

వాగాడువో : పశ్చిమ ఆఫ్రికా దేశం బుర్కినా ఫాసోలో భీకర స్థాయిలో ఉగ్రవాదుల దాడి జరిగింది. శుక్రవారం ఉదయం రాజధాని వాగాడువోలోని సైనిక ప్రధాన కార్యాలయంపై టెర్రరిస్టులు జరిపిన దాడిలో కనీసం 28 మంది మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. భద్రతా వర్గాలు, ఫ్రాన్స్, పశ్చిమ ఆసియాలోని అధికారిక వర్గాల సమాచారం మేరకు ఉగ్రదాడి నిర్ధారణ అయింది. ఉదయం నుంచి చాలా సేపటి వరకూ మిలిటరీ ప్రధాన స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులు జరిపారు. ఉగ్రవాదులు అక్కడి ఫ్రెంచ్ రాయబార కార్యాలయాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు సాగించినట్లు వెల్లడైంది. ఒక వాహనంలో దూసుకువచ్చిన టెర్రరిస్టులు కాల్పులకు, బాంబు దాడులకు పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఏకకాలంలోనే ఆర్మీ ప్రధాన కార్యాలయం, ఫ్రాన్స్ ఎంబసీపై దాడులు జరగడంతో నగరంలో భయానక పరిస్థితి ఏర్పడింది. ఎక్కడైనా దాడులు జరగవచ్చునని, ప్రజలంతా సురక్షిత ప్రాంతాలలో తలదాచుకోవాలని హెచ్చరికలు జారీ అయ్యాయి. దాడులతో అప్రమత్తులైన సైన్యం ఎదురుకాల్పులకు దిగింది. ఉగ్రవాదులను మట్టుపెట్టేందుకు యత్నిస్తోంది. దీనితో వీధుల్లో పోరు వాతావరణం నెలకొంది. ఆరుగురు ఉగ్రవాదులను సైన్యం మట్టుపెట్టినట్లు నిర్ధారణ అయింది. ఫ్రాన్స్ రాయబార కార్యాలయం వద్ద నలుగురు, సైనిక స్థావరం వద్ద ఇద్దరు మృతులు అయినట్లు వెల్లడైంది. అయితే ఏడుగురు భద్రతా సిబ్బంది వారు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఫ్రాన్స్ రాయబార కార్యాలయ సిబ్బంది సురక్షితంగా ఉందని వెల్లడైంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని ప్రభుత్వం తరువాత తెలిపింది. బుర్కినా ఫాసో సమాచార మంత్రి రెమిస్ ఫల్గెన్స్ డండ్‌జినో టీవీలో ప్రసంగిస్తూ ఈ దాడిని భీకర ఉగ్రవాద చర్యగా ఖండించారు. మృతులు 15 మంది అని, 75 మందికి పైగా గాయపడ్డారని వైద్య ప్రధానాధికారి కల్నల్ అమాడో కఫండో తెలిపారు. టెర్రర్ దాడి గురించి అమెరికా రాయబార కార్యాలయ వర్గాటు కూడా నిర్ధారించాయి.

ఆయుధ సంపన్నులం మేమే

- మా అణ్వాయుధాలు ఏ లక్ష్యాన్నయినా ఛేధించగలవు
- ఏ రక్షణ వ్యవస్థనైనా నిర్వీర్యం చేయగలం : పుతిన్

మాస్కో: రష్యా అధ్యక్షుడు పుతిన్ కొత్త అణ్వాయుధాలను ఆవిష్కరించారు. ప్రపంచంలోని ఏ ప్రాంతాన్నైనా, ఏ లక్ష్యాన్ని ఛేదించగలవని, వాటిని ఏ రక్షణ వ్యవస్థ కూడా ఛేధించలేదని స్పష్టం చేశారు. అధ్యక్ష ఎన్నికలకు కొద్ది వారాల ముందు ఆయన ఈ చర్యకు ఉపక్రమించడం చర్చనీయాంశమైంది. ఏ దేశం వద్దా లేని క్షిపణులను రష్యా అభివృద్ధి చేసిందన్నారు. ఫెడరల్ అసెంబ్లీని ఉద్దేశించి గురువారం పుతిన్ కదనోత్సాహంతో మాట్లాడారు. రష్యా భాగస్వామ్య పక్షాలపై జరిగే ఎటువంటి అణుదాడినైనా తాము రష్యాపైన దాడిగానే భావిస్తామని, తక్షణ ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించారు. దీనిపై ఎవరికీ ఎటువంటి సందేహాలు అవసరం లేదన్నారు. పుతిన్ ప్రసంగం సందర్భంగా భారీ తెరపై కొత్త క్షిపణుల్లో కొన్నింటి వీడియో క్లిప్‌లను ప్రదర్శించారు. పుతిన్ ముఖ్యంగా ఈ వేదిక నుంచి రెండు అణుసామర్థ్య ఆయుధాల గురించి వివరించారు. ఒకటి హైపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి, మరొకటి జలాంతర్గామి నుంచి ప్రయోగించే దీర్ఘ శ్రేణి క్షిపణి. 2017లో విజయవంతంగా పరీక్షలు పూర్తి చేసుకున్న క్రూయిజ్ క్షిపణి ప్రపంచంలో ఎక్కడి లక్ష్యాన్నైనా ఛేదించగలదని పుతిన్ తెలిపారు. అణుశక్తితో దూసుకెళ్లే ఈ అణ్వాయుధం ప్రపంచంలోని ఏ రక్షణ వ్యవస్థలనయినా నిర్వీర్యం చేయగలదన్నారు. తక్కువ ఎత్తులో దూసుకెళ్లే దీన్ని గుర్తించడం కష్టమని, అణుపేలోడ్‌ను మోసుకెళ్తుందని చెప్పారు. ఈ ఆయుధం క్షిపణి నిరోధక వ్యవస్థలకు దొరకదని, క్షిపణి రక్షణ, గగన రక్షణ వ్యవస్థలకు సంబంధించి ప్రస్తుత, భవిష్యత్తు ఆయుధ వ్యవస్థల్లో ఇది అజేయమైనదని పేర్కొన్నారు. అమెరికా కొత్త అణ్వాయుధ సిద్ధాంతం పట్ల పుతిన్ ఆందోళన వ్యక్తం చేశారు. రష్యా సిద్ధాంతం రక్షణాత్మకమని, ఎవరైనా దాడి చేస్తే ప్రతిస్పందనగానే అణ్వాయుధాలను ఉపయోగించాలన్నది రష్యా విధానమని స్పష్టం చేశారు.





అమెరికా, జర్మనీ అసంతృప్తి : మరోవైపు పుతిన్ రష్యా అణ్వాయుద్ధ సంపత్తిని ప్రదర్శించడం పట్ల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, జర్మనీ చాన్సలర్ ఏంజెలా మెర్కెల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇరువురు నేతలు ఫోన్‌లో సంభాషించుకున్నారు. అంతర్జాతీయ ఆయుధ నియంత్రణ ప్రయత్నాలకు ఇలాంటి చర్యలు వ్యతిరేక ప్రభావాన్ని చూపిస్తాయని అభిప్రాయపడ్డారు.

నేరగాళ్ల బిల్లుపై కాంగ్రెస్ అసంతృప్తి

న్యూఢిల్లీ : ఆర్థిక అవకతవకలకు పాల్పడడమే కాకుండా అలాంటి వారి ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఉద్దేశించిన పరారీ నేరగాళ్ల బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేయడంపై కాంగ్రెస్ పెదవి విరిచింది. కుంభకోణాలకు పాల్పడి దేశం విడిచి పారిపోయిన మాల్యా, నీరవ్ మోడీ లాంటి వారి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేంద్రం ఈ బిల్లును ఆమోదిస్తున్నట్టు ప్రకటించిందని కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ శుక్రవారంనాడు మీడియాతో మాట్లాడుతూ అన్నారు. దేశంలో ఇప్పటికే చాలా చట్టాలున్నాయని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చాలా మంది ఆస్తులను జప్తు చేసి కేసులు పెట్టిందని శర్మ గుర్తు చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై తీవ్ర స్థాయిలో ఆయన విరుచుకుపడ్డారు. దేశాని లూటీ చేసి దేశం విడిచి పారిపోయారని అన్నారు.

త్రిపుర మంత్రి ఖగేంద్ర కన్నుమూత



అగర్తలా : త్రిపుర రాష్ట్ర మత్స్య, సహకార శాఖమంత్రి ఖగేంద్ర జమాతియా(64) కన్నుమూశారు. శుక్రవారం ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో మృతి చెందినట్లు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పవిత్ర కర్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ(ఎం) తరుపున కృష్ణాపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఎన్నికలు ముగిసిన మరుసటి రోజే ఆయన అస్వస్థతకు గురికావడంతో అగర్తలాలోని గోవింద బల్లవ్ పంత ఆసుపత్రిలో చేరినట్లు పార్టీ అధికార ప్రతినిధి గౌతమ్ దాస్ చెప్పారు. రక్త క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయనను అక్కడి నుంచి ఫిబ్రవరి 25న ఢిల్లీలో ఎయిమ్స్‌కు తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూసినట్లు దాస్ చెప్పారు.

మేగజీన్ కవర్‌పేజీపై వివాదం



తిరువనంతపురం: శిశువుకు రొమ్ము పాలు అందిస్తున్న మోడల్ ముఖచిత్రాన్ని ప్రచురించినందుకు మలయాళ మ్యాగజైన్ గృహలక్ష్మిపై కేసు నమోదు అయింది. రొమ్ములపై ఆచ్ఛాదన లేకుండా ప్రముఖ మోడల్, నటి గిల్లూ జోసెఫ్ బిడ్డకు పాలిస్తున్నట్లుగా ఉండే ఫోటోతో తాజా సంచిక వెలువడింది. అయితే ఇది అసభ్యకరంగా ఉందని, పైగా పెళ్లికాని యువతి బిడ్డకు పాలిస్తున్నట్లుగా చూపే బొమ్మను ముఖచిత్రం చేయడం అనుచితం అని పేర్కొంటూ కేసు నమోదు అయింది. కొల్లాం కోర్టులో అడ్వకేట్ మాథ్యూ చేసిన ఫిర్యాదు మేరకు ఈ నెల 16న కేసు విచారణ జరుగుతుంది. మాతృభూమి పత్రిక అనుబంధ పత్రికగా గృహలక్ష్మి వెలువడుతోంది. కేసు దాఖలు కావడంపై మాతృభూమి అధికారి ఒకరు స్పందిస్తూ కేవలం చవకబారు ప్రచారం కోసం ఈ కేసు వేశారని అన్నారు. అయితే కేసుకు సంబంధించి కోర్టు నుంచి తమకు సమాచారం లేదన్నారు. ఈ పత్రికకు వ్యతిరేకంగా కొల్లాం కోర్టుతో పాటు కేరళ స్త్రీ శిశు హక్కుల కమిషన్‌లో కూడా ఫిర్యాదు దాఖలు అయింది. బహిరంగంగా పాలివ్వడం పట్ల ఉన్న అపోహలు మానుకోవాలనే ఇతివృత్తంతో ఇటీవల ఈ మ్యాగజైన్‌లో బ్రెస్ట్‌ఫీడింగ్‌పై ప్రత్యేక వ్యాసం ప్రచురించారు.

కశ్మీర్‌లో భారీ వర్షాలు

శ్రీనగర్ : కశ్మీర్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర ప్రాంతంలోని కుప్వారాలో ఏకంగా 25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. దీనితో జిల్లాలో రహదారులు జలమయం అయ్యాయి. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కశ్మీర్ లోయలోకి ముఖద్వారం వంటి ఖ్వాజిగండ్‌లో కూడా భారీ వర్షాలు కురిశాయి. గుమార్గ్‌లో 11 మిమిల వర్షపాతం నమోదు అయింది. శ్రీనగర్‌లో 5 మిమిల వర్షపాతం రికార్డు అయింది. కుప్వారా నుంచి తంగ్‌ధార్, మచిల్ వంటి మారుమూల ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలతో ఈ ప్రాంతంఅంతా చిత్తడిగా మారడంతో ముందుజాగ్రత్త చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ఫారెస్ట్ పోస్టుకు నిప్పంటించిన నక్సలైట్లు

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని మాండ్లా జిల్లాలో అటవీశాఖ పోస్టుకు నక్సలైట్లు నిప్పంటించారు. మోటినాలా పోలీసు స్టేషన్ పరిధిలోని లటావర్ దాదర్ గ్రామంలో ఉన్న ఫారెస్ట్ పోస్టుకు గురువారం రాత్రి నిప్పు పెట్టినట్టు బాలాఘాట్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజి) జి.జనార్ధన్ తెలిపారు. అయితే, ఈ ఘటనలోఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ఘటన జరిగిన వెంటనే అధికారులు అక్కడికి చేరుకున్నారని చెప్పారు. 'విస్తార్ దళ నక్సలైట్లు ఈ ఘటనకు పాల్పడినట్టు భావిస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. గత నెలలో రాష్ట్ర సరిహద్దుల్లో నక్సల్స్ కదలికలు కనిపించినట్టు ఆయన వెల్లడించారు.

యువకుడికి 50 కత్తిపోట్లు



న్యూఢిల్లీ : హోలీ వేడుకల్లో తలెత్తిన ఓ వివాదంతో రెచ్చిపోయిన బైకర్ల గ్యాంగు ఓ యువకుడిపై నిర్దాక్షిణ్యంగా దాడి చేసింది. కత్తులతో, రాడ్డులతో విరుచుకుపడి, 50 కత్తిపోట్లతో తీవ్రంగా గాయపర్చింది. వెంటనే యువకుడిని స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఢిల్లీలోని ఖాన్‌పూర్ ఏరియాలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. సిసి టివి ఫుటేజ్ ఆధారంగా గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆశిష్ అనే యువకుడు జిమ్ నుంచి ఇంటికి వెళ్తుండగా దుగ్గల్ కాలనీలోని ఓ ఇరుకైన రోడ్డులోకి బైకులపై వచ్చిన కొంత మంది అతనిపై విరుచుకుపడ్డారు. హోలీ సందర్భంగా వాటర్ బెలూన్లు విసరడంతో ఈ వివాదం నెలకొన్నట్టు తెలుస్తోంది. ఓ బాలుడిని వారు కొడుతుండగా, అడ్డుకోబోయిన ఆశిష్‌ను పదేపదే కత్తులతో పొడిచి, ఇనుప రాడ్డులతో మోదా రు. తీవ్రంగా గాయపడిన ఆశిష్ అక్కడికక్కడే కుప్పకూలడంతో ఆగంతకులు అక్కడ్నించి ఉడాయించారు. వాళ్లు వెళ్లిపోగానే స్థానికులు ఆశిష్‌ను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం 50 కత్తిపోట్లతో అతని పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

మిచిగాన్ వర్శిటీలో కాల్పులు

మౌంట్ ప్లీజెంట్ : సెంట్రల్ మిచిగాన్ యూనివర్శిటీలో శుక్రవారం జరిగిన కాల్పులలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. రెసిడెన్స్ హాల్‌లో దాడి జరిగింది, మృతులు విద్యార్థులు కారని, ఇతరులు అని వెల్లడైంది. కాల్పుల ఘటనతో అధికారులు వెంటనే క్యాంపస్‌ను మూసివేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. 19 ఏళ్ల యువకుడు ఒకరు సాయుధుడై క్యాంపస్‌లో చొరబడ్డాడని తెలియడంతో ఆ వ్యక్తి కోసం గాలిస్తున్నారు. నివాసిత ప్రాంతాల నుంచి కాల్పులు జరిగినట్లు వర్శిటీ వర్గాలు తెలిపాయి. సెలవులకు ముందు ఒకరోజు జరిగిన కాల్పుల ఘటనతో వర్శిటీలో ఆందోళన నెలకొంది.

స్విగ్గీ భోజనం ఆర్డరివ్వండి



న్యూఢిల్లీ: ఐఎన్‌ఎక్స్ మీడియా లంచం కేసు లో అరెస్టయిన కార్తి చిదంబరంను ఐదు రోజుల పాటు సిబిఐ కస్టడీకి అనుమతిస్తూ పాటియాల హౌస్ కోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. అనంతరం కార్తి తరపు న్యాయవాది ఆయనతో ఉదయం గంట సేపు, సాయంత్రం గంట సేపు మాట్లాడేందుకు అనుమతిచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు కార్తి మందులను తనతో తీసుకెళ్లవచ్చు కాని, ఇంటి భోజనం మాత్రం అనుమతించరు. అయితే, కస్టడీలో ఉన్న కార్తి ఎలాంటి కుయుక్తులైనా పన్నే అవకాశముందని మీడియా నివేదికలు పేర్కొంటున్నాయి. కస్టడీలో ఉన్న కార్తి అధికారులను ఆహారం ఆర్డర్ చేయడానికి స్విగ్గీ లేదా జొమాటోలను అడిగినట్టు తెలుస్తోంది. ఒకరోజు సిబిఐ కస్టడీ ముగిసిన అనంతరం గురువారం కార్తిని అధికారులను కోర్టులో హాజరు పర్చారు. ఈ సందర్భంగా కార్తి తల్లిదండ్రులు పి.చిదంబరం, నళిని, ఇద్దరు న్యాయవాదులు ఆయన వెంట కనిపించారు. అనంతరం ఐదు రోజుల సిబిఐ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఆదేశించగా 'ఆందోళన చెందకు, నేనున్నాను' అంటూ పి.చిదంబరం కుమారుడికి భరోసా ఇచ్చారు.

తల్లి మాటతో ఉగ్రవాదాన్ని వదిలేశాడు

శ్రీనగర్ : కశ్మీర్‌లోని ఉగ్రవాదుల ముఠాలో చేరిన ఓ బాలుడు తన తల్లి పిలుపు మేరకు తిరిగి వెనక్కి వచ్చేశాడు. 'కశ్మీరులో ఉగ్రవాదంలో చేరిన ఓ యువకుడు తన తల్లి మనోవేదనకు విలువనిచ్చి, తిరిగి ప్రధాన జీవన స్రవంతిలో చేరాడు' అని డిజిపి ఎస్.పి. వైద్ శుక్రవారం ట్విటర్‌లో పేర్కొన్నారు. 'విలపిస్తున్న తల్లి విజ్ఞప్తికి స్పందించిన మరో యువకుడు లోయలో హింసామార్గాన్ని వదిలిపెట్టి తిరిగి కుటుంబ జీవనంలోకి వచ్చేశాడు' అని ఆయన పేర్కొన్నారు. ఆ యువకుడితో కుటుంబ సభ్యులందరూ కలవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, వారికి శుభాకాంక్షలు తెలిపారు. అయితే, భద్రతా కారణాల రీత్యా ఆ బాలుడి వివరాలను మాత్రం పోలీసులు గోప్యంగా ఉంచారు. కాగా, 2017లో ఇదేవిధంగా నలుగురు యువకులు హింసామార్గాన్ని విడిచి, తమ కుటుంబాలతో కలిశారు.

మొసలి పొట్టలో మనిషి కాలు, చేయి



న్యూఢిల్లీ : ఇండోనేషియాలోని భారీ సైజులో ఉన్న మొసలి పొట్టలో మనిషి కాలు, చేయిని లభ్యమైంది. ఓ మనిషిని నమిలి మింగేయడానికి మొసలి ప్రయత్నించడంతో చనిపోయిన మనిషి భాగాలు పొట్టలో కనిపించినట్టు ఇండోనేషియా పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితం నదీతీరంలోని పామాయిల్ తోటలో పని చేసే కార్మికుడు ఆండీ ఆసో ఈరంగ్ కనిపించకుండా పోయాడు. అయితే, అతని కోసం గాలించగా మోటార్ సైకిల్, చెప్పులు మాత్రమే కనిపించాయి.ఈరంగ్ కోసం మరింతగా గాలిస్తుండగా కాలు, చేయి లేకుండా విగతజీవిగా పడివున్న శరీరం కనిపించింది. దీనికి సమీపంలోనే 20 అడుగుల పొడవున్న మొసలి కనిపించగా దాన్ని వెంటనే హతమార్చినట్టు పోలీసులు చెప్పారు.'మొసలిపొట్టలో ఎడమ చేయి, కాలు భాగాలు కనిపించా యి. ఇవి ఈరంగ్‌కు చెందినవిగానే భావిస్తున్నాం' అని పోలీసు అధికారి టెడీ రిస్టియావాన్ తెలిపారు. ఈరంగ్ నత్తలు పీతల వేట కోసం వెళ్లి, తిరిగి రాలేదని ఆయన భార్య తెలిపారు.




హింసను వీడితేనే తాలిబన్లతో చర్చలు

న్యూయార్క్ : శాంతి చర్చలు జరగాలంటే ముందుగా తాలిబన్లు హింసను వీడాలని అమెరికా స్పష్టం చేసింది. ఉగ్రవాద చర్యలకు దిగకుండా తాలిబన్లు ఉండాలని, ఆఫ్ఘనిస్థాన్ రాజ్యాంగానికి అనుగుణంగా వ్యవహరిచాలని అప్పుడే చర్చలకు మార్గం ఏర్పడుతుందని పెంటగాన్ అధికార ప్రతినిధి డానా వైట్ స్పష్టం చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌లో సంఘర్షణ నివారణకు ప్రత్యక్ష చర్చల గురించి ఇటీవల తాలిబన్లు ప్రతిపాదించారు. చర్చలకు ముందు బేషరుతుగా వారు హింసావాదం వీడాలని చట్ట పరిధిలో వ్యవహరిస్తే సంప్రదింపులకు వచ్చేందుకు వీలేర్పడుతుందని వైట్ తమ వారాంతపు విలేకరుల గోష్టిలో తెలిపారు. చర్చలు ప్రతిపాదనలు ఏ విధంగా ఉన్నా ఆఫ్ఘన్లకు శాంతి, వారికి రాజకీయ పరిష్కారం దక్కడం కీలకం అని ఆమె చెప్పారు. ఇక తాలిబన్లతో చర్చల ప్రక్రియకు ఇటీవలే ఆఫ్ఘన్ అధ్యక్షులు అష్రఫ్ గనీ చేపట్టిన చర్యలు , వాటి పురోగతి పట్ల అమెరికావిదేశాంగ శాఖ ప్రతినిధి హీటర్ నౌర్ట్ అభినందనలు తెలిపారు. ఆఫ్ఘన్లకు శాంతి ప్రసాదించేందుకు , సంక్షోభ నివారణకు తగు చర్యలు తీసుకోవడం హర్షదాయకం అని తెలిపారు. తాలిబన్లు ఇప్పటికైనా శాంతిప్రక్రియలో చేరి, దేశ రాజకీయ వ్యవస్థలో భాగం కావాల్సి ఉందని దీని వల్లనే సత్ఫలితాలు ఉంటాయని అమెరికా స్పందించింది.

ఉక్కుపై అమెరికా దిగుమతి సుంకం

- అల్యూమినియంపైనా విధింపు
- ప్రపంచ వాణిజ్య యుద్ధ సంకేతాలు
- చైనా, యూరప్‌ల ఆగ్రహం



వాషింగ్టన్ : స్వదేశీ ఉత్పత్తిదార్ల పరిరక్షణకు స్టీల్, అల్యూమినియంపై అమెరికా దిగుమతి సుంకాలను విధించనుంది. స్టీల్ దిగుమతులపై పాతిక శాతం, అల్యూమినియం దిగుమతులపై పది శాతం దిగుమతి సుంకాలను విధించనున్నట్లు అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ చర్య చైనా, యూరప్‌లతో అమెరికా వాణిజ్య యుద్ధానికి దారితీయనుంది. దేశంలోని ఉత్తత్తిదార్ల ప్రయోజనాల పరిరక్షణ తమకు కీలకం అని ఈ విధంగా ట్రంప్ మరోమారు తమ అమెరికా ప్రథమం నినాదం చాటారు. వచ్చేవారం ఈ ఇంపోర్ట్ టారిఫ్‌ల కార్యనిర్వాహక ఉత్తర్వులపై తాము సంతకాలు చేయనున్నట్లు ట్రంప్ తెలిపారు. అమెరికాకు చెందిన ఉక్కు, అల్యూమినియం కంపెనీల నిర్వహకులతో భేటీ తరువాత ట్రంప్ తమ నిర్ణయం ప్రకటించారు. ఇప్పటికే చాలా ఆలస్యం జరిగినట్లు ఉందని, చిరకాలం మీ ప్రయోజనాల పరిరక్షణ జరుగుతుందని ట్రంప్ వారికి హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఈ కంపెనీలను తిరిగి లాభాల బాటలోకి తీసుకోవాలని ఆశిస్తున్నాను...కోరుతున్నానని తెలిపారు. ఉత్పత్తిదార్లతో సమావేశం తరువాత ట్రంప్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమెరికాకు ఇంతకాలం ప్రాతినిధ్యం వహించిన వారు స్టీల్, అల్యూమినియంతో పాటు అన్ని రకాల పరిశ్రమలను దెబ్బతీశారని ట్రంప్ విమర్శించారు. గత పాలకుల పేర్లు పెట్టకుండా ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా పరిశ్రమలను రక్షించే బాధ్యతను విస్మరించారని తెలిపారు. కార్లు, ఆటోమొబైల్ ఈ విధంగా ఏ కంపెనీలను చూసినా తెలియని కారణాలతో అవన్నీ మెక్సికోకు తరలివెళ్లాయని, ఇప్పుడు ఏం చేయాలో తెలియని స్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. తరలివెళ్లిన మన పరిశ్రమలను తిరిగి మనం వెనక్కి రప్పించుకునేందుకు, ఆయా రంగాలను పరిపుష్టం చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని ట్రంప్ వెల్లడించారు. ప్రత్యేకించి ఇక్కడి అల్యూమినియం పరిశ్రమను కాపాడుకునేందుకు రంగం సిద్ధం అవుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే దిగుమతి సుంకాలను విధించనున్నట్లు తెలిపారు. ట్రంప్ ప్రకటన పట్ల స్వదేశీ స్టీల్,అల్యూమినియం ఉత్పత్తిదార్లుహర్షం వ్యక్తం చేశారు. అయితే ఈ నిర్ణయం అమెరికా ఆర్థిక వ్యవస్థను దారుణంగా దెబ్బతీస్తుందని ఇతర వర్గాల నుంచివిమర్శలు వెలువడ్డాయి. గ్లోబల్ ట్రేడ్ వార్‌కు ఈ నిర్ణయం దారితీస్తుందని వాల్‌స్ట్రీట్ జర్నల్ వ్యాఖ్యానించింది. ట్రంప్ ప్రకటన తరువాత పలు షేర్లు పతనం చెందాయి. అమెరికాకు స్టీల్ ఎగుమతి చేసే దేశాలలో చైనా 11వ స్థానంలో ఉంది.వాణిజ్య పరిరక్షణ చర్యలకు దిగడంలో అమెరికా సంయమనం పాటించడం మంచిదని చైనా స్పందించింది.అమెరికా చర్యను సాకుగా తీసుకుని ఇతర దేశాలు కూడా వ్యవహరిస్తే అంతర్జాతీయ స్థాయిలో వాణిజ్య వ్యవస్థ ప్రభావం పడుతుందని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి హ్యూవా ఛునియింగ్ బీజింగ్‌లో విలేకరులతో చెప్పారు. ఇక యూరప్‌లో కూడా విమర్శలు తలెత్తాయి. అంతర్జాతీయంగా వాణిజ్య చిచ్చుకు అమెరికా యత్నిస్తోందని యూరోపియన్ స్టీల్ అసోసియేషన్ విమర్శించింది.

ట్రేడ్‌వార్ మంచిదే : ట్రంప్

వాణిజ్య యుద్ధం మంచిదే అని అసలు వాణిజ్యంలో అవకతవకలతో కోట్లాది డాలర్ల నష్టం కన్నా ట్రేడ్‌వార్ మంచిదని ట్రంప్ స్పందించారు. స్టీల్ అల్యూమినియంపై సుంకాల పెంపుదల నిర్ణయం తరువాత అమెరికా గ్లోబల్ ట్రేడ్‌వార్‌కు దారితీసిందనే వ్యాఖ్యలపై ట్రంప్ ట్వీట్ చేశారు. వాణిజ్యంతో పోగొట్టుకోవడం కన్నా వాణిజ్య యుద్ధంలో గెలిచి లాభం పొందవచ్చు, వాణిజ్య యుద్ధం మంచిదని వ్యాఖ్యానించారు. సరైన పద్ధతులు లేకుండా ట్రేడ్ జరిగితే అంతా నష్టమే అని, ఇదే ట్రేడ్ వార్ సాగితే విజయం వరిస్తుందని ఆయన స్పందించడం కీలకంగా మారింది. పరోక్షంగా ఆయన తమ వ్యాఖ్యలతో చైనాను మరింతగా కవ్వించారు.

వైమానిక దాడుల్లో 14 మంది మృతి

బీరూట్ : టర్కీ జరిపిన వైమానిక దాడుల్లో కుర్దులకు మద్దతుగా సిరియా ప్రభుత్వం నియమించిన 14 మంది తిరుగుబాటు దారులు మృతి చెందారు. వాయువ్య అఫ్రిన్ ప్రాంతంలో టర్కీ తిరుగుబాటు దారుల నాయకత్వంలో పోరాడుతున్న కుర్దులకు సిరియా మద్దతిస్తోంది. టర్కీ సరిహద్దుల్లోని జమ్మా గ్రామంలో గురువారం రాత్రి జరిపిన వైమానిక దాడుల్లో ముగ్గురు కుర్దులు కూడా మరణించారని బ్రిటన్ కేంద్రంగా పనిచేస్తున్న సిరియా మానవ హక్కుల అబ్జర్వేటరీ పేర్కొంది. అఫ్రిన్ పట్టణం కుర్దిష్ పీపుల్స్ ప్రొటెక్షన్ యూనిట్స్ (వైపిజి) ఆధీనంలో ఉంది. ఈ పట్టణంపై గత కొంత కాలంగా సిరియన్ తిరుగుబాటు దారులు తమ పోరాటాన్ని ఉధృతం చేస్తున్నారు. అఫ్రిన్ అధికార ప్రతినిధి బిరు స్కూహస్కే మాట్లాడుతూ సిరియాతో సంబంధమున్న తిరుగుబాటు దారులను లక్ష్యంగా చేసుకుని టర్కీ దాడికి పాల్పడిందన్నారు. అయితే ఎంత మంది చనిపోయారో ఆయన స్పష్టం చేయలేదు. ఈ ఘటనలో ఎనిమిది మంది సైనికులు కూడా మృతి చెందినట్లు టర్కీ సైన్యం తెలిపింది.

అనుష్క 'పరి' సినిమాపై పాక్ నిషేధం



ఇస్లామాబాద్ : బాలీవుడ్ నటి అనుష్కా శర్మ కథానాయికగా నటించిన 'పరి' సినిమా ప్రపంచ వ్యాప్తంగా శుక్రవారం విడుదలైంది. అయితే పాకిస్థాన్ మాత్రం ఈ సినిమా విడుదలపై నిషేధం విధించింది. ఇస్లామిక్ విలువలకు వ్యతిరేకంగా,ముస్లిం మనోభావాలను కించపరచేలా సినిమా ఉందని, అందుకే పాక్ నిషేధించినట్టు 'ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' వార్తా కథనం ప్రచురించింది. ఖురాన్ సూక్తులతో కూడిన కొన్ని అభ్యంతరకర సన్నివేశాలు సినిమాలో చోటుచేసుకున్నాయంటూ పాకిస్థాన్ సెన్సార్ బోర్డు కూడా ఈ హారర్ చిత్రాన్ని నిషేధించినట్టు ఓ థియేటర్ యజమానిని ఉటంకిస్తూ పాకిస్థాన్ వార్తా సంస్థ జియో టివి తెలిపింది.

పాక్‌లో జర్నలిస్టు దారుణ హత్య

రావల్పిండి : పాకిస్థాన్‌లో దారుణం జరిగింది. రావల్పిండిలో జర్నలిస్టుగా పనిచేస్తున్న అంజుమ్ మునీర్ రాజాను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. స్థానిక ఉర్దూ డెయిలీ పత్రికలో అతను సబ్‌ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. మిలిటరీ హెడ్‌క్వార్టర్స్‌కు దగ్గర్లోనే ఈ దారుణం జరిగింది. హై సెక్యూర్టీ జోన్‌లో ఈ మర్డర్ జరగడం ఆందోళన కలిగిస్తున్నది. మోటర్‌సైకిల్‌పై వస్తున్న రాజాను అడ్డగించిన దుండగలు అతని మెడ, తలలో ఆరు బుల్లెట్లను దించారు. పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు. రాజాకు ఎవరూ శత్రువులు లేరని అతని మామయ్య తెలిపాడు. ఉగ్రవాదులే రాజాను చంపి ఉంటారని అనుమానిస్తున్నారు. పాక్ జర్నలిస్టు సంఘాలు ఈ హత్యను ఖండించాయి.

భారత శాస్త్రవేత్తకు భారీ గ్రాంటు

హుస్టన్ : క్యాన్సర్‌పై అపూర్వ పరిశోధనలు చేపట్టిన ఇండో అమెరికన్ సైంటిస్టు నవీన్ వరదరాజన్‌కు 11 లక్షల డాలర్ల గ్రాంటు ప్రకటించారు. భారతీయ సంతతికి చెందిన శాస్త్రవేత్త వరదరాజన్ యూనివర్శిటీ ఆఫ్ హుస్టన్‌లో మరో పరిశోధకుడు సంఘ్యూక్ ఛుంగ్‌తో కలిసి ప్రాణాంతక క్యాన్సర్ విశేష పరిశోధనలు చేపట్టారు. ఈ పరిశోధనలకు గుర్తింపుగా అమెరికాలోని క్యాన్సర్ ప్రివెన్షన్ అండ్ రిసర్చ్ ఇనిస్ట్యూట్ ఆఫ్ టెక్సాస్ (సిపిఆర్ఐటి) ఈ సహాయ నిధిని మంజూరు చేసింది. క్యాన్సర్ మూల కారణాలు, నివారణ చికిత్సలకు ఈ సంస్థ అమెరికాలో భారీ స్థాయిలో నిధులు సమకూరుస్తోంది. హుస్టన్ వర్సిటీలో ఓ బయోమాలిక్యులర్ ఇంజనీరింగ్ సహాయక ప్రొఫెసర్ అయిన వరదరాజన్ టి–సెల్ ఇమ్యూనోథెరపిలో విస్తృత పరిశోధనలు సాగించేందుకు ఈ నిధులను సమకూర్చారని ప్రకటనలో వెల్లడించారు.

అగ్ని ప్రమాదంలో 30మంది మృతి

బాకు: అజర్‌బైజాన్ రాజధాని బాకులోని ఔషధ పునరావాస కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 30 మంది మృతి చెందారు. శుక్రవారం తెల్లవారు జామున ఘటన చోటు చేసుకుందని ఎపిఎ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. అజర్‌బైజాన్ అత్యవసర మంత్రిత్వశాఖ, అగ్నిమాపక సిబ్బంది, సహాయక బృందాలు మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఆ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.

దలైలామాపై అభిప్రాయంలో మార్పులేదు: కేంద్రం

న్యూఢిల్లీ: టిబెట్‌కు చెందిన బౌద్ధమత గురువు దలైలామాపై తమ అభిప్రాయంలో ఎలాంటి మార్పులేదని శుక్రవారం ప్రభుత్వం తెలిపింది. ఆయన కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ అధికారులకు, సీనియర్ నేతలకు కేంద్రం ఆదేశాలు ఇచ్చిందని, చైనాతో సంబంధాలు మెరుగు పరిచేందుకు భారత్ ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటోదన్న వార్తల నేపథ్యంలో వివరణ ఇచ్చింది. దలైలామాపై తమ అభిప్రాయం స్పష్టమైంది, స్థిరమైందని ప్రభుత్వం పేర్కొంది. ఆయన గౌరవప్రదమైన ఆధ్యాత్మిక గురువు అని, భారత ప్రజలు ఆయనను ఎప్పుడూ గౌరవిస్తూనే ఉంటారని పేర్కొంది.భారత దేశంలో మతపరమైన కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు ఆయనకు అన్ని రకాల స్వేచ్ఛ ఉందని తెలిపింది. విదేశాంగ సెక్రటరీ, చైనా విదేశాంగ శాఖ మంత్రి, ఇతర అధికారులతో చర్చలు జరిపేందుకు బీజింగ్‌కు బయల్దేరినప్పుడు ఆదేశాలు ఇచ్చినట్లు కొన్ని మీడియాల్లో కథనాలు వచ్చాయి.

దారిమళ్ళుతున్న కేంద్ర నిధులు



మన తెలంగాణ/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని బిజెపి జాతీయ నాయకులు ఎన్.ఇంద్రసేనారెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ తన చౌకబారు మాటలతో తెలంగాణ రాష్ట్ర పరువు తీస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ బద్దం బాల్‌రెడ్డి, బిజెపి నేతలు ప్రేమేందర్‌రెడ్డి, మాధవిచౌదరి, ప్రకాష్‌రెడ్డి, సుధాకర్‌శర్మతో కలిసి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ లాభసాటి వ్యవసాయం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని, సిఎం కెసిఆర్ నాలుగు సంవత్సరాల కాలంలో రైతులకు ఏం చేశారని ప్రశ్నించారు. రైతుల రుణాలపై రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా కనీసం వడ్డీని కూడా బ్యాంకులలో చెల్లించలేదని ఆరోపించారు. ఉద్యమ సమయంలో కాంగ్రెస్ పార్టీని బజారున పడేస్తామని చెప్పిన కెసిఆర్, సోనియాగాంధీ కాళ్లు మొక్కిన విషయం అందరికీ తెలుసన్నారు. ప్రధాని మోడిపై సిఎం కెసిఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకునే వరకు బిజెపి శ్రేణులు తమపోరాటాన్ని కొనసాగిస్తారన్నారు.

ఇజ్రాయెల్ ప్రధానిపై విచారణ



ఇజ్రాయెల్: మోసం, లంచం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును శుక్రవారం ఎనిమిదో సారి పోలీసులు విచారించినట్లు మీడియా తెలిపింది. అదే సమయంలో టెల్ అవీవ్ సమీపంలోని జాతీయ మోస బృంద ప్రధాన కార్యాలయంలో ఆయన భార్య సారాను కూడా దర్యాపు అధికారులు విచారించారు. నెతన్యాహు మోసానికి పాల్పడిన కేసులో ఆయన మాజీ సహయకుడు నిర్ అఫెట్జ్, బడా వ్యాపారవేత్త షాల్ ఎలోవిచ్‌లతోపాటు ఏడుగురు అనుమానితులను వారం క్రితమే పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. పలువురు వ్యాపార వేత్తలతో ఆయన నాకు ఇది, నీకు అది (క్విడ్‌ప్రొకో) పద్ధతిలో అవినీతికి పాల్పడినట్లు నెతనాహ్యూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జర్మనీ జలాంతర్గాముల కొనుగోలు వ్యవహారానికి సంబంధించి కూడా దర్యాప్తు అధికారులు ఆయనను విచారించారు. పద వీ నుంచి తప్పుకోవాలని నెతన్యాహుపై ఒత్తిడి పెరుగుతోందని లేదా ముందస్తు ఎన్నికలకు వెళతారని ఊహాగానాలు వచ్చాయి. కాగా, తాను నిర్దోషినని, ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని నెతన్యాహు తెలిపారు.

నీరవ్ ఉన్నట్లు తెలియదు : అమెరికా



వాషింగ్టన్ : ఆర్థిక మోసాలకు పాల్పడ్డ నీరవ్ మోడీ తమ దేశంలో ఉన్నట్లుగా నిర్ధారణ కాలేదని అమెరికా ప్రభుత్వం స్పష్టం చేసింది. భారతదేశంలో పిఎన్‌బిని వేల కోట్ల రూపాయల మేర మోసగించిన నీరవ్ పరారయి, అమెరికాలో ఉన్నారని వార్తలు వెలువడ్డాయి. ఆయన ప్రస్తుతం న్యూయార్క్‌లో ఒక హోటల్‌లో ఉంటున్నట్లు, వ్యాపార కార్యకలాపాలు అక్కడి నుంచి నిర్వహిస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తల గురించి తమకు తెలిసిందని కానీ నీరవ్ అమెరికాలోనే ఉన్నట్లుగా ఇప్పటికైతే తాము నిర్ధారించలేకపోతున్నామని విదేశాంగ శాఖ అధికారులు శుక్రవారం ప్రకటించారు. నీరవ్ తన మేనమామ మెహుల్ ఛోక్సీ ఇతరులతో కలిసి పిఎన్‌బి నుంచి రూ 12000 కోట్ల మేర పొందినట్లు , భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు వివిధ దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టాయి. ఈ భారతీయ వ్యాపారవేత్త అమెరికాలో ఉన్నారా? ఉంటే ఎక్కడున్నారని వార్తా సంస్థలు వేసిన ప్రశ్నలకు అమెరికా స్పందించింది. నీరవ్‌పై వార్తలను చూస్తున్నామని, కానీ ఆయన ఇక్కడ ఉన్నారనేది నిర్దిష్టంగా చెప్పలేమని ప్రతినిధి వెల్లడించారు. నీరవ్ మోడీ జాడ కనుగొనేందుకు భారత ప్రభుత్వానికి దర్యాప్తు సంస్థలకు సహకరిస్తున్నారా? అనే ప్రశ్నకు విదేశాంగ శాఖ స్పందిస్తూ దీనిపై న్యాయవిభాగం స్పందిస్తుందని తెలిపింది. నీరవ్ మోడీపై దర్యాప్తునకు చట్టపరంగా సహకరించే విషయంలో స్పందించేందుకు సంబంధిత జస్టిస్ డిపార్ట్‌మెంట్ నిరాకరించింది. నీరవ్ అంశంపై మాట్లాడేందుకు అంగీకరించలేదు.

నిరుద్యోగుల సమస్యలు నిర్లక్ష్యం



మన తెలంగాణ/హైదరాబాద్: నిరుద్యోగుల సమస్యపై ప్రభుత్వానికి కొంత సమయమిస్తామని, అప్పటికీ స్పందించకుంటే ఇక ప్రేక్షకులుగా ఉండేందుకు ఎవరూ సిద్ధంగా లేరని తెలంగాణ జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. జెఎసి చేపట్టిన పోస్టు కార్డుల ఉద్యమంలో భాగంగా మాకు ఉద్యోగాలు కావాలంటూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2.20లక్షల కార్డులు సిఎంకు రాశారని, ఇంకా రాస్తున్నారని వెల్లడించారు. ఈ సమస్యపై విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి వివిధ దశలలో నిరసన కార్యక్రమాలు చేపట్టామని, దీనిని మరింత ఉధృతం చేస్తామన్నారు. 'సిఎంకు పోస్ట్ కార్డు' ఉద్యమంలో భాగంగా హైదరాబాద్‌లోని పలువురు నిరుద్యోగులు రాసిన ఉత్తరాలను శుక్రవారం

ఉద్యమాని ఉధృతం చేస్తాం : కోదండరామ్

కోదండరామ్ ఎర్రమంజిల్ పోస్ట్‌బాక్స్ లో వేశారు. అంతకుముందు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడి యా సమావేశంలో కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని నిర్మించిందే నిరుద్యోగ సమస్య అని అలాంటి సమస్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంని విమర్శించారు. 'ఉద్యమాలతో తెలంగాణను సాధించినా ఇంకా నిరుద్యోగులుగానే ఉండిపో యాం...మీరేమో ప్రగతి భవన్‌లో ఉన్నారు.. మేము ఏకమై మరొ క ఉద్యమం తేకముందే నోటిఫికేషన్లు విడుదల చేయాలి. తక్షణమే మా కొలువులు మాక్కావాలి.. లేదంటే లక్షలాది మందితో అసెంబ్లీని ముట్టడిస్తాం..ఉద్యోగులు వచ్చుడో.. కెసిఆర్ లేదా తాము సచ్చుడో జరగాలని' నిరుద్యోగులు తమ ఉత్తరాల ద్వారా ప్రభుత్వానికి నిరసన వ్యక్తం చేశారని కోదండరామ్ ఉత్తరాలను చదివి వినిపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తగిన కార్యచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జెఎసి ప్రతినిధులు జి.వెంకట్‌రెడ్డి, గోపాలశర్మ, మధుసత్యంగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, నిజ్జన రమేష్‌ముదిరాజ్, నర్సయ్య, మల్లికార్జున్, విద్యావెంకట్ తదితరులు పాల్గొన్నారు.

85% ఫీజు రీఇంబర్స్‌మెంట్ నిధుల విడుదల



మన తెలంగాణ / హైదరాబాద్ : ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం 2016–17 సంవత్సరానికి ఆమోదించిన రూ. 2290.79 కోట్లలో ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నాటికి రూ. 1955.53 కోట్ల (85%)ను విడుదల చేసింది. ఇంకా రూ. 335.25 కోట్లను విడుదల చేయాల్సి ఉంది. గత ఆర్థిక సంవత్సరానికి ట్యూషను ఫీజు రీఇంబర్స్‌మెంట్ కోసం వచ్చిన దరఖాస్తుల ప్రకారం డిమాండ్ రూ. 1802.09 కోట్లు ఉంటే పరిశీలన అనంతరం రూ. 1645.54 కోట్లు మాత్రమే ప్రభుత్వం ఆమోదించింది. ఇందులో రూ. 1433.06 కోట్లను విడుదల చేసింది. ఇక మెయింటెనెన్స్ ఫీజుకు మొత్తం రూ. 716.73 కోట్ల మేరకు ప్రతిపాదనలు అందితే పరిశీలన అనంతరం ప్రభుత్వం రూ. 645.24 కోట్లకు ఆమోదం తెలిపింది. ఇందులో రూ. 522.48 కోట్లను విడుదల చేసింది. ట్యూషను ఫీజు రీఇంబర్స్‌మెంట్‌లో అధికంగా బిసి విద్యార్థులకు రూ. 712.89 కోట్లు, ఆ తర్వాతి స్థానంలో ఎస్‌సి విద్యార్థులకు రూ. 241.46 కోట్లను, ఆ తర్వాత ఇబిసి విద్యార్థులకు రూ. 222.70 కోట్లను విడుదల చేసింది. మొత్తం లబ్ధి పొందిన 11.66 లక్షల మంది విద్యార్థుల్లో అత్యధికంగా బిసి విభాగంలో 6.59 లక్షల మంది, ఎస్‌సి విభాగంలో 2.03 లక్షల మంది చొప్పున ఉన్నారు. అంతకుముందు సంవత్సరం ట్యూషను ఫీజు రీఇంబర్స్‌మెంట్‌కు (13.14 లక్షల మంది విద్యార్థులు) ప్రభుత్వం ఆమోదించిన రూ. 2361.58 కోట్లలో రూ. 2333.16 కోట్లను విడుదల చేయగా కేవలం రూ. 28.43 కోట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారి ఒకరు వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ట్యూషన్ ఫీజు రీఇంబర్స్‌మెంట్ కోసం రూ. 1833.15 కోట్ల మేరకు ప్రతిపాదనలు రాగా కేవలం రూ. 745.20 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు రూ. 39.87 కోట్లను మాత్రమే విడుదల చేయగా ఇంకా రూ. 705.33 కోట్లను విడుదల చేయాల్సి ఉంది. ఇంకా విద్యా సంవత్సరం కొనసాగుతూ ఉన్నందున రానున్న విద్యా సంవత్సరంలో ఈ నిధులు విడుదలవుతాయని అధికారి వివరించారు.

నాలుగేళ్లయినా విభజన గాయాలు మానలేదు

- ప్రత్యేక హోదా వద్దని ఎప్పుడూ చెప్పలేదు
- టిడిపి పార్లమెంటరీ సమావేశంలో సిఎం చంద్రబాబు



అమరావతి: విభజన జరిగి నాలుగేళ్లయినా ఆ గాయాలు ఇంకా మానలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఎదురుదెబ్బ తగిలిందన్నారు. అమరావతిలో చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ సమావేశం కొనసాగుతోంది. ఈ సమావేశానికి పార్టీ ఎంపీలు, పలువురు మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఒక్కో ఎంపీ నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా రాదని, వద్దని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ప్రత్యేక హోదాకు సమానంగా ప్రయోజనాలు కల్పిస్తామని హామీ ఇచ్చినందునే ప్యాకేజీకి ఒప్పుకున్నట్లు తెలిపారు.ఇతర రాష్ట్రాలకు కూడా ప్రత్యేక హోదా ఉండదని చెప్పి.. ఇప్పుడు కొనసాగించడంలో ఆం తర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇస్తున్నందును ఆంధ్రప్రదేశ్‌కు అదే పేరుతో ఇవ్వా లని డిమాండ్ చేశారు. బిజెపి రాయలసీమ డిక్లరేషన్‌పై చంద్రబాబు మండిపడ్డారు. వైసిపికి విశ్వసనీయత లేదు ..నాటకాలు ఆడుతోందని ప్రజల్లోకి వెళ్లిందన్నారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం టిడిపి చిత్తశుద్ధితో పోరాడుతోందన్న అభిప్రాయం ప్రజల్లో ఉందని చంద్రబాబు అన్నారు. మంచి నాయకుడిని కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందన్న అభిప్రాయం ప్రజల్లో ఉందని చిత్తూరు ఎంపీ ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారు. కేంద్రం ఇంకా ఏదో చేస్తుందని అను కోవడం భ్రమేనని, మనపై ప్రజల్లో దురభి ప్రాయం రాకుండా చూసుకోవాలని అనంతపురం ఎంపి జేసీ దివాకర్‌రెడ్డి అన్నట్లు సమాచారం. ఈసమావేశం జరుగు తుండగానే దివాకర్‌రెడ్డి బయటకు వస్తూ మీడియా తో మాట్లాడారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు టిడిపి ఎంపీలందరూ పార్లమెంటులో నిరసన కొన సాగిస్తామని స్పష్టం చేశారు.

విభజన హామీలపై అవసరమైతే కోర్టుకెళ్తాం: గల్లా

టిడిపి పార్లమెంటరీ పార్టీ సమావేశం ముగిసిన అనంతరం ఎంపీలు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ.. 'రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లు గడిచింది. నాలుగో బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టింది. రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చాలని మేం ఏం మాట్లాడామో అంతా చూశారు. ఆర్థికబిల్లు ముందే టేబుల్ చేశారు. మళ్లీ అది చర్చకు వచ్చినప్పుడు సవరణలు ఉంటే ఆ రోజే తెలుస్తుంది. దానిలో ఎపికి ఫలానా హామీలు నెరవేర్చేందుకు కేటాయింపులు చేస్తామని చెబితే మంచిది. లేకపోతే దాన్నీ వ్యతిరేకిస్తాం.విడతలవారీగా మేం పోరాటం చేస్తాం. వైసిపి వాళ్లు ప్రత్యేక హోదా మాత్రమే అడుగుతున్నారు. ప్రత్యేక ప్యాకేజీలో అన్నీ ఇస్తామన్నారు కాబట్టే మేం దానికి అంగీకరించాం. ఇప్పటివరకు ఏమీ ఇవ్వలేదు కాబట్టే ఇప్పుడు ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తున్నాం. ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తాం.అన్ని రాజకీయ పార్టీలకు లేఖలు రాయాలని నిర్ణయించాం.దీన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్తాం.అందుకే ప్రతి పార్టీ అధ్యక్షుడితో పాటు ఫ్లోర్ లీడర్లు,ఎంపీలకు లేఖరాస్తాం.ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిఏమీఇవ్వలేదుకాబట్టే ప్రత్యేకహోదానుడిమాండ్ చేస్తున్నాం.

హామీలు అమలు చేసేవరకూ పోరాటం : తోట

'ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని మేం సభలో మాట్లాడాం. టిడిపి సభ్యులమంతా ముక్తకంఠంతో ప్రజల ఆవేదనను తెలిపాం. ఆఖరిరోజున అరుణ్‌జైట్లీ, అమిత్‌షా, సుజనా చౌదరి వీరంతా కలిసి కూర్చొని విధివిధానాలపై చర్చించారు. మనం చూశాం. కానీ, 15 రోజుల టైం అనుకున్నాం. ఈ రోజు వరకూ కేంద్రం నుంచి ఎపికి నిధుల కేటాయింపులు, ఇతర అంశాల్లో సాయం చేసిన పరిస్థితి కనబడటంలేదు. దీనిపై సీఎం సమక్షంలో ప్రజల ఆవేదనను వ్యక్తీకరించాం.దానిలో భాగంగా ఎపికి రావాల్సినవన్నీ కేంద్రాన్ని కోరుతున్నాం. హేతుబద్ధతలేని విభజనతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. అప్పట్లో కాంగ్రెస్ విభజించింది. భాజపా మద్దతు ఇచ్చింది. అందువల్ల ఇద్దరూ కలిపి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించారు. పార్లమెంట్‌లో ఈ బిల్లును ఆమోదించారు. ఆ రోజు చేసిన వాగ్దానాలు, పునర్విభజన బిల్లులో అంశాలను నెరవేర్చేందుకు ఎలాంటి నిధులూ ఇవ్వలేదు. అందుకే ఏపీకి ప్రత్యేక హోదా అడుగుతున్నాం.

ప్రజల వాణిని విన్పిస్తాం: రామ్మోహన్‌నాయుడు

'ఎపి హక్కుల కోసం పోరాడే విధంగా లోపలా బయటా నిరసన తెలిపాం. దానిపై కేంద్రం స్పందించి కొన్ని నిర్ణయాలు తీసుకుంటారనే ఆశ ఉండేది. తర్వాత జరిగిన ఏ చర్చల్లోనూ చెప్పిన మాటలు చెప్పడమే తప్ప హక్కులపై స్పష్టంగా అడుగుతున్న దానికి సమాధానం కేంద్రం నుంచి రాలేదు. మార్చి 5నుంచి సమావేశాలు ప్రారంభం అయిన తర్వాత ఒత్తిడిని తీవ్రతరం చేస్తాం. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఎపి తాలుకూ పరిస్థితిని వివరించేలా లేఖ రాస్తాం. హామీలు సాధించేందుకు ఉద్యమం చేయాల్సిన అవసరం రాష్ట్రానికి ఎందుకు వచ్చిందనేది లేఖలో స్పష్టంగా వివరిస్తాం. ఈఉద్యమంలో అన్ని పార్టీలు భాగస్వాములు కావాలని మేం కోరుకుంటున్నాం.

క్రికెటర్ల హోలీ సంబరాలు

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ, ప్రస్తుత క్రికెటర్లు హోలీ సంబరాల్లో మునిగి పోయారు. భారత మాజీ ఓపెనర్, విధ్వంసక ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్ కుటుంబం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకుంది. ఈ వేడుకలను సంబంధించిన చిత్రాలను ట్వీటర్‌లో పోస్ట్ చేసి ఆనందాన్ని పంచుకున్నాడు. దేశ వ్యాప్తంగా వివిధ నగరాల్లో ప్రస్తుత, మాజీ క్రికెటర్లు హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ తన పండుగ వేడుకల్లో మునిగి తేలారు. ధోని, కోహ్లి, రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, రైనా తదితరులు కూడా తమ కుటుంబ సభ్యులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. చాలా మంది క్రికెటర్లు, ఇతర క్రీడాకారులు అభిమానులను హోలీ శుభాకాంక్షలను తెలిపారు. హైదరాబాద్ స్టార్ ఆటగాడు వివిఎస్. లక్ష్మణ్, టీమిండియా వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ ఆటగాళ్లు హర్భజన్ సింగ్, ద్రవిడ్, గంగూలీ తదితరులు కూడా హోలీను పురస్కరించుకొని అభిమానులకు శుభాకాంక్షలు పేర్కొన్నారు. మరోవైపు జిమ్నాస్ట్ దీపా, రెజ్లర్ యోగేశ్వర్ దత్, భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ)తో పాటు అంతర్జాతీయ క్రికెటర్లు రమీజ్ రాజా, బ్రెటలీ, వార్నర్, డివిలియర్స్ తదితరులు కూడా సోషల్ మీడియా వేదికగా హోలీ శుభాకాంక్షలు తెలిపారు.



లోకల్ రైలులో శార్దూల్ ఠాకూర్ ప్రయాణం



ముంబయి: టీమిండియా ఫాస్ట్ బౌలర్ శార్దూల్ ఠాకూర్ ముంబయి లోకల్ రైల్ ప్రయాణించడం వైరల్‌గా మారింది. ఇటీవల ముగిసిన దక్షిణాఫ్రికా పర్యటనలో శార్దూల్ వన్డే, టి–20లలో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు. అక్కడి నుంచి టీమిండియా స్వదేశానికి చేరుకున్న విషయం తెలిసిందే. జట్టు సభ్యులతో పాటు శార్దూల్ కూడా ముంబయి చేరుకున్నాడు. అయితే ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వచ్చిన శార్దూల్ శరమాములుగా లోకల్ ట్రైన్‌లో బయలుదేరాడు. అంధేరి స్టేషన్ వరకు నడుచుకుంటూ వచ్చిన శార్దూల్ అనంతరం టికెట్ తీసుకొని తన గమ్యస్థానం పాల్ఘార్‌కు లోకల్ రైలులో వెళ్లి పోయాడు. టీమిండియాకు ప్రాతినిథ్యం వహిస్తున్న ఓ క్రికెటర్ ఇలా లోకల్ రైలు ప్రయాణించడం ఏంటని ప్రయాణికులు ప్రశ్నించుకోవడం కనిపించింది. మాములు రంజీ ట్రోఫీ ఆటగాళ్లు సెలబ్రిటీగా పేరు తెచ్చుకుంటేనే కార్లలో ప్రయాణించడం సాధారణంగా మారిపోయిన ఈ రోజుల్లో టీమిండియా ఆటగాడు ఇలా రైలులో ప్రయాణించడంపై ఆసక్తికరంగా మారింది. ఇదిలావుండగా రైలులోని కొందరూ యువకులు శార్దూల్‌ను గుర్తు పట్టారు. అతనితో సెల్ఫీలు దిగేందుకు ప్రయత్నించారు. అయితే శార్దూల్ మాత్రం దీనికి నిరాకరించాడు. తనకు మాములు జీవితం గడపడమే ఇష్టమని, ఎంత పైకి ఎదిగినా గతాన్ని మరచిపోనని స్పష్టం చేశాడు. కాగా, శార్దూల్ సెలబ్రిటీ స్థాయిని పక్కన బెట్టేసి ఇలా మాములు ప్రయాణికుడిలా రైలులో ప్రయాణించడంపై నెటిజన్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అతని వ్యవహారశైలిని కొనియాడుతూ పోస్ట్‌లు పెడుతున్నారు.



నవజ్యోత్‌కు స్వర్ణం

ఆసియా రెజ్లింగ్ పోటీలు

న్యూఢిల్లీ: ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ నవజ్యోత్ కౌర్ స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించింది. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో భారత రెజ్లర్ నవజ్యోత్ మహిళల 65 కిలోల ఫ్రిస్టయిల్ విభాగంలో స్వర్ణం సాధించి గెలుచుకొని త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో నవజ్యోత్ జపాన్‌కు చెందిన మిమా ఇమాయిను ఓడించింది. ప్రారంభం నుంచే నవజ్యోత్ ఆధిపత్యాన్ని చెలాయించింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ముందుకు సాగింది.

నవజ్యోత్ దూకుడుతో ప్రత్యర్థి కనీస ప్రతిఘటన కూడా ఇవ్వకుండానే చేతులెత్తేసింది. ఏకపక్షంగా సాగిన పోరులో నవజ్యోత్ 9–1తో విజయం సాధించింది. భారీ ఆశలతో బరిలోకి దిగిన భారత స్టార్ అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. ఒక్కో మ్యాచ్‌లో గెలుస్తూ చివరికి చాంపియన్‌గా అవతరించింది. హోరాహోరీగా సాగిన సెమీస్‌లో మంగోలియాకు చెందిన రెజ్లర్ బాయర్‌పై చెమటోడ్చి విజయం సాధించింది. ఫైనల్లో మాత్రం అసాధారణ ఆటతో చెలరేగిన నవజ్యోత్ సునాయాస విజయంతో పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. మరోవైపు రియో ఒలింపిక్స్ పతక విజేత సాక్షి మాలిక్ మాత్రం కాంస్యంతో సరిపెట్టుకుంది. ఈ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఆరు పతకాలు లభించాయి. ఇందులో ఒక స్వర్ణం, మరో రజతం, నాలుగు కాంస్య పతకాలు ఉన్నాయి.



జిమ్నాస్ట్ అరుణకు ఘనస్వాగతం

భారీగా తరలివచ్చిన అభిమానులు

మన తెలంగాణ/ శంషాబాద్: 2018 ప్రపంచ జిమ్నాస్టిక్ పోటీలలో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించి మొట్టమొదటిసారిగా ఢిల్లీ నుండి హైదరాబాద్ వచ్చిన బుద్ద అరుణరెడ్డికి శుక్రవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టు విలేజిలో రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, అరుణరెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బుద్ద అరుణ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ కప్ జిమ్నాస్టిక్‌లో కాంస్య పతకాన్ని సాధించడం చెప్పలేనంత ఆనందంగా ఉందన్నారు. ఈ కప్ సాధించడానికి అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని ఇచ్చిన కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా ప్రభుత్వ సహకారం మరవలేనిదన్నారు. ప్రపంచ కప్ జిమ్నాస్టిక్‌లో బంగారు పతకాన్ని సాధించడమే లక్ష్యం కృషి చేశానని, అయినా కాంస్య పతకం పొందడం హైదరాబాద్ ప్రజల ఆశీర్వాదమని అన్నారు. అనంతరం భారీగా హాజరైన అభిమానులతో కలిసి ఎయిర్ పోర్టు నుండి హైదర్‌గూడ వరకు ర్యాలీగా బయలుదేరారు.



క్రీడల అభివృద్ధికి కృషి

టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి



న్యూఢిల్లీ: దేశంలో క్రీడాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి అన్నాడు. క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలను ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చాడు. ఓ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోహ్లి ఈ విషయాన్ని చెప్పాడు. ప్రపంచంలో భారత్‌ను బలమైన క్రీడా దేశంగా చూడాలన్నదే తన చిరకాల స్వప్నమన్నాడు. దీనికి తనవంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నాడు. ప్రపంచ జనాభాలో రెండో స్థానంలో ఉన్న భారత్ క్రీడల్లో వెనుకబడి ఉండడం తనను ఎంతో ఆవేదనకు గురిచేస్తుందన్నాడు. దేశంలో క్రికెట్‌కు తప్ప ఇతర క్రీడలకు అంత ప్రాధాన్యత లభించడం లేదన్నాడు. చైనా, అమెరికా, రష్యా, కొరియాతో పాటు చాలా దేశాలు క్రీడల్లో సత్తా చాటుతున్నాయన్నాడు. ఇతర రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిన భారత్ క్రీడల్లో మాత్రం వెనుకబడి పోవడం ఆందోళన కలిగించే అంశమేనన్నాడు. దీని కోసం ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు మరింత వేగవంతం కావాల్సిన అవసరం ఉందన్నాడు. దేశంలో క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందించేందుకు సదా సిద్ధంగా ఉన్నానన్నాడు. దీని కోసం ఎటువంటి సహాయం కావాలన్న చేసేందుకు సిద్ధమన్నాడు. దేశంలో క్రీడలను అభివృద్ధి చేయడమే తన ముఖ్య ఉద్దేశమన్నాడు. సమయం దొరికితే క్రీడాభివృద్ధికి అవసరమయ్యే కార్యక్రమాలు చేపడుతానని కోహ్లి పేర్కొన్నాడు. క్రికెట్‌లో ఎంతో బలమైన శక్తిగా ఎదిగిన భారత్ ఇతర క్రీడల్లో ఆ స్థాయి ప్రతిభను కనబరచడం లేదన్నాడు. ఒక్క మ్యాచ్‌లో మెరిస్తే చాలు ఆ క్రికెటర్ జీవితం మారిపోతుందని, అతను సెలబ్రిటి స్థాయిని అందుకుంటాడని కోహ్లి అన్నాడు. అయితే ఇతర క్రీడల్లో ఎంత రాణించినా పట్టించుకునే వారేలేరన్నాడు. వ్యక్తిగతంగా ప్రతిభ కలిగిన వారే కొద్దో గొప్పో వెలుగులోకి వస్తున్నారని, మిగతావారిని పట్టించుకోక పోవడంతో తెర వెనుకే ఉండిపోవాల్సి వస్తుందన్నాడు. దేశంలో క్రీడాభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళికను అమలు చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నాడు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆయా రాష్ట్రాల పాలకులు నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నాడు. కాగా, దేశంలో క్రీడల అభ్యున్నతి కోసం తీవ్రంగా శ్రమిస్తానని కోహ్లి ఈ సందర్భంగా హామీ ఇచ్చాడు.

ఇద్దరు ఇద్దరే..

ధోని, కోహ్లిలపై భారత ప్రధాన కోచ్ రవిశాస్త్రి ప్రశంసలు



న్యూఢిల్లీ: టీమిండియాకు లభించిన ఆణిముత్యాల్లో విరాట్ కోహ్లి, మహేంద్ర సింగ్‌లు ఒకరని భారత ప్రధాన కోచ్ రవి శాస్త్రి అన్నాడు. భారత క్రికెట్‌కు చిరస్మరణీయ సేవలు అందించిన ఘనత ఇద్దరికి దక్కుతుందన్నాడు. క్రికెటర్లుగా, కెప్టెన్‌గా వీరిద్దరూ టీమిండియాకు అందించిన సేవలు చిరకాలం గుర్తుండి పోతాయన్నాడు. ప్రపంచ క్రికెట్‌లో ఇద్దరు ఇద్దరేనని చాటారని ప్రశంసించాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో టీమిండియా వన్డే, టి–20 సిరీస్‌లను గెలుచుకోవడం ఎంతో ఊరటనిచ్చిందన్నాడు. కెప్టెన్‌గా, ఆటగాడిగా కోహ్లి జట్టును నడిపించిన తీరును ఎంత పొగిడినా తక్కువేనన్నాడు. ప్రపంచ క్రికెట్‌లోనే కోహ్లి అత్యుత్తమ ఆటగాడు అనడంలో ఎటువంటి సందేహం లేదన్నాడు. అతనికి సాటి రాగల క్రికెటర్ మరొకడూ లేడంటే అతిశయోక్తి కాదన్నాడు. క్లిష్ట సమయంలో కూడా మొక్కవోని ధైర్యంతో జట్టును నడిపించిన ఘనత కోహ్లి సొంత మన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టెస్టులో ఒత్తడిని సైతం తట్టుకుంటూ కోహ్లి జట్టును నడిపించిన తీరు, అతని ధైర్యం తనను ఎంతో ఆకట్టుకుందన్నాడు. ఒకవైపు ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ ఆమ్లా, ఎల్గర్‌ల జోరును చూస్తుంటే భారత్‌కు విజయంపై ఏమాత్రం అవకాశాలు లేవన్నాడు. అయినా కోహ్లిలో ఏదో ఒక ఆశ కనిపించిందన్నాడు. ఒక్క వికెట్ కోసం అతను ఎంతో ఆసక్తితో ఎదురు చూశాడని, ఆ వికెట్ లభించగానే జట్టును విజయపథంలో నడిపించడంలో సక్సెస్ అయ్యాడని ప్రశంసించాడు. కోహ్లిలో అద్భుత సారథ్య ప్రతిభ దాగివుందనే చెప్పేందుకు ఈ ఉదాహరణ చాలని రవిశాస్త్రి వివరించాడు. కోహ్లి సారథిగా, ఆటగాడిగా రెండు బాధ్యతలను అత్యంత సమర్థంగా నిర్వర్తిస్తున్నాడని, అతను ఇదే జోరును కొనసాగిస్తే టీమిండియా విజయపరంపరకు ఢోకా ఉండదన్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన కోహ్లి భారత్‌కు లభించడం ఓ వరం వంటిదేనని శాస్త్రి అభిప్రాయపడ్డాడు.



ధోని సేవలు మరువలేనివి..

మరోవైపు టీమిండియాకు వెటరన్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనిపై కూడా శాస్త్రి ప్రశంసల వర్షం కురిపించాడు. క్రికెటర్‌గా, కెప్టెన్‌గా, వికెట్ కీపర్‌గా ధోని తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాడన్నాడు. ఇప్పటికి కూడా ధోని టీమిండియా కీలక ఆటగాళ్లలో ఒకడని స్పష్టం చేశాడు. మరి కొన్నేళ్లపాటు క్రికెట్ ఆడే సత్తా అతనిలో ఉందన్నాడు. జట్టుకు ధోని అందించిన సేవలు చిరకాలం గుర్తుండి పోతుందన్నాడు. కెప్టెన్‌గా, కీపర్‌గా కోహ్లి పోషించిన పాత్రను ఎంత పొగిడినా తక్కువేనన్నాడు. యువ ఆటగాళ్ల పోటీని సైతం తట్టుకొని ధోని జట్టులో తన స్థానాన్ని కాపాడుకుంటున్నాడని, దీనికి అతని ఫిట్‌నెసే ప్రధాన కారణమన్నాడు. ఫిట్‌నెస్‌లో ధోనికి సాటిరాగల క్రికెటర్ మరొకడూ లేడని శాస్త్రి అన్నాడు. భారత జట్టుకు లభించిన అత్యుత్తమ క్రికెటర్లలో ధోని ఒకడని, అతని సేవలు ఎప్పటికి చిరకాలంగా అలాగే పదిలంగా ఉండి పోతాయని శాస్త్రి పేర్కొన్నాడు. ఓ జాతీయ వార్త సంస్థకు ఇంటర్వ్యూలో శాస్త్రి ఈ విషయాలు వెల్లడించాడు.

అర్జెంటీనాతో భారత్ తొలి పోరు

- నేటి నుంచి అజ్లాన్‌షా హాకీ



ఇఫో (మలేసియా): ప్రతిష్ఠాత్మకమైన సుల్తాన్ అజ్లాన్‌షా హాకీ టోర్నమెంట్‌కు శనివారం తెర లేవనుంది. మలేసియాలో ఇఫో నగరంలో ఈ టోర్నీ జరుగనుంది. భారత్‌తో పాటు అర్జెంటీనా, మలేసియా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఐర్లాండ్ టోర్నీలో తలపడనున్నాయి. శనివారం జరిగే మొదటి మ్యాచ్‌లో భారత్ బలమైన అర్జెంటీనాతో తలపడనుంది. మరో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చిరకాల ప్రత్యర్థి ఇంగ్లాండ్‌ను ఢీకొంటుంది. మూడో మ్యాచ్‌లో ఆతిథ్య మలేసియా జట్టు ఐర్లాండ్‌ను ఎదుర్కొంటుంది. ఆదివారం జరిగే మ్యాచ్‌లో భారత్–ఇంగ్లాండ్‌తో, ఐర్లాండ్–అర్జెంటీనాతో, మలేసియా–ఆస్ట్రేలియాతో తలపడుతాయి. తొలి నాలుగు స్థానాల మధ్య సెమీఫైనల్ పోరు జరుగుతుంది. ఫైనల్ మార్చి 10న జరుగుతుంది. భారత్ తన మూడో మ్యాచ్‌లో బలమైన ఆస్ట్రేలియాతో తలపడుతుంది. ఈ మ్యాచ్ మంగళవారం జరుగుతుంది. చివరి మ్యాచ్‌లో భారత్ బలహీనమైన ఐర్లాండ్‌తో తలపడుతుంది. ఈ మ్యాచ్ మార్చి 9న జరుగనుంది. కాగా, టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టుకు సర్దార్ సింగ్ సారథ్యం వహిస్తాడు. డిప్యూటీగా రమణ్‌దీప్ సింగ్ వ్యవహరిస్తాడు.

జట్టు వివరాలు:

గోల్ కీపర్లు: సూరజ్ కర్కెరా, కృష్ణ బి పాఠక్
డిఫెండర్లు: అమిత్ రోహిదాస్, దిప్సన్ టిర్కి, వరుణ్ కుమార్, సురేందర్ కుమార్, నీలం సంజీప్‌మణ్‌దీప్ మోర్
మిడ్‌ఫిల్డర్స్: సర్దార్ సింగ్ (కెప్టెన్), సుమిత్ (సీనియర్), ఎస్.కె.ఉతప్ప, నీలకంఠ శర్మ, సిమ్రాన్‌జీత్ సింగ్
ఫార్వర్డ్స్: గుర్జంత్ సింగ్, రమణ్‌దీప్ సింగ్ (వైస్ కెప్టెన్), తల్విందర్ సింగ్, సుమీత్ కుమార్ (జూనియర్), శీలానంద్ లక్రా.
టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జట్లు: భారత్, మలేసియా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, అర్జెంటీనా.

కుప్పకూలిన సౌతాఫ్రికా

- చెలరేగిన స్టార్క్, ఆస్ట్రేలియాకు భారీ ఆధిక్యం



డర్బన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్‌లో 162 పరుగులకే కుప్పకూలింది. మిఛెల్ స్టార్క్ అద్భుత బౌలింగ్‌తో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 351 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా ప్రత్యర్థి బౌలర్ల ధాటికి తట్టుకోలేక తక్కువ స్కోరుకే చాప చుట్టేసింది. స్టార్ ఆటగాడు ఎబి.డివిలియర్స్ ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా డివిలియర్స్ పోరాటం కొనసాగించాడు. ఆస్ట్రేలియా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న డివిలియర్స్ 11 ఫోర్లతో 71 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఓపెనర్ ఐడెన్ మార్‌క్రామ్ (32), వికెట్ కీపర్ డికాక్ (20) మాత్రమే కాస్త రాణించారు. మిగతావారు ఘోరంగా విఫలమయ్యారు. దీంతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. ఆస్ట్రేలియా బౌలర్లలో స్టార్క్ ఐదు వికెట్లు తీశాడు. లియాన్‌కు మూడు వికెట్లు లభించాయి. అంతకు ముందు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 351 పరుగులకు ఆలౌటైంది. సౌతాఫ్రికా బౌలర్లలో కేశవ్ మహారాజ్ ఐదు, ఫిలాండర్ మూడు వికెట్లు తీశారు. మిఛెల్ మార్ష్ (96) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.